డిస్ట్రిబ్యూటరు
రాధాకృష్ణాఫిలింస్
రాజమండ్రి

మార్చి నెలలో ఆంధ్ర ప్రేక్షకులకు
ఆనందము నిస్తుంది!



రవీపిక్చర్సువారి.....

# పెంకిపిల్ల

తెలుగు

నిర్మాత దర్శకుడు
బి.వి. రామానందం


సహాయదర్శకుడు
యర్రా అప్పారావు బి.ఏ.

డిస్ట్రిబ్యూటర్లు :

ఆంధ్ర :
రాధాకృష్ణా ఫిలింస్, రాజమండ్రి

★

చిత్తూరు, రాయలసీమలకు :
నేతాజి ఫిలిం డిస్ట్రిబ్యూటింగ్ కం. ధర్మవరం




THE B. N. K. PRESS MADRAS



# నరసూస్ కాఫీపొడి


మీ ప్రియమైన పానీయం

ఇప్పుడు అన్నిచోట్లా దొరకును


శ్రేష్ఠమైన ప్లాంటేషన్ పీబెరీ,
ఎక్స్ట్రా బోల్డు కాఫీ గింజలు

7 పౌనులు, 3 పౌనులు, 1½ పౌను, ¾ పౌనుగల

సీలు చేయబడిన గుడ్డ సంచీలలో దొరుకును.



**నరసూస్ మాన్యుఫాక్చరింగ్ కో., లిడ్, సేలం**




ఆరోగ్యప్రదాయిని
సంతానకల్పవల్లి

కేసరీ కుటీరం లిమిటెడ్,
రాయపేట :: మద్రాసు 14.





ఉబ్బసము
శాశ్వతముగా
నయమగును

ఇరువది ఎనిమిది సంవత్సరములనుంచి
వైద్య ప్రసిద్ధిగాంచిన శాస్త్రోక్తమగు
ఉబ్బస నివారిణి.

## పురోహిత్ శ్వాసహరి

మంచి కెమిష్టులవద్దను, తయారు
చేయువారివద్దను 3 ఔ. 6 ఔ.
12 ఔన్సుల సీసాలు రు. 3/8/-
రు. 6/-, రు. 10/- లకు లభించును.



డాక్టరు-పురోహిత్ ఫార్మసి
కొల్హాపూరు (యమ్.యస్.యమ్. రైల్వే)





డోంగ్రేగారి
## బాలామృతం

బలహీనమైన బిడ్డలకు పుష్టియున్ను,
పళ్లు మొలిచేటప్పుడు అయ్యే విరేచనములు
నిలిపి, బలమును, ఆరోగ్యము నిచ్చును.

K. T. Dongre & Co. BOMBAY-4

# మీరు మెక్లీన్‌తో నేడు పళ్లు తోముకున్నారా?




నోటిని పరిమళభరిత మొనర్చి దుర్వాసనను నివారిస్తుంది

ఆమ్లాలను విరిచివేసి మీ ఇగుళ్లను సంరక్షిస్తుంది

పళ్లమీది మరకలను తొలగించి వాటిని ధవళతర మొనర్చుతుంది

పళ్లను ధవళవంతంగాను, ఆత్యాకర్షణీయంగాను చేయడమేకాక, వాటికి విశేషశుభ్రత, సంరక్షణ ఒసగు టూత్ పేస్టు మీకు కావలసినచో, మెక్లీన్ పెరాక్సైడ్ టూత్ పేస్టునే వాడండి.

అనుకరించ శక్యంకాని ఒక ప్రత్యేక సూత్రం ప్రకారం తయారైన మెక్లీన్స్ నోటిలోని అదనపు ఆమ్లాలను విరిచివేయడం, పంటిపై పాచిని కరిగించడం ద్వారా దంతక్షయాన్ని నివారిస్తుంది. దంతశోభను మరుగు పరిచే మరకలను తొలగిస్తుంది—పళ్లు ముత్యాలవలె మెరిసేటట్లు మెరుగు పెట్టుతుంది—ఇలా శుభ్రపరచడంతో పాటు నోటి దుర్వాసనను తొలగిస్తుంది.

నేడే మెక్లీన్స్ కొనండి




MTX 1-TQ



UMA 607
Stone Ring
Rs 9-12-0

UMA 738
Rs 1-0-0

# రు. 500 బహుమానము
## ఉమా గోల్డు కవరింగు వర్క్సు

ఉమా మహల్ :: మచిలీపట్నము

ఉమా గోల్డు కవరింగు వర్క్సు పోస్టాఫీసు.

అసలు బంగారు రేకు లోహముపైన అంటించి (Gold Sheet Welding on Metal) తయారు చేయబడినవి. కాదని రుజువు చేసినవారికి రు. 500 బహుమానమివ్వబడును. మేము తయారు చేయు ప్రతివస్తువు ప్యాకింగు పైన "ఉమా" అను ఇంగ్లీషు అక్షరములు గుర్తించి కొనవలెను. బంగారు వన్నె 10 సంవత్సరములు గ్యారంటీ.

* * *

పరీక్ష చేయగోరువారు ఉమా ఆభరణములను మహా ద్రావకములో వేసిన 5 నిమిషములకే బంగారము రేకు వెడలివచ్చును. ఈ విధముగా పరీక్ష చేసినవారు అనేకమంది మాకు సర్టిఫికేట్లు యిచ్చియున్నారు. 800 డిజయినుల క్యాటలాగు ఉచితముగా పంపబడును. ఇతర దేశములకు క్యాటలాగు ధరలమీద 25% అధికము.

*N.B.*—వస్తువుల వి. పి. పార్సిలు చార్జి 0-15-0 మాత్రమే అగును.

Tel : "UMA" MASULIPATAM

# పెరుగుచున్న పసిబిడ్డలకు విటోఫెర్రిన్ అత్యవసరం



పసిపాపలకు విటో ఫెర్రిన్ యిచ్చి, వారి పెరుగుదలను గమనించండి. పెరుగుచుండు పాపాయిలకును, వ్యాధుల నుండి తేరుకొనుచుండువారికిని, శరీరాభివృద్ధికి అత్యవసరమగు వస్తువిశేషాలు ఇందులో ఉన్నవి.

I·T·L

తయారుచేయువారు :
ది మైసూర్ ఇండస్ట్రియల్ & టెస్టింగ్ లాబొరేటరీ లిమిటెడ్,
మల్లేశ్వరం, బెంగుళూరు.

విక్రయ ప్రతినిధులు : బెస్ట్ & కంపెనీ, లిమిటెడ్,
పోస్ట్ బాక్స్ నెం. 63, మదరాసు.

BZ 25-T6

# ఆంధ్రబ్యాంక్ లిమిటెడ్

స్థాపితము: 1923

## హెడ్డాఫీసు - మచిలీపట్టణము

| | | | |
|---|---|---|---|
| అధికారము పొందబడిన మూలధనము | — | రు. | 1,00,00,000 |
| చందా వేయబడి, జారీచేయబడిన మూలధనము | — | రు. | 48,99,000 |
| చెల్లింపబడిన మూలధనము | — | రు. | 25,00,000 |
| రిజర్వు ఫండు | — | రు. | 9,00,000 |
| డిపాజిట్లు | — | రు. | 5,00,00,000 |
| అమలులోనున్న వ్యాపారము మొత్తము | — | రు. | 6,00,00,000 |

మదరాసు బ్రాంచి: బాంబే మ్యూచుయల్ బిల్డింగు, 378, ఎస్ప్లనేడు.

త్యాగరాయనగర్ ఆఫీసు: 81|82, పాండీ బజారు

మైలాపూరు ఆఫీసు: 49, కచేరీ రోడ్డు

ఇతర బ్రాంచీలు, సబ్ ఆఫీసులు:

మచిలీపట్టణము, నెల్లూరు, తెనాలి, గుంటూరు, విజయవాడ, బాపట్ల, ఏలూరు, రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్టణము, విజయనగరం, బరంపురం (గంజాం), గూడూరు (నెల్లూరుజిల్లా), ఒంగోలు, చీరాల, దుగ్గిరాల, నరసారావుపేట, వినుకొండ, అరండల్ పేట (గుంటూరు), గవర్నరుపేట (విజయవాడ), గుడివాడ, పాలకొల్లు, భీమవరం, సామర్లకోట, రామరావుపేట (కాకినాడ), పిఠాపురం, తుని, అనకాపల్లి, చికాకోలు (వైజాగ్), జయపూరు (ఒరిస్సా), పెద్దాపురం, అమలాపురం, ఆమదాలవలస, తిలారు, సాలూరు, పెడన, చల్లపల్లి (కృష్ణా), మహారాణి పేట (వైజాగ్), జగ్గయ్యపేట(కృష్ణా), గొల్లప్రోలు (తూ.గో.) పార్వతీపురం.

ఫిక్సెడ్ డిపాజిట్లు: నూరురూపాయలకు తక్కువ కాని మొత్తములను 3, 6, 12, 24 మాసములకు అన్నిబ్రాంచీలలోను తీసుకొనబడుచున్నవి.

3 సంవత్సరముల క్యాషు సర్టిఫికేట్లు యీ బ్యాంకులో ప్రత్యేక సౌకర్యము. అన్నిరకముల చెక్కులు, డ్రాఫ్టులు, డివిడెండు వారంట్లు, హుండీలు, వసూలుచేసి పెట్టబడును.

గవర్నమెంటు పత్రములు, షేర్లుకొనుట, అమ్ముట మొదలగు వ్యాపారములు కూడ చేయబడును. వివరము లే ఆఫీసులోనైనను తెలిసికొనవచ్చును.

యి. రామచంద్రమూర్తి,
యం. ఎ., సి. ఎ. ఐ. ఐ. బి.,
ఆక్టింగ్ జనరల్ మేనేజరు.

తాడేపల్లి శ్రీరాములు,
మేనేజింగ్ డైరెక్టరు.

నాలుగు భాషలలో

# చందమామ

★

(తెలుగు) **చందమామ**

విడిసంచిక 0-6-0 | సాలుచందా : 4-8-0
రెండేండ్లకు : 8-0-0

(కన్నడ) **చందమామ**

విడిసంచిక 0-6-0 | సాలుచందా : 4-8-0
రెండేండ్లకు : 8-0-0

(హిందీ) **చందమామ**

విడిసంచిక 0-6-0 | సాలుచందా : 4-8-0
రెండేండ్లకు : 8-0-0

(అరవ) **అంబులిమామ**

విడిసంచిక 0-6-0 | సాలుచందా : 4-8-0
రెండేండ్లకు : 8-0-0

చందమామ పబ్లికేషన్స్

పోస్టు బాక్స్ 1686 :: మద్రాస్-1

# మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే

బాధపడుచున్నయెడల వెంటనే

పాత్రుడుగారి

# బాలసంజీవిని

యీయండి

ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.

వివరములకు:

## డా॥ పిల్లా పాపయ్యా పాత్రుడు & బ్రదరు,

11, దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.

కుంభకోణం బ్రాంచి:
నెం. 7, సారంగపాణి కోవిల్,
తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి:
నెం. 15, పుగళైపిళ్ళై వీధి,
తెప్పకొలం.



## బార్లీ నీళ్లు మరియు గంజి ఈ విధంగా తయారుచేయడం సులభము.




బార్లీ నీళ్లు: సమమట్టంగా రెండు టీస్పూనుల ప్యూరిటీ బార్లీని నీళ్లతో ముద్దచేసి, ఒక పయింటు నీళ్లలో [illegible], ఐదు నిమిషాలు మాత్రమే తాపీగా ఉడకనిస్తేచాలు. రుచికి ఉప్పో, పంచదారో లేకపోతే నిమ్మరసమో కలపండి.

గంజి: దీనిని మామూలు ప్రకారమే చేయండి, కాని తయారు చేయడానికి 20 నిమిషాలే తీసుకుంటుంది. ఒక్క చెంచాడు ప్యూరిటీ బార్లీ ఎనిమిది చెంచాల సాధారణ బార్లీబియ్యంతో సమానమని గమనించండి.




అట్లాంటిస్ (ఈస్ట్) లిమిటెడ్, పోస్ట్ బాక్స్ నెం. 664, కలకత్తా.

APBX-7-70

ఆంధ్రదేశమందలి ప్రధానకేంద్రములలో

సెప్టెంబరు 15 విడుదల!

అమూల్యమైన పౌరాణిక చిత్రము!



ఆంధ్రజ్యోతి

.....సచిత్ర మాస పత్రిక......

సంపుటి 14 ]    సెప్టెంబర్ 1950    [ సంచిక 3

# మన రాజకీయాలు

బాబు పురుషోత్తమదాస్ టాండన్ కాంగ్రెస్ అధ్యక్షుడుగ ఎన్నికైనారు. పోయిన సంవత్సరం డాక్టరు పట్టాభి సీతారామయ్యగారితో పోటీచేసి ఓడిపోయినారు. తిరిగి ఈ సంవత్సరం ఎన్నికలో పాల్గొంటానని అనుకోలేదు. మిత్రులు చాలామంది బలవంతపెట్టినారనీ అంచేతనే తిరిగి పోటీచేయవలసి వచ్చింది అనీ తమ అభ్యర్థిత్వాన్ని సమర్థించుకున్నారు.

డాక్టర్ పట్టాభి, టాండన్‌గార్లతోబాటు పోయిన సంవత్సరం ఆచార్య కృపలానీగారూ పోటీచేయదలచి ఆఖరుక్షణంలో విరమించుకున్నారు. ఈ సంవత్సరం ఎన్నికల్లో పోటీచేసిన టాండన్, కృపలానీగార్లు రెండేళ్ళక్రితమే కాంగ్రెస్ అధ్యక్ష పదవిని అకాంక్షించారు. ఎటొచ్చీ శంకర్రావ్ దేవ్‌గారు పోయిన ఎన్నికల్లో పోటీ చేయదలచినా అంత హడావిడి లేకుండానే మొదట్లోనే విరమించుకున్నారు. అలా చేయడం చాలా మంచిదైంది అని ఈ సంవత్సరం వారికివచ్చిన వోట్లమొత్తాన్ని బట్టి అనుకోవాలి.

పురుషోత్తమదాస్ టాండన్‌గారికి 1306 వోట్లు వచ్చినవి. కృపలానీగారికి 1092 వచ్చినవి. శంకర్రావ్ దేవ్‌గారికి 202 వోట్లు వచ్చినవి. 18 వోట్లు 'తాలు' వోట్లయినవి. నాసిక్ కాంగ్రెస్‌కు వివిధరాష్ట్రాలనుండి ఎన్నిక కావలసిన ప్రతినిధులు మూడువేలమంది. అందులో ఆంధ్రులు 193 మంది. వీరిఎన్నిక "జరుగనే లేదు." ఏవిధంగానైనాసరే ఆగస్టు 29 లోపున ఎన్నికలు పూర్తిచేయించాలని అధిష్ఠానవర్గంవారు ఎన్నో ప్రయత్నాలు చేశారు. ముందు గోకుల్భాయ్‌బట్‌ను పంపారు. ఆయన రాష్ట్రకాంగ్రెస్ పక్షపాతిగా వ్యవహరించారని ఫిర్యాదులు

వెళ్ళగా కార్యవర్గసభ్యుడు శ్రీ యస్. కె. పాటిల్‌ను పంపారు. రెండురోజులు మద్రాసులో విచారణజరిపి తీర్పులిచ్చి, ఆ తీర్పులప్రకారం ఎన్నికలు జరిపించేందుకు మహాశబ్దేగారి నాయకత్వాన పరిశీలకులను పంపారు.

ఒక యాభై పంచాయతీలలో తప్ప మిగతాచోట్ల తాము ఎన్నికలను పూర్తి చేసినట్లు మహాశబ్దేగారు ప్రకటించారు. ప్రతినిధుల ఎన్నికలు జరుగవలసి ఉండగా కోర్టుల్లో దావాలుపడ్డవి. రాష్ట్రకాంగ్రెస్ సంఘం చాలా అక్రమాలు చేసినదనీ, ఎన్నికలు మొదట్నుంచీ జరగాలనీ మళ్లీ పైవారికి ఫిర్యాదులు వెళ్లినవి. ఇవాళ రాష్ట్రకాంగ్రెస్‌లో అధికారంలోఉన్న రంగావర్గం అధికారంలో ఉన్నంతకాలం ఈ ఎన్నికలు సక్రమంగా జరిగే అవకాశంలేదని ఫిర్యాదుదారులు కాంగ్రెస్ పెద్దలవద్ద వాదించారు. వీరి వాదనకు ఆంధ్రలో ఈనాటివరకూ ఎన్నికలు జరక్కపోవడంకంటె వేరే బలం ఏమీ అక్కర్లేదు. వీరి వాదం సహేతుకమైందేనని పైవారూ అంగీకరించినందువల్లనే రాష్ట్రకాంగ్రెస్‌ను రద్దుచేసి ఒక ప్రత్యేకోద్యోగిని నియమించారు. ఆంధ్రులకు ఇంతకు మించిన అవమానం మరొకటి ఉండదు. దాదాపు 30 సంవత్సరాలక్రిందట ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రకాంగ్రెస్‌సంఘం వచ్చింది. దేశోద్ధారక, దేశభక్త, ఆంధ్రకేసరి, డాక్టర్ పట్టాభిలాంటివారు అధ్యక్షులుగా ఉండి ఈసంఘాన్ని నిర్వహించారు. ఇలాంటి అవమానాలు ఎన్నడూ జరుగలేదు. పట్టాభిగారు రాష్ట్రకాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉండగా పశ్చిమ కృష్ణాలో వేలసంఖ్యగా కాంగ్రెస్ సభ్యులను త్రోసివేశారు. సుభాష్‌చంద్రబోస్ అధ్యక్షుడుగావచ్చికూడా ఈ వ్యవహారాన్ని రాష్ట్రకాంగ్రెస్ నిర్ణయానికి ప్రతికూలంగా చేయలేకపోయినారు.

అలాంటిది ఆచార్యరంగాగారు రాష్టకాంగ్రెస్ అధ్యక్షుడైనప్పట్నుంచీ ఒక్క నిర్ణయంకూడా పైవారి ఆమోదాన్ని పొందలేదు. వీరు ఏదిచేసినా పైవారు త్రోసివేస్తూనేవచ్చారు. పైగా రంగాగారు కాంగ్రెస్‌కార్యవర్గ సభ్యులుగాకూడా ఉన్నారు. ఏమాత్రం ఆత్మగౌరవంఉన్నా కార్యవర్గ సభ్యత్వానికి రాజీనామా ఇచ్చిఉండవలసింది. అలాచేయలేదు. పైగా పటేల్, నెహ్రూ ప్రభృతులు పట్టాభిగారికి ప్రతిగా తమపక్షమే ఉన్నారంటూ ప్రచారంచేశారు. వీరి ప్రచారమే నిజమైతే వీరి రాష్ట్రకాంగ్రెసుకు ఇలాంటి దుస్థితిపడితే పటేల్‌గారు జోక్యంపుచ్చుకోకుండా ఊరుకుంటారా?

దీనివల్ల ఒక్కవిషయం స్పష్టమౌతున్నది. మనకు నిజంగా రాష్ట్రంవచ్చినా మనకు శాసనసభలూ మంత్రివర్గాలూగాక సె. 93 పరిపాలనే శరణ్యమయ్యేది. ఈవిధంగాఅయితే నిజంగా రాష్ట్రంరాకపోవడమే మంచిదైంది.

అధ్యక్షుడుగా ఎన్నికైన టాండన్‌గార్ని అభినందిస్తూ ఈఎన్నికలో పాల్గొనే అదృష్టం ఆంధ్రులకు లేకపోయిందని రంగాగారు విలపించారు. ఇది స్వయం కృతమే అని ఇప్పటికైన వీరు గ్రహించివుంటే ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్‌సంఘం రద్దుకావడం అంటూ ఉండేదేగాదూ! పటేల్, నెహ్రూలనుమించిన రైతు నాయకుడ్ని అని అనుకుంటున్నంతకాలం రంగాగారు నిజస్థితిని తెలుసుకోలేరు.

ఆంధ్ర తగాదాలవిషయంలో టాండన్‌గారు నిష్పక్షపాతంగా వ్యవహరించడానికి అవకాశంఉంది. ఆంధ్రప్రతినిధులు అధ్యక్షుని ఎన్నికలో పాల్గొనలేదు. కాబట్టి ఒక వర్గం తనపక్షం, మరొకవర్గం తన ప్రత్యర్థులపక్షం అని భావించడానికి అవకాశం లేదు. టాండన్‌గారు పక్షపాతం చూపుతున్నారని ఆంధ్రవర్గాలు ఆరోపించడానికీ వీలులేదు. ఈవిధంగా ఆంధ్రులు కాంగ్రెస్ అధ్యక్షుని ఎన్నికలో పాల్గొనకపోవడం కూడా మంచిదేనేమో అనిపిస్తుంది.

ఆగస్టు ఆఖరు ఆదివారంనాడు చెన్నపట్నంలో అఖిలభారత కాంగ్రెస్ కార్యదర్శి, ఆంధ్ర తగాదాల్లో ఒక పక్షానికి నాయకుడు అయిన కళా వెంకట్రావుగారికీ, రాష్ట్రకాంగ్రెస్ అధికారవర్గం ప్రతినిధిగా రాష్ట్రకాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శ్రీ పి. తిమ్మారెడ్డిగారికీ జరిగిన ఒడంబడికకు విజయవాడలో విఘాతంకలగక పోయినట్లయితే పరిస్థితులు ఇంత దారుణంగా మారిపోయేవిగాదు. చెన్నపట్నం ఒడంబడిక విఫలం కావడానికి ఆఖరుక్షణంలో రాష్ట్రకాంగ్రెస్ అధికారవర్గంవారు కర్నూలు, గుంటూరు జిల్లాలనుండి "పోటీలేకుండా ఎన్నికైన" ప్రతినిధుల జాబితా అంటూ తయారుచేసి ఆ జాబితానుకూడా అంగీకరిస్తేగాని చెన్నపట్నము ఒప్పందాన్ని స్థిరపరచమనీ పట్టుబట్టారు. ఒప్పందాన్ని రద్దుచేయడమే వీరిలా పట్టుబటడంలోఉన్న అసలు ఉద్దేశ్యం అని విజయవాడ చర్చల ధోరణినిబట్టి గ్రహించవలసి[illegible]ంది. కాంగ్రెస్ కార్యవర్గం రాష్ట్రకాంగ్రెస్ సంఘాన్ని రద్దుచేసి యస్. కె. ప[illegible]ల్‌ను ప్రత్యేకాధికారిగా నియమించడంవల్ల రాష్ట్రకాంగ్రెస్ అధికారవర్గ అభీష్టం సిద్ధించలేదు.

ఇప్పటికైనా రంగావర్గమువారు ప్రతివిషయంమీదా పైవారితో ఘర్షణపడి, రాష్ట్రకాంగ్రెస్‌ను అల్లరిపాలుచేయడాన్ని విరమిస్తారా? విరమింపకపోతే ఆంధ్రులకు రాష్ట్రంతోబాటు, రాష్ట్రకాంగ్రెస్‌కూడా లేకుండాపోతుంది!

* * *

మూడేళ్లక్రితం దేశం స్వతంత్రమైనప్పట్నుంచీ ఒకదాని తరువాత ఒకటిగా మహావిపత్తులు వచ్చిపడుతున్నది. దేశవిభజనవల్ల ఏర్పడిన కాందిశీక సమస్య స్వరూపం భారతనాయకులకు అవగతం కాకముందే కాశ్మీరు యుద్ధం ప్రారంభమైంది. ఈ రెండింటితో సతమతమవుతుంటే దారుణమైన ఆహారసమస్య ఏర్పడింది. పదేళ్లనుంచీ సస్యాభివృద్ధికి పథకాలు తయారవుతూనే ఉన్నవి. అధికాహారోత్పత్తి కార్యక్రమాలక్రింద కోట్లకొలది రూపాయలు ఖర్చు అవుతూనే ఉన్నవి, అయినా ఆహార సమస్య నానాటికి విషమిస్తూ వచ్చింది. అటు బీహార్లోనూ ఇటు మన రాష్ట్రంలోనూ క్షామపరిస్థితులుకూడా ఏర్పడుతున్నవి.

ఈస్థితిలో ఆగస్టు 15 న అస్సాంలో దారుణమైన భూకంపం వచ్చింది. తరువాత వారంరోజులవరకూ ఈ భూకంపంవల్ల ఆ ప్రాంతానికి ఎంత నష్టం వచ్చిందోకూడా తెలియలేదు. ఎన్నికోట్లరూపాయల నష్టం కల్గిందీ ఇప్పటికీ సరియైన అంచనాలేదు. భూకంపంవల్ల కొన్నిప్రాంతాల్లో జలాశయాలు ఎండిపోవడం, మరికొన్ని ప్రాంతాల్లో నదులుపొంగి వేలాదిమైళ్ళప్రాంతం జలమయమైపోవడం జరిగింది. ఇంతవరకూ ఆప్రాంతం ప్రమాదాలనుండి బయటపడిందని ధైర్యంగా ఉండేందుకు వీలుగావడంలేదు,

ఇన్నిదెబ్బలను తట్టుకొని దేశఆర్థికవ్యవస్థను సామాజికవాదంప్రకారం పునర్నిర్మించడం ఏలాటి ప్రభుత్వానికైనా సాధ్యంగాదు, వీటికితోడు ఒకవైపు కమ్యూనిస్టులు. మరొకవైపు సోషలిస్టులు కార్మికులను సమ్మెలకు ప్రోత్సహించి ఉత్పత్తిని అధికం చేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు విఘాతం కల్పిస్తున్నారు. బొంబాయిలో బట్టలమిల్లు కార్మికులు నెలరోజులుగా సమ్మెచేస్తున్నారు. దేశంలో అనేక ప్రాంతాల ఇతర పరిశ్రమల కార్మికులు సానుభూతి సమ్మెలు చేస్తున్నాయి. ఈసమ్మెలవల్ల ప్రజావసరవస్తువుల ఉత్పత్తి, అందువల్ల దేశసంపద తగ్గిపోతున్నది. ప్రజల ఆదాయప్రమాణం పెరిగినా, అందువల్ల వారి జీవనప్రమాణం వృద్ధికావడానికి అవకాశంలేకుండా పోతున్నది. వస్తూత్పత్తికి కారకులైన వివిధవర్గాలవారందరూ మనస్ఫూర్తిగా ప్రభుత్వానికి సహాయంచేస్తే తప్ప ఈ విషమసమస్యలు పరిష్కారంకావు. ఈ సమస్యలన్నీ పరిష్కారం అయితేనేతప్ప కమ్యూనిజంవ్యాప్తిని అరికట్టేందుకు జరిగే ప్రయత్నాలేవీ ఫలప్రదంకావు.

# రాజర్షి రాష్ట్రపతి



రాజర్షి పురుషోత్తమదాస్ టాండన్ ఈ నెలలో నాసిక్‌లో జరుగనున్న 56 వ కాంగ్రెసు మహాసభాధ్యక్షుడుగా ఎన్నిక అయినారు.

ఈ ఎన్నిక కలిగించినంత సంచలనం, కాంగ్రెసు చరిత్రలో వేరొకటిలేదు. అసలు అధ్యక్ష పదవికి పోటీ జరిగింది నాలుగు సార్లే. మొదటిసారి సుభాస్‌చంద్ర బోస్‌తో డాక్టర్ పట్టాభిగారు పోటీ చేశారు. రెండవసారి మౌలానా అజాద్‌తో యం. యన్. రాయ్ పోటీచేశారు. మూడవసారి డాక్టర్ పట్టాభిగారితో బాబూ టాండన్ పోటీచేశారు, నాల్గవతూరి బాబూ టాండన్‌తో ఆచార్య కృపలానీ, శంకర్రావు దేవ్‌లు పోటీచేశారు.

ఎన్నికలు, పోటీలు, ప్రజాస్వామిక వ్యవస్థకు ప్రాతిపదికలేఅయినా, ఆదిలో సుభాస్‌చంద్రబోస్‌తో డాక్టర్ పట్టాభి పోటీచేసిననాడు పాదుకొన్న విభేదాలు తరగలేదు.

కాంగ్రెసు చరిత్రను అవలోకించితే, సర్వాధికారం హస్తగతం కావడంతో కాంగ్రెసువాదులలో కలిగిన నైతిక పతనాన్ని పరిశీలించితే, స్వీయ ప్రాబల్యసాధనకై కాంగ్రెసుముఠా వేస్తున్న ఎత్తుపై ఎత్తులను గ్రహించితే, టాండన్ ఎన్నిక కాంగ్రెసు సంస్థ సమూలంగా పతనంకావడానికి రాజబాట కాగలదేమోనని అనుమానం వేస్తుంది.

* * *

శ్రీ టాండన్ కాంగ్రెసు కులవృద్ధులలో ఒకరు. 68 సంవత్సరాలు. నెరసిన గడ్డం, జుట్టూ వయోభారానికి మాత్రమేగాక మేధానంపత్తికికూడాచిహ్నాలే.

ఏ విషయమైనా సరే తను నమ్మింది కుండ బ్రద్దలుగొట్టినట్టు చెప్పి, తను చెప్పినట్టు అక్షరాలా నడిచే స్వభావంగలవారు. బహుపట్టుదలగల మనిషి. ఏ విషయాన్నిగురించి అయినా ఆయనకు వుండే అభిప్రాయం ఒక్కటే. దానికి మార్పంటూ వుండదు. కొందరు పెంకిఘటమనికూడా అనుకోవచ్చు.

అయితే, సామాన్య కుటుంబంలో పుట్టి పెరిగినవాడు కావడంచేత సామాన్య ప్రజల కష్టసుఖాలలో సమపాలు తీసుకోగలరు, అందుచేతనే సామాన్య ప్రజల ఆదరాభిమానాలను ఎక్కువగా చూరగొన్నారు ఈ రాజర్షి.

స్వస్థలం అలహాబాదు. అక్కడే ప్లీడరువృత్తి నిర్వహించారు. ఆదిలో అంతగా లేకపోయినా, న్యాయవాదవృత్తిలో బాగా సంపాదించినవారే.

1910 సంవత్సరంలో హిందీ సాహిత్యసమ్మేళనానికి అధ్యక్షత వహించారు. అదే ఆయన రాజకీయాలలో ప్రవేశించడానికి అంకురార్పణ.

సూరత్ కాంగ్రెసు మహాసభతో కాంగ్రెసులో ప్రవేశించారు.

అలహాబాద్‌లో ప్లీడరీవృత్తిని నిర్వహిస్తూవుండగానే, రౌలట్ చట్టం నిరసనోద్యమంలో చేరారు. తరువాత ప్రారంభమైన సత్యాగ్రహోద్యమంలో ఇట్టే చేరిపోయారు.

సహాయనిరాకరణోద్యమం రోజులలో ప్రాక్టీసు వదలివేసి, పూర్తిగా రాజకీయరంగంలో ప్రవేశించారు.

సహాయనిరాకరణోద్యమానంతరం జీవనోపాధికై లాహోర్‌లోని పంజాబు నేషనల్ బాంక్ సెక్రటరీ ఉద్యోగంచేశారు. ఆ సందర్భంలో చాలాకాలం ఆయన పంజాబులోనే వుండిపోయారు. లాలా లజపతిరాయ్ మరణానంతరం సర్వెంట్స్ అఫ్ పీపుల్స్ సొసైటీ నాయకులలో ఒకరైనారు. తదనంతరం చాలాకాలం అలహాబాద్ మునిసిపల్ చైర్మెన్‌పదవి నిర్వహించారు. పిమ్మట అలహాబాద్ జిల్లా కాంగ్రెసు అధ్యక్షపదవిని నిర్వహించారు. ఈ పదవిలో వుండగానే సత్యాగ్రహోద్యమాలలో పాల్గొని జైళ్లకు వెళ్లారు. 1932 సంవత్సరంలో పన్నుల నిరాకరణోద్యమంలో ఆయనచేసిన కృషి అద్వితీయం.

తను నమ్మినదాన్నే అనుసరిస్తాడని, అందుకు ప్రతికూలంగా వారెంతటివారైనా ఈయన ప్రతిఘటిస్తాడని చెప్పటానికి ఒక నిదర్శనం వున్నది. 1940 లో హిందీ సాహిత్యసమ్మేళనంలో హిందీ-హిందూస్థానీ వివాదం చెలరేగింది. ఉర్దూ కలసిన హిందూస్థానీకోసం సభాధ్యక్షుడు అయిన గాంధీజీ పట్టుపట్టాడు. అది

భారతదేశం విచ్ఛిన్నానికి దారితీస్తుందని హిందీవాదులు వాదించారు. తుదకు తన పదవికి రాజీనామాచేసి గాంధిజీ వైదొలగగా, ఆ పదవిని టాండన్ స్వీకరించి తన వాదనకు అనుకూలంగానే సమ్మేళనాన్ని నడిపించారు.

1937 లో కాంగ్రెసు మంత్రివర్గాలు అధికారాన్ని స్వీకరించినపుడు యు. పి. అసెంబ్లీ స్పీకర్ అయినారు. తదాది మొన్నటివరకు ఆ పదవిని నిర్వహించారు. 1941 లో అరెస్టుచేసి 8 మాసాలు, తిరిగి 1942 ఆగస్టు 9 తేదిన అరెస్టు చేసి రెండు సంవత్సరాలు ఈయనను బ్రిటిషు ప్రభుత్వం జైలులో బంధించింది. తిరిగి 1947 లో కాంగ్రెసు ప్రముఖులు అధికారాన్ని స్వీకరించగానే మళ్ళీ స్పీకర్ పదవిని అధిష్ఠించారు. స్పీకర్‌గా నిష్పక్షపాత వైఖరికి, సమభావానికి ఆయన పెట్టింది పేరనిపించుకొన్నారు. స్పీకర్ పదవిని నిర్వహిస్తూనే యు. పి. కాంగ్రెసు సంఘాధ్యక్షపదవికి ఎన్నుకోబడినారు. స్పీకరుకు రాజకీయాలతో సంబంధం తగదనే సూత్రం వున్నా, ఆ సూత్రాన్ని వేలెత్తి తనకు ఇంకొకరు చూపించవలసిన అగత్యం రాకండా ఆయన వ్యవహరించారు. ఇటీవల ప్రభుత్వంలో ఉన్నతపదవులలో మన్నవారు కాంగ్రెసులో కార్యనిర్వాహక పదవులకు ఎన్నుకొనబడరాదని కాంగ్రెసు కార్యవర్గం తీర్మానించగా, రాష్ట్రకాంగ్రెసు అధ్యక్షపదవినిగాని, లేదా స్పీకర్ పదవిని గాని విడనాడవలసివచ్చింది. అయితే, యు. పి. ప్రధాని గోవింద్ వల్లభపంత్ కోరికపై జమీందారీల రద్దుబిల్లు ఆమోదించబడేవరకు స్పీకర్ పదవిని నిర్వహించి, సరిగా ఇరవైరోజులక్రితం స్పీకర్‌పదవికి ఆయన రాజీనామాచేశారు. అప్పుడు అసెంబ్లీ ప్రతిపక్షసభ్యులుకూడా ఆయన నిష్పక్షపాతవైఖరిని వేనోళ్ళ స్తుతించారు.

ఈ సందర్భంలోనే యు. పి. అసెంబ్లిలో ఉపన్యసిస్తూ ప్రాచీన సంస్కృతీ, విజ్ఞానాలకు ఆయన ప్రతిబింబమని ప్రధాని గోవిందవల్లభపంత్ అన్నాడు. కాంగ్రెసు నాయకుడే అయినప్పటికీ, హిందూమత దురభిమానియని, అభివృద్ధి విరోధకుడైన సనాతనుడని ఆయనను ప్రత్యర్థులు నిరసిస్తారు. యు. పి. పంజాబులు రెండూ ముస్లిములకు ప్రాబల్యంగల రాష్ట్రాలు కావడంచేత, ఆ రాష్ట్రాలలో పుట్టి ఆ రాష్ట్రాలలో పెరిగిన సామాన్య హిందువులవలె, ఆయనకు కూడా మతంమీద అభిమానం, సనాతన సంప్రదాయాలపై మక్కువ చాలాఎక్కువ. శరణార్థులయందు కాంగ్రెసు నాయకులందరికంటె ఎక్కువ ఆదరాన్ని, ఆయన ప్రదర్శించి, వారి ప్రేమాభిమానాలను చూరగొనడానికిదే ఆయనలోవున్న శక్తి.

పండిట్ హృదయనాథకుంజ్రూ తండ్రి పండిట్ అయోధ్యానాథకుంజ్రూ తరువాత యు. పి. లో ప్రజాభిమానాన్ని విశేషంగా చూరగొన్న హిందూ నాయకులలో టాండన్ ఒక్కడే కావడంలోగల రహస్యంకూడా ఇదే కావచ్చు.

రాజ్యాంగపరిషత్తులో రాజభాషగా హిందీని నిర్ణయించేటప్పుడు తీవ్రమైన తర్జనభర్జనలు జరిగాయి. దేవనాగరి లిపితో, అంకెలతో, ఎంతమాత్రం ఉర్దూ కలవని పదహారణాల హిందీని రాజభాషగా నిర్ణయించాలని టాండన్ వాదం. అలా వాదించిన పక్షానికి ఆయనే నాయకుడు. దేవనాగరి లిపితో, రోమన్ అంకెలతో రాజభాషగా హిందీని నిర్ణయించడానికి రాజ్యాంగపరిషత్తుచేత ఒప్పించడానికి ప్రధాని పండిట్ నెహ్రూ సతమతం కావలసివచ్చింది.

గత ఈ చరిత్రనుబట్టియే టాండన్ ఎన్నిక పండిట్ నెహ్రూపై అవిశ్వాసాన్ని ప్రకటించడమే కాగలదని మరికొందరు భావిస్తున్నారు. ఎన్నిక అనంతరం ఆచార్య కృపలానీ చేసిన ప్రకటనలో ఈ ధ్వని వున్నది. టాండన్ ఎన్నిక ప్రజాస్వామిక శక్తులకు కనువిప్పుకానగునని ఈ ప్రకటనలో ఆయన హెచ్చరించాడు.

సర్దార్ పటేల్ టాండన్‌ని సమర్థించాడని, కృపలానీని నెహ్రూ సమర్థించక పోయినా, ఆయన కుడిభుజాలనదగిన రఫీ అహమ్మద్ కిద్వాయ్, మౌలానా అజాద్‌లు సమర్థించారని అందరికి తెలిసిందే. రాష్ట్రపతి ఎన్నిక పటేల్, నెహ్రూల బలాబలాల పరీక్షయేననికూడా కొందరు అంటున్నారు.

ఎన్నికజరిగినసమయంలో, అందులోనూ తీవ్రంగా ఎన్నికజరిగినసమయంలో ఇట్టి వదంతులు, యిట్టి అనుమానాలు అనేకం ఉండవచ్చు.

కాని, టాండన్ ఎన్నుకొనబడినందువల్లనే ఏమోజరుగుతుందని అనుకోవల సిన పనిలేదు.

కాంగ్రెసు సంస్థయే పతనం కాబోతున్న సూచనలు కానవస్తున్నాయి. స్వాతంత్ర్య సంసిద్ధికి కేపిటలిస్ట్ సామ్యవాదశక్తులమధ్య సంఘర్షణ అనివార్యమైంది.

ఈ గ్రంథమంతా దానికి నాందియే. అందుచేత, ఈ సంఘర్షణాకాలంలో కాంగ్రెసు అధ్యక్షుడు ఒక్కడు చేయగలిగిందేమీ వుండబోదు. ఆయన ఎన్నిక మూలంగా ఈ సంఘర్షణ మరింత సామీప్యంకావచ్చు. పండిట్ నెహ్రూ, సర్దార్ పటేల్ మనస్పర్థలు, భేదాభిప్రాయాలుకూడా ఈ సంఘర్షణలోని ఒక భాగమే కాగలవు. ఆ దృక్పథంతో చూచినపుడు కాంగ్రెసు గద్దె నెవ్వరెక్కినా ఒకటేనని, కాంగ్రెసును తిరిగి పునీతం చేయగల బాపూజీకంటె మహిమాన్వితుడు కానవచ్చే వరకు దానిని అధోగతినించి రక్షించడం అసంభవమని తోస్తుంది. టాండన్ రాజర్షియేగాని మహాత్ముడుమాత్రంకాడు.



# అనువాద సాహిత్యం

కొండలదగ్గిర ఉడకబెట్టే వేడి. పగలంతా నడుస్తూనే వున్నాను. చెమట కారుతోంది. అరికాళ్ళు బొబ్బలెక్కాయి. ఆఖరికి ఒక చిన్నలోయ దగ్గిరకొచ్చి ఆ దిగువనే నడుస్తూవుండగా టుంగ్ టింగ్ సరస్సు కనిపించింది. సూర్యాస్తమయవేళేమో చల్లని పిల్లతెమ్మెర వీచింది. ఇక్కడ కాందిశీకులు లేరు; రోడ్లమీద జనసమ్మర్ధం లేదు; జపాను విమానాలు లేవు. యుద్ధం వెనక నెక్కడో జరుగుతోంది. బతికి బయటపడ్డానుకదా అని ఒక్కనిట్టూర్పు విడిచాను. సీటికి అవతల పక్కనించి ఒక అరుపు-ఒకే ఒక్క అరుపు-వినిపించింది. తర్వాత చీమ చిటుకుమంటే వినిపించేటంతటి ప్రశాంతత.

వీపుమీదవున్న మాసినగుడ్డలమూట కింద పెట్టి, దాన్ని ఒక తలగడగా చేసుకు ఆ పచ్చగడ్డిమీద వెల్లకిలా పడుకున్నాను. పైన ఆకాశం, కింద నీరూ ఒకే నీలంలో ఉన్నాయి; కాని ఆకాశం నెమ్మది నెమ్మదిగా నిగ్గుపడి కందగడ్డలా ఎర్రనయింది. తూర్పు దిసని కొంగలగుంపొకటి ఏడుస్తూ తన నిజ నివాసానికి పోయింది. సూర్యుడు అస్తమించాడు.

కాసేపు ఏశబ్దంలేదు. దారిలో ఎన్నోసార్లు వినపడ్డ మిడతల చప్పుడుకూడా లేదిక్కడ. దూరానవున్న అలలతాకిడి వినీ వినిపించనట్లు ముందు ఎలా తోస్తుందో, అలాటిదే నా చెవులకి సోకింది. ఒకసారి గాలి వీయడంతో ధ్వని పెద్దగంట మోగినంత స్పష్టంగా వినిపించింది. ఆ శబ్దం ఏ వాయిద్యానిదో నాకు తెలుసు. అది ఒకపాట - మధ్యచైనాలోని విశాలమైన పచ్చికబయళ్ళలో వయసొచ్చిన పిల్లలు ఖుషాసాగా పాడుకునే కమ్మటిపాట. నేను గోపబాలకుడిలా వున్నప్పుడు ఆ పాట వింటూంటే దిగులేసేది:

"నన్ను నీతో కూడా ఆకాశపు కొసకిరానీ-
నన్ను నీతోకూడా సముద్రపుటంచుకిరానీ-
సముద్రం యిగిరిపోవచ్చు
రాళ్ళు అరిగిపోవచ్చు
కాని నా హృదయం మారదు తెలిసిందా-
నా హృదయం మారదు."

అలాంటి పాట ఈ నిర్జన ప్రదేశంలో విని ఆశ్చర్యపోయాను. ఇలాటి సామాన్యమైనపాట పాడుకునే మనుషులు ఈ చుట్టుపట్లవుండటం యింకా తమాషాగా తోచింది. మనుషులు! మనుషులమాట తలపుకి రాగానే ఆకలి గుర్తుకొచ్చింది. తలుచుకున్నకొద్దీ ఆకలి ఎక్కువైంది. రోజల్లా నేను ఏమీ తినలేదు. ఆసంగతి జ్ఞాపకంరాగానే నేను ఎన్నోవారాలబట్టి వస్తువున్నట్టనిపించింది.

---

## కల

ఘన్ - షాన్ ఎహ్

---

ఆకాశం నల్లబడటం వెర్రివాలకంతో చూస్తూ, ఈ పసరికమీద మూర్ఖుడిలా ఎలాపడుకుంటాను? ఛటాలున నుంచుని, పాట వినబడ్డ శైపుగా నడక సాగించాను.

సరస్సుకి కుడివైపున చెట్లచాటుగా గ్రామం ఉంది. అప్పుడే ఒక గుంపు-కండపుష్టిగల వ్యవసాయకూలీలూ, పేలికలు ధరించిన కుర్రాళ్ళూ, పొడుగాటిపైపులు కాల్చే వృద్ధులూ వున్నగుంపు-నాలుగుపక్కలకీ చెదురుతోంది. కొందరి మొహాల్లో విచారముంది; కాని మరికొందరు వెర్రి ఆసక్తితో చూస్తున్నారు నల్లబడ్డ ప్రపంచంలో మునిగిపోతున్న ఆ డాన్సర్లవంక. వింటున్న ఆడపిల్లల్లో కొందరి కళ్ళు చెమర్చాయి. వారి మెత్తటి ఆత్మల్ని డాన్సర్లపాట కదిలించివుంటుంది. నాకు తెలుసు,అది శోకగేయమని; ఆగేయం వెనకాల దాగున్నది ట్రాజెడీ. వీపుమీద మూట వేళ్లాడేసుకుని, కాళ్ళీడ్చుకుంటూ నేను వారి దరి కొచ్చేటప్పటికి గుంపులో ఒక్క పిట్ట లేదు. వాళ్ళందరూ యిళ్ళకి భోజనాలకి పోయారు. అదృష్టవంతులు-యుద్ధంగురించి తెలీదు వారికి. కారణం తెలీకుండానే దిగులేసింది.

ఒక ముసిలివాడు యిద్దరు నాట్యకత్తెలూ వున్న పార్టీకి ఎదురుగ్గా నేను నుంచున్నాను. అమ్మాయిల్లో ఒకతె కాస్త లావుగా వాజూగ్గా గాలిలోని లిల్లీలా ఉంది. రెండో అమ్మాయి సన్నగా పూలచెట్టురెమ్మలా వుండి శూన్యంలోకి వేదనతో చూస్తోంది. ఒకరితో ఒకరం మాట్లాడకుండా చీకటి క్రమక్రమంగా మా పరిసరాన్నీ, ఆపల్లెనీ, మా చుట్టూవున్న సమస్తాన్నీ ఎలా మింగుతున్నదీ చూస్తూ నుంచున్నాం.

"మాకుమల్లేనే యిల్లూ వాకిలీ లేని దిమ్మరివా?" అన్నాడు వృద్ధుడు విశ్శబ్దాన్ని తెంచుతూ.

"అవును. జపాన్ ఆక్రమణనించి పారిపోయివచ్చాను. మొన్న మధ్యనే నా రాజధాని వుఛాంగ్‌ని పట్టుకున్నారు."

"బావుంది-ఈవిపద్దశలో కామ్రేడ్సే మనం. రాత్రి మకాంకి చోటు వెతుక్కుందాం-పద."

అతను ముందు నడిచాడు. మంత్రముగ్ధుడిలా వెనక నేను. నావెనక ఆ యిద్దరమ్మాయిలు. నేను వేసే ప్రతి అడుగూ యిద్దరు కొత్తస్త్రీలు వెనకనించి పరిశీలిస్తున్నారనే ధ్యాసలో యిబ్బంది పడ్డాను. వృద్ధుడు మాటలు మొదలెట్టి నా యాతన తగ్గించాడు. ముందుపళ్ళు వూడిపోయాయి కనక అతని మాటలు స్పష్టంగా వినిపించేవి కావు.

"కొత్తమనిషీ, నేను పాటగాణ్ణి—తెలుసా?"

"అలాగా!" అన్నాను—అతనిమెళ్ళో వేలాడుతున్న డోలూ పుడకలూ చూసి. కాని, కాస్త అల్లరితనంతో అడిగాను: "తాతా, నువ్వు ఏ వాయిద్యం వాయిస్తావ్?"

"నేను డోలు కొడతాను. కనిపించడం లేదూ?" అన్నాడు దృఢచిత్తంతో. ఒకసారి తలపంకించి నన్ను నమ్మించేందుకా అన్నట్టు "నేను ఈట్రూపుకి మేనేజర్ని" అన్నాడు.

"ఏ ట్రూపు?" అన్నాను అర్థంకాక.

"నాటకం కంపెనీ. వెనక యిద్దరు పిల్లలు కనిపించడంలేదూ ? వాళ్ళు నాకూతుళ్లే కావచ్చు, కాని ఒకటోరకమైన నాట్యకత్తెలు. ఒకటోరకం అంటే నమ్ము.

అలాకబుర్లు చెప్పుకుంటూ కొండదిగువని వున్న శిధిలాలయం దగ్గిరికి వచ్చాం. "అబ్బాయ్—మనం వుండవల్సినచోటు యిది," అన్నాడు తాత. మేం లోనికి నడిచాం. నిప్పుపుల్లగీసి ఆముదపుదీపం వెలిగించాను. దీపపు వెలుతురికికూడా అక్కడి ఎలుకలు బెదరలేదు. వీపుమీదవున్న బట్టల మూట వూగిసలాడిస్తూ, ఏం చేయాలో తోచక నిలబడ్డాను ఆ ఆముదపు దీపం ముందు.

"ఇది నా పెద్దకూతురు—వైలెట్," అన్నాడు తాత బొద్దుగావున్న పిల్లనిచూపిస్తూ. "అది వాసంతి—చిన్నకూతురు" తర్వాత ప్రక్కనున్న గడ్డిమేటిమీద కూలబడి, కాళ్లూ చేతులూ బారజాచుకు పడుకొని 'అమ్మయ్య!' అంటూ నిట్టూర్చాడు.

"ఈరోజు గడిచింది."

దాన్నర్లకి నన్ను పరిచయంచేస్తున్నప్పుడు వారివంకచూసి స్నేహపూర్వకంగా నవ్వాను. వాళ్ళూ అలాటి ఆర్ద్రతతోటే నామోహాన్ని పలకరించారు. వారి చిరునవ్వులో ఒక మాదిరి వెచ్చదనం ఉంది. వారు నావంక చూసినప్పుడు స్నేహానికి స్వాగతమిస్తూ వారి నేత్రాలు ప్రకాశించాయి. తక్షణం ఒక ఆలోచనతట్టి తాతని అడిగాను. "బాబా—నన్ను నీకంపెనీలో చేర్చుకుంటావ్ ?"

"అ....నువ్వు ఏదో విద్యార్థిలా అగు పిస్తున్నావు-పండితలోకానికి చెందినవాడివి." తాత నా మొహంలోకి ఆశ్చర్యంతో చూశాడు. "నిజం చెప్పాలంటే మాది మోరటు బతుకు."

"ఫర్వా లేదు. రెండుతీగెల ఎర్హు వేను వాయించగలను. నేనుకూడా నీకు సాయ పడతాను; నువ్వు మంచి పాటగాడివే అనుకో." వాక్యంలో రెండోభాగం ఉల్లా స్ఫూర్తికా అన్నదికాదు-కాని అనేశాను. అనుకోకుండానే అలావచ్చేసింది. తాత నా పొగడ్తకి సంతోషించాడు. "సరే-నీకు వుండాలని వుంటే మాతోవుండు-మానవులందరూ సోదరులేకదా!"

ఎంతహాయి! ఆ అమ్మాయిలగురించిన బెరుకు ఒక్క తృటిలో పోయింది. నిప్పు అంటించి వంటజెయ్యడంలో వారికి సాయ పడ్డాను. ఎంతో మాట్లాడాం-మాపనిగురించి, మేము పుట్టిన స్థలాలగురించి. వాళ్ళది మంచూరియా. తాతముత్తాతలకాలంలో మధ్య చైనాకి వలసవచ్చారు. అందుకనే ఆదేశీయ పదం-నేను దూరంనించి విన్నపాట - అంత చక్కగా పాడగలిగారు. స్త్రీత్వంతో మార్దవంగా వుండే వైలెట్ శ్రావ్యకంఠాన్ని ప్రేమించాను. చీకటిగోళాల్లా వుండే వాసంతి పెద్ద పెద్ద కళ్ళు నన్ను ప్రేమతో కట్టేశాయి.

భోజనానంతరం తాత గడ్డివామమీద మేనువాల్చి, 'గుడ్‌నైట్' చెప్పకుండానే కళ్లు మూసుకున్నాడు. కాని, అతని వాలిక యింకా పెదిమల్ని పట్టినే- తడుపుతోంది.



"రోజూ మీకు నచ్చేటట్టు వంటచేస్తే ఇక మీతో పోట్లాట ఎలా వస్తుంది? నేను అలిగి కన్నవారింటికి ఎలా వెళ్లగలను?"

వింతగా చూశా నతనివంక. నిద్దర్లో మనుష లలా ప్రవర్తించడం నాకు తెలీదు.

"అతనివంక అలా చూడకు" అంది వైలెట్ తన స్త్రీసహజమైన మృదుకంఠంతో. "చంద్రుణ్ణి చూడు-ఎంత బావున్నాడో!"

తల పైకెత్తి మేఘాల్లేని ఆకాశంలోని చంద్రబింబం చూశాను. నాలుగువైపులా కాంతి వెదజల్లుతున్నాడు చంద్రుడు. మధ్య చైనాలో జపానువాళ్ళు కాలుపెట్టినప్పట్నుంచీ చంద్రకాంతి సంగతే మర్చిపోయాను.

"ఎంత బావుంది! వెన్నెలదేవత...." నేను బిగ్గరగా మాట్లాడుతున్నట్టున్నాను-తగ్గమని వారించింది వాసంతి.

"ఉష్, ఆ చెట్టువంకచూడు." అంది వాసంతి ఆ ఆవరణలోవున్న ఒక వృక్షాన్ని చూపిస్తూ.

మునీలిచెట్టు. తొర్రలతో వూడలతో భయం గొలుపుతూవుంది. ఎన్నివందలఏళ్ళవయసో ఆ చెట్టుది. ఆ చెట్టుఆకులు గుడిమీద వాలి వుండటంచేత, గోపురానికి ఈకలు మొలిచినట్టు ఉంది. పైనున్న కొమ్మల్లోంచి పక్షుల రెక్కల చప్పుడు వినిపిస్తోంది. "పాపం-నిద్రపోతున్న పిట్టలు నాకంఠం విని జడుసుకుని ఉంటాయి" అనుకున్నాను నాలో నేను.

వాసంతి తొట్రుపాటులేని కంఠంతో అంది. "నాకో సామెత జ్ఞాపకమొస్తోంది. నిద్రపోతున్న పక్షి మూడుసార్లు రెక్కలు రెపరెపలాడించటం వింటే మనకో మంచి కల వస్తుంది-ఆ కల నిజమవుతుంది."

ఆసక్తిపుట్టి అడిగాను. "అయితే నువ్వెన్ని సార్లు విన్నావ్?"

"సరిగ్గా మూడుసార్లు.

"ఇంకేం-నీకో మాంచి కలవస్తుంది."

పెదవివిరుస్తూ, "ఏమో మనకిన్నేళ్ళబట్టీ వస్తున్నవి పీడకలలే!" అంది వాసంతి.

"ఒక్క మంచికలకూడా రాలేదూ? ఎంచేత?"

ఇతరుల కలలజోలి నాకెందుకు? అంత అదుర్దాపడవల్సిన అగత్యమేమిటి?

వాసంతి జవాబుచెప్పలేదు. జుట్టుకి మల్లే నల్లగావుండి పిల్లికళ్ళలామెరిసే ఆమె నేత్రద్వయం నన్ను పరకాయించిచూసింది. తనకి తెలీని దేనివల్లనో వ్యాకులపడింది. ఆమె వ్యాకులపాటు నన్నుకూడా కలవరబెట్టింది. ఆ తీక్షణమైన చూపులకి నాకు మతిపోయింది. తెలివిగలది కనక వైలెట్ యిలా వివరించి చెప్పింది.

"మాజీవితాలకి స్తిమితంలేదు. నాలుగేళ్ళ క్రితం జపానువాళ్ళు మాగ్రామం తగలబెట్టినప్పట్నుంచీ మాకు శాంతిలేదు. మా వెనకనే శత్రువు వస్తూంటాడు."

తనకంతవరకూ స్ఫురించని ఏదో కొత్త భావంలా, "నిజమే—మాకు శాంతిలేదు. జపానువాళ్ళమాట గడిచిన మూడురోజుల్నుంచీ వినడంలేదు—అంతే!" అంది వాసంతి అమాంతం.

నా అనుమానాలు నాకున్నాయి. 'ఇంకో రెండురోజులుపోతే మీకే తెలుస్తుంది!' అనుకున్నా మనసులో. వారి 'మూడ్' పాడు చెయ్యడం నాకిష్టంలేదు. అంచేత అన్నాను: "అయితే నీకు మంచికలలొస్తాయి. నీకు ఎలాటికలలు కావాలి? నువ్వు ముట్టుకున్న ప్రతిదీ బంగారమయే మంత్ర దండమా? నిన్ను ఆనందలోకానికి తీసుకువెళ్ళగలిగే రెక్కలా? - ఏంకావాలి?"

"దేశదిమ్మరి కూతుళ్ళం - మాకంత పెద్ద ఆశలు లేవు," అంది వాసంతి, వేడినూపిరి వదుల్తూ. "నాకు చదువుకోవలని ఉంది. రాయడం, చదవడం నాకురావాలి. నీకు వచ్చిన పాటలు నువ్వు రాయగలిగితే-నువ్వు చదవగలిగితే! అంతకంటె యింకేం కావాలి? అమ్మ పాటలు నేర్పేటప్పుడు ఆ అదృష్టం కోసం ఎంత తపనపడ్డానో! అమ్మ మంచి డాన్సరు-నాన్నకంటె బాగా పంపాయించేది." చటుక్కున ఆపేసి, స్వప్నజగత్తుకీ వాస్తవ ప్రపంచానికి మధ్య జారిపోయిన వాసంతి నావంక వెర్రిగా చూస్తోంది.

వైలెట్ కాస్త తేరుకుంది గాని మళ్ళీ విచారంలో పడి ఏదో కనిపించనిగాయంవల్ల నిట్టూర్చింది. "నేనుకూడా స్టూడెంటుని కాగలిగితే...."

"స్టూడెంటా!" నిద్దరనించి మేల్కొన్నట్లు అందుకుంది వాసంతి. "మొన్న డాన్సుచేస్తూ వుండగా చూసిన ఆ ఖామందు పేరేమిటి? తర్వాత నిన్ను నాన్నదగ్గిర మెచ్చుకున్నాట్ట. అతనికి పిల్లలులేరు-పెళ్ళాం చచ్చిపోయింది; కనక నిన్ను కూతురులా పెంచుకుని బడికి పంపుతానన్నాడు. నువ్వే వొద్దన్నావు. నాన్నతో ఈ మొరటుబతుకే బావుందికాబోలు. ఎందుకు కుత్సితాలు పలుకుతావ్?"

వైలెట్ తికమకపడింది. చెల్లెల్ని ఎలా ఎదుర్కోవాలో తోచలేదు. "వాడిది కపట నాటకం, వాడి ఉద్దేశం అదికాదు...."

"రక్షించండి. రక్షించండి. నా పెళ్ళాన్ని వొదలండి." మా సంభాషణలో ఈ ఆర్తనాదం పిడుగులా పడింది. గడ్డివాముపక్క పడుకుని గురకపెడుతున్న తాతదీ ఆక్రందన. అలాటిచోట్ల పాము లెక్కువగా వుంటాయి కనక, ఏదైనా పాము అతని మెడమీద కాటేస్తోందోమోననుకుని, కర్ర కోసం వెతకబోయాను. వైలెట్ ఆగమంది.

"అదేంలేదు. అతనికేదో పీడకలవచ్చి వుంటుంది. జపానువాళ్ళు మా గ్రామంమీద పడి, అమ్మనెత్తుకు పోయినప్పట్నుంచీ అతనికి నిద్దర్లో ఆకేకలు మామూలే! అమ్మ ఏమయిందో మాకుతెలీదు. చచ్చిపోయి వుంటుంది........"

అర్థమవుతోంది నాకు. మరొక కన్నీటి కాలవ. వివరాలు అడిగి వారిమనసు కలత బెట్టడమెందుకు? యుద్ధకాలంలో మానవ హృదయం ఎంత మెత్తగా ఉంటుంది! "మనకి నిద్దరవేళఅయింది. రేపు మీరు యింకొంచెం శ్రమపడాలి - మరొకదుపు వింపాలిగనక." అన్నాను నెమ్మదిగా. గుడ్ నైట్ చెప్పటానికి ముందు వారి లేత హృదయాల్లో చిన్నఆశ మొలకెత్తించాలని అన్నాను, "మనకు శత్రుభయం పోయి స్వాతంత్ర్యం వచ్చినతర్వాత, స్కూళ్ళలో విద్య ఉచితంగా నేర్పుతారు. అప్పుడు అందరికీ పాటలు రాయడం చదవడం చేతనవుతుంది." ఆపైన నిద్దరపోయాను.

మర్నాడు పక్కగ్రామానికి పెళ్ళాం. నేను ఎర్హు-అనగా రెండుతీగెల ఫిడేలు-వాయించాను; తాత డోలు మోగించాడు. నేను బాగానే వాయించి వుండాలి. వాసంతి పాటకి వైలెట్ అడుగులేసి నృత్యంచేస్తోంది. తేలిగ్గా సులువుగా మత్స్యకన్నలా డాన్సుచేసింది వైలెట్. నర్తిస్తూ సుశ్రావ్యంగా పాడిన ఆమె పాటయువకుల్ని ఆకర్షించింది. అప్పుడప్పుడు తన ఎర్రటి పెదవులతో చూపే ఆ కృత్రిమ నవ్వులో అక్షరాలా విషాదమే! కొందరు గ్రామవాసులు మెచ్చుకున్నారు. కాని, ఎక్కువమంది ప్రదర్శన చూడటానికి రాలేదు.

ప్రేక్షకులులేని ఆ కూడలిలో నేనేదో వైణికుడిలా వాయించడం, తనేదో నర్తకిలా ఆమెగెంతడం, ఒక్కడూ మావంక కన్నెత్తి చూడకపోవడం నాకు వెగటుగా తోచింది. దీనాతిదీనమైన అవస్థమాది. తాత తనడోలు పిచ్చివాడిలా దబదబా మోగించి ఆఖరికి విసుగెత్తి ఆ పుడకలు రెండూ విసిరేసి, ఒక బండరాతిమీద కూచుని, అలిసినకంఠంతో వైలెట్‌ని ఉద్దేశించి అన్నాడు: "అమ్మాయ్- కాసేపు విశ్రాంతి తీసుకో." పెదిమిలమీద భావరహితమైన నవ్వుధరించి నాట్యకత్తె తండ్రిపక్కని కూచుంది. ఎవరు తీర్చగలరు ఆమె దిగులు?

ఒక నిముషం గడిచాక మా వాయిద్యాలు మూటగట్టుకు యింకో గ్రామానికి వెళ్ళాం.

మిట్టమధ్యాహ్నం. వీపుమీద మూటవేసుకు, తట్టల్లో పిల్లల్ని పెట్టుకు, వేలాడే మొహాలతో రోడ్డునిండా జనప్రవాహాలు. మనుషుల వెనక కుక్కలు పొడుగాటి నాలికలు చాచుకు నడుస్తున్నాయి. ఆ మనుషుల నుదురు మాడుస్తున్నాడు సూర్యుడు. చెంపలమీద చెమట బొట్లు అలా కారుతూవున్నాయి. ఏం జరుగుతోందో నాకుతెలుసు. సంశయ నివారణకోసం ఒకరైతుని అవి సంగతేమిటో చెప్పమన్నాను.

"శత్రువు తరుముకొస్తున్నాడు. ఇవ్వాళ ఉదయం ఒక గండభేరుండ పక్షి మాగ్రామం మీద గుడ్లువిసిరి యిరవైఅయిదు ప్రాణాలు పొట్టనెట్టుకుంది. అరుగురు పిల్లలు, మూడు ఆవులు కలుపుకు యిరవైఅయిదు ప్రాణాలు."

"ఏం ప్రపంచమ్మా నాయనా" అంటూ పెద్దగా శ్వాసవొదిలాడు తాత. "ఈ ఉపద్రవాల్నించి నేను నాలుగేళ్ళబట్టీ పరిగెడుతున్నాను. కాని ఎక్కడా శాంతిలేదు." అమ్మాయిలవైపు తిరిగి అన్నాడు, "నేనేం చెయ్యగలను మీకు! నా ఎముకలు హూనం అవుతున్నాయి; మీరు ఎదుర్కొస్తున్నారు...."

పిల్లలు జవాబు చెప్పలేదు. ఇద్దరూ తలలు వాల్చుకున్నారు. మేము ముందుకి సాగాం. మరోగ్రామం దగ్గిరికి వచ్చాం. ఊరంతాఖాళీ. ఇంకోగ్రామం దగ్గిరికి వెళ్ళాం. అదీ అంతే. నిర్మానుష్యం. మాకు తిండిలేదు, సంపాయించుకోలేక పోయాం కనక. అలిసిపోయాం. కాళ్ళు తడబడ్డాయి.

"నిన్నటి దేవళం దగ్గిరికి పోదాం పదండి. నాకాళ్ళు పడిపోతున్నాయి - యిలా తప్పించుకుని ఎక్కడికిపోతాం?" అన్నాడు తాత.

అతనివెంట వచ్చాం. శిథిలాలయం సమీపించే వేళకి మేము కాళ్ళమీద నుంచోలేకపోయాం. ఇద్దరమ్మాయిలూ గడ్డివాము మీద చతికిలబడ్డారు. నేను గోడని ఆసరా చేసుకు కూలబడ్డాను, తాత మాకెదురుగా కూచున్నాడు. నాలికలు పిడచకట్టుకుపోయాయి -మాటరాదు. ఆ అమ్మాయిల అమాయకపు నేత్రాల్లో మాటలక్కర్లేని నిస్సహాయ సందేశ మేదోఉంది. వెర్రిగా బట్టతల గోక్కొంటున్న తాతమీదవుంది వారిదృష్టి. కడపట, తాత నిలబడి అన్నాడు.

"మనకి తినేందుకు ఏదోఒకటి ఉండాలిగా! ఆ ఖామందు దగ్గిర్నుంచి కాసిని బియ్యం బదులు తీసుకొస్తాను." వైలెట్ మొహాన్ని వోసారిచూశాడు. "అతనంత దుర్మార్గుడిలా లేడు. నిన్ను పెంచుకుంటానంటే పెంచుకుంటాడు-అంతే."

గాలిలో నీడలా అతను వెళ్ళిపోయాడు. చాలా అలిసివున్నాడు - పెద్దవాడు - ఈపనికి తగడు. కాని యింకెవరు చెయ్యగలరు? మొదటిసారి బోధపడింది మా అసహాయత.

రెండుగంటలతర్వాత ఒక చిన్న బియ్యపు సంచి చేతిలో పుచ్చుకొని వచ్చాడు తాత. అందరి మొహాలూ వికశించాయి. నేను అతని దగ్గిరకి చెంగున వెళ్ళి సంచి పుచ్చుకున్నాను. అది మాకు బంగారుమూటలా

ఉంది. వాసంతి అతన్ని గద్దిమీద కూచో బెట్టింది; వైలెట్ అతనికి ఉపచారాలు చేసింది. మురికిగుంటమీదనించి లేచే మేఘంలా ఉంది. ఆ విసురుతున్నప్పుడు వచ్చే ఆవిరి. తాత చికాకుగా ఉన్నాడు. విసుగుపడుతూ అన్నాడు.

"కూచోండి, అమ్మాయిలూ" మళ్ళీ ఒక నిట్టూర్పువిడిచి వైలెట్‌తో అన్నాడు. "నేనో ఏర్పాటుచేశాను, పెద్దమ్మాయ్. అంత అద్దాన్నమయింది కాదనుకో. తొందరపడ్డానేమో!"

"ఏమిటి బాబూ!" వైలెట్ కళ్ళు బెరుగ్గా చూశాయి.

"బియ్యం యిచ్చిన ఖామందు నాతో మాట్లాడాడు-నీకు తెలుసుగా! నువ్వంటే అతనికి చాలాయిష్టం. ఇప్పుడు స్కూళ్ళులేవు కనక నిన్ను పెంచుకోడం పడదన్నాడు. పెళ్ళిజేసుకుని సుఖపెడతానన్నాడు."

"మాట యిచ్చావా?" అంది వైలెట్. కళ్ళలో భీతే గొంతుకలోకూడా.

"ఇవ్వక!"

"బాబా, నేను నీదగ్గిరే ఉంటాను."

"ఛెట్" అన్నాడు తండ్రి కటువుగా - కూతుర్ని మందలిస్తూ. కాసేపటికి అతను మెత్తబడి మామూలు ధాయిలోకి వచ్చాడు. "అతను వయసులో పెద్దవాడు - నాకు తెలీదు గనకనా! నీకు తగడు. కాని నాతో యిలా అడుక్కుతింటూ బతకుతావా? నీ అవకాశం జారిపోతుంది. యవ్వనం గడిచిపోతుంది. నేను పెద్దవాణ్ణయిపోతున్నాను. నేను బతికుండగా మన పరిస్థితులు బాగుపడవు. అతనికి డబ్బువుంది. నీ కే బాధలూ ఉండవు. నీ కొడుకులూ కూతుళ్ళూ బళ్ళోకెళ్ళి చదువుకుని విద్యావంతు లవుతారు. నేను నీకు ఏంచేశాను? దేశదిమ్మరికూతురిలా పెంచాను ..." నెమ్మదినెమ్మదిగా అతని కంఠం పల్చబడి నిశ్శబ్దంలో కరిగిపోయింది.

వైలెట్ బొమ్మలా తల వాలేసింది. గాలి కీచుమంటూ సన్నగా రోదించింది. దూరాన ఏదో టకటకశబ్దం. తాత తల పైకెత్తి రుద్ధకంఠంతో అన్నాడు. "ఖామందు నీకోసం పంపుతున్నాడు. శత్రువు మీదిమీదికి వస్తున్నాడమ్మాయ్. ఒక్కక్షణం వృధా చెయ్యడానికి వీలులేదు. ఖామందు గలభాలేని జిల్లాకిపోయే ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. మంచిపిల్లలా ప్రయాణానికి సిద్ధంకా."

మేనాలాంటి ఎర్రకుర్చీ వొచ్చింది; దానికి అలంకారాలుకూడా ఉన్నాయి. కాని అది వివాహపల్లకిలాంటిదికాదు. అదీకాక రెండో పెళ్ళాంకోసం వివాహపల్లకి పంపించడం ఆచారంలేదు. రౌడీలాటి ఒక యువకుడూ, యిద్దరుబోయీలూ వొచ్చారు. యువకుడు ఖామందుదగ్గిర పనిచేసేమనిషి. బోయీలు కండలుదేరి బలిష్టంగా ఉన్నారు. వాళ్ళ ఆకారాలూ, పద్ధతీచూస్తే ఎవరినో ఎత్తుకుపోడానికి వచ్చినట్టున్నారు.

తాత కాలు కదపలేదు. ఆ వచ్చిన యువకుణ్ణి మన్ననచెయ్యలేదు. విర్భాగ్య దామోదర చక్రవర్తిలా నోట మాటలేకుండా కూచుని, అమాంతం ఏదో గుబులు పుట్టుకొచ్చినట్టున్నాడు: "నువ్వు నిజంగా మంచిపిల్లవైతే, వైలెట్, నేను చెప్పిందివిను.

ఆ మేనా ఎక్కు. నేను నీతండ్రిని. ఈ ప్రపంచంలోకి నువ్వురావడం పెరగడం చూశాను. నీ సుఖసంపదలే నా లక్ష్యం....సుపుత్రాభివృద్ధిరస్తు."

వైలెట్ ఒక్కమాట చెప్పలేదు. మంత్రానికి కట్టుబడ్డట్టు ఆ కుర్చీలోకి వెళ్ళి కూచుంది. యువకుడు మేనాతలుపు మూశాడు. ఇద్దరు బోయీలు బుజాలకెత్తుకున్నారు మేనాని - లోపలవున్నది ఏదో సర్వసామాన్యమైన బరువులా. చీకటి పడబోతోంది. పశ్చిమాకాశంలో ఇంద్రధనస్సొకటి మెరిసింది. ఎక్కడో తుపానుకాబోలు. గాలి చల్లగా ఉంది.. చెట్లఆకుల గలగలలో సగం పాటా, సగం వేదనా.

ఒక పెద్దకేక వినిపించింది. తల్లిలేనిపిల్లకెవ్వమని వేసేకేక అది. ఆ బరువే చెబుతోంది అది వైలెట్ కేక అని. ఆధ్వని మళ్ళీ వాతావరణంలో కలిసిపోయింది. నిశ్శబ్దం, ఇంద్రధనస్సుముక్కా, మూసుకొస్తున్న చీకటీ-యివే మిగిలాయి.

ఇనుమెంతబరువో నాగుండె అంత బరువయింది. ఏడ్చాను నాలోనేను: 'ఇది నా తాతముత్తాతలగడ్డ-యిది మాజీవితం-' అని. నే నెక్కడికీ తప్పించుకు పారిపోలేననే జ్ఞానోదయం కలిగింది. నాదేశంవించి నేను ఎక్కడికి పారిపోతాను: ఇది నాదేశం. నేను ఈ గడ్డమీద పుట్టాను. ఇక్కడే బతకవల్సినవాణ్ణి. కళ్ళుమూసుకు ఏదో ద్యానంలోవున్న తాతదగ్గిరికి స్థిరనిశ్చయంతో వెళ్ళాను.

"నీ నిద్ర పాడుచేసినందుకు నన్ను క్షమించు, తాతా. గెరిల్లాల్లోజేరి శత్రువుని ఎదుర్కొంటాను. మిమ్మల్ని వొదిలి వెళ్ళవల్సి వచ్చినందుకు విచారిస్తున్నాను." అన్నాను.

తాత కళ్ళుతెరిచి నావంక మందకొడిగా చూసి, బలహీనంగా అన్నాడు: "సరి, నీయిష్టం. పొద్దుట్నుంచీ తిండిలేదు. ఈరాత్రికిక్కడ భోంచేసి రేపు పొద్దున్నపో.'' ఆ మాటలు చెప్పేసి మళ్ళీ కళ్ళుమూసుకున్నాడు. అతనారాత్రి తిండి ముట్టలేదు.

మనసులో ఎలాగోఉంది. ఏమీతోచక గడ్డివాముపక్క కూచున్న వాసంతివైపు తిరిగాను. తన సోదరికోసం లోపల్లోపల ఏడుస్తూ వుంటుందనుకుంటాను-కాని అలా ఏడవకపోవడం నన్ను చకితుణ్ణి చేసింది. ఇంద్రధనస్సులోని ఆఖరుముక్క చూస్తూ ఆకుల గలగల వింటూ తనలో తను చెప్పుకుంటోంది. "నిన్నరాత్రి నాకు కల రావల్సింది-రానేలేదు. నిద్రపోతున్న పక్షిరెక్కల చప్పుడు మూడుసార్లూ స్పష్టంగావిన్నాను..."

"అది వొట్టి మూఢనమ్మకం" అన్నాను. ఆమె ఉలిక్కిపడింది.

"కాదు, అమ్మ నమ్మేది." ఆమెకి నేనక్కడ వుండటం హితవుగా లేదు. "మాటవరసకి అడుగుతున్నాను - నువ్వు స్టూడెంటువా?"

"ఒకప్పుడు" అని వొప్పేసుకున్నాను.

"అయితే-నాకు అక్షరాలు రాయడం నేర్పు." అంది దీనవదనంతో బతిమాలుతూ. నా చెయ్యిపట్టుకు కిందికిలాగి పక్కన కూచోబెట్టుకుంది. "ఒక్కక్షణంకూడా వృధాచెయ్యడానికి వీలులేదు. నాకు అక్షరాలు నేర్పవ్:

ఒక్కక్షణంకూడా వృథా చెయ్యడానికి వీలు లేదని నీకు తెలుసుగా!"

కర్రముక్కతో యిసుకలో అక్షరాలు రాశాను. మొట్టమొదట 'ఇంద్రధనస్సు' (హంగ్) రాశాను. "దీనిలో రెండు భాగాలున్నాయి. ఎడమవైపుది పురుగు-పట్టుపురుగులాంటిది; కుడివైపుది కళ. ఇంద్రధనస్సు అనగా కళాత్మకమైన పట్టుపురుగులాంటిది," అని విపులపరిచి చెప్పాను.

"మన భాషలో ఎంత కవిత్వం ఉంది!" అని ఆనందాతిరేకంతో ఆమె అన్నప్పుడు ఆ కళ్ళు మెరిశాయి. "అవన్నీ నేను చదవగలిగితే .... అమ్మదగ్గిర్నుంచి నేను నేర్చుకున్న పాటలన్నీ చదవగలిగితే...."

"ఛెట్!" అన్నాను విసుగ్గా. పరిస్థితంతా వికారంగా తోచింది. భాషలోని కవిత్వం మినహా చుట్టూప్రపంచాన్ని, చివరికి తన అక్కగారి అవస్థకూడా ఈ పిల్ల మర్చిపోయినట్టుంది. మరీ దిగులేసింది. అక్షరాల అందం చెప్పే స్థితిలో లేను. అలిసిపోయినట్టు నటిస్తూ వళ్ళు వాల్చాను. కాని నిద్దరపట్టలేదు. మార్దవమైన వైలెట్ శ్రావ్యకంఠాన్నీ, ఆ ఎర్రటి పెదిమిలమీద నాట్యమాడే చిరునవ్వులోని శోకసందేశాన్నీ మర్చిపోలేక బాధపడ్డాను.

తెల్లారిన తర్వాత మొదట లేచింది నేనే. వెళ్ళబోయేముందు మాకంపెనీ యజమానికి గుడ్‌బై చెబుదామనుకున్నాను. తాత నిద్రపోతున్నట్లు నటించాడు. చెప్పుకోలేని విచారంతో అతని కనురెప్పలు కదలడం గమనించాను; నేనూ పెదవి మెదపలేదు. వాసంతి వొట్టిరాయిలా ఉంది. వీడ్కోలు లేకుండానే పోయే ప్రయత్నంలో ఉన్నాను. నేను వెళ్ళబోతూ వుండగా చటుక్కున కళ్ళుతెరిచింది ఆ అమ్మాయి. విచారంతోనూ కన్నీళ్ళతోనూ నిండిన ఆ చీకటి గోళాల్లో సూర్యుని ప్రథమ కిరణం ప్రతిబింబించింది.


"అయితే వెళ్ళిపోతున్నావా! ఇదొక్కటీ వినవూ! నాకు రాత్రి మంచి కలొచ్చింది."

"మంచికలా!" అన్నాను బరువుగా.

"అవును. మంచిదే!" విచారంగావున్న అధరంమీదికి నవ్వుతెప్పించుకుంది. "వైలెట్ వయసులోవున్న ఒక స్టూడెంటుని పెళ్ళిచేసుకున్నట్టు కలవచ్చింది. అతను చక్కటివాడు. ఆమెకి పాటలు రాయడం చదవడం........"

'నిజంగా అలాజరిగితే' అని అందామనుకున్నాను. తెలీనిశక్తి నాలికమీదనే ఆమాటల్ని ఆపింది. ఒక్కముక్క పలకకుండా శుద్ధమొద్దావతారంలో ఆమె ముందు నుంచున్నాను. 'గుడ్‌బై' అంది వాసంతే ఆఖరికి. అప్పుడు ఆమెకళ్ళు, ఆ చీకటిగోళాలు, పెద్దవై, మరీపెద్దవై, నాకర్థం కాని దేన్నో చెబుతున్నట్లు కనిపించాయి. ఆమెని తండ్రిదగ్గిర వొదలి నేను వచ్చేశాను. చాలాకాలం ఆ చూపులోని భావమేమిటో గ్రహించాలని ప్రయత్నించి విఫలుణ్ణయాను. ఇప్పుడిప్పుడే తెలుస్తోంది.





# వ్యాధిగ్రస్తుడు

మాలతీ చందూర్

గేటు తోసుకు లోపల కదుగెట్టాను. సరిగా ఆ వేళకి ఏ మల్లెతీగెకిందో, చీడీల పక్కనో, డాబామీదో నవ్వుతూ కనబడే రాధ నా కంటికి అవుపడలేదు. టాయిలెట్ యింకా పూర్తి కాలేదేమో అనుకుంటూ మెట్లెక్కి [illegible]హాల్లోకి వెళ్ళాను.

మల్లె పువ్వులా తయారై వుండాల్సిన రాధ వాలుకుర్చీలో పడుకుని దీర్ఘంగా ఆలోచిస్తోంది. నా రాకగూడా గమనించినట్టు లేదు. ఆఖరికి నిద్రలేచే వేళకిగూడా నలగకుండా, శుభ్రంగావుండే రాధ అంత చికాగ్గా వుందేమిటి చెప్మా అని దగ్గాను.

తలెత్తింది. నా వంక చూసి 'రా' అంది—కుర్చీ చూపిస్తూ. మొఖంమీద చిరునవ్వు కనపడదేం?

అసలు రాధకీ నాకూ స్నేహం ఎలా అయిందంటే మా వూళ్ళో వున్న లేడీస్ క్లబ్‌కి అందరికి మల్లే నేనూ వెళ్తూండేదాన్ని. సాధారణంగా మా క్లబ్‌లో చీరెలూ, జాకెట్లూ, నగలూ, లేచిపోవడాలూ మాట్లాడుకునేవాళ్ళం.

పూర్వం వున్న గవర్నమెంటు డాక్టరుకి బదిలీ అయి మరోడాక్టరొచ్చాడు. పూర్వపు డాక్టరుగారి భార్యకు పూజలూ పునస్కారాలూ తప్ప మరోగోల తెలియదు. కొత్తగా వచ్చిన డాక్టరుభార్య మటుకు అంతకంటె వుత్సాహంగా వుంటుందా? అనుకున్నాం మేమంతా. వూరికి ఏ ఆఫీసర్లొచ్చినా, వారి భార్యల్ని మాతో పోల్చుకు తృప్తిపడటం మాకో అలవాటయింది.

డాక్టరు వొచ్చి స్థిరపడిన నెల్లాళ్ళకు ఆయన భార్యా వచ్చింది. డాక్టరుగూడా చిన్నవాడు. పిల్లామేకా లేదు. ఆయన భార్య యింటర్‌దాకా చదివిందనీ, నాగరిక యువతీమణి అనీ మేమంతా ముందుగానే వినివున్నవాళ్ళమవడంచేత ఆవిడ రాకకోసం ఆతృతగా చూశాం. కాస్త చదువుకున్న యువతి అయితే మా క్లబ్బులో మెంబరవాల్సిందే. అందులో గవర్నమెంటు డాక్టరు భార్య మెంబరుగాకుండా వూళ్ళో కాపరం చేస్తుందా?

రాధ ఆవరణలో అడుగెట్టగానే క్లబ్‌కి కొత్త కాంతి వచ్చింది. అసలు అలాకాంతి వెదజల్లడం రాధలోనే స్వతహాగా వుంది. రాధ తిరిగిన స్థలాలు తళుక్కుమనేవి. మూడునెలలు తిరక్కుండానే రాధ క్లబ్ సెక్రెటరీ అయింది. క్లబ్‌లో ఎన్నిమార్పులు!

వ్యక్తుల సంఘాన్ని ఎలా మార్చేదీ రాధ లాంటివాళ్ళు రుజువుచేస్తారు. ఐకాయిపడ్డ చందాలు రాబట్టడమే కాకుండా విరాళాలు కూడా వసూలుచేసింది. ఎన్నో ఆటవస్తువులు తెప్పించింది. రింగ్ టెన్నిస్, బాడ్ మింటన్, టేబుల్ టెన్నిస్, చదరంగం రకరకాల గేమ్సు మొదలెట్టించింది. చిన్నలైబ్రరీ వోపెన్ చేసింది. రకరకాల పత్రికలు తెప్పించింది. క్లబ్ కి జీవంపోసిందంటే నమ్మండి. కాలుతీసి కాలుపెట్టే ఓపికలేకపోయినా ఈ కీర్తి అంతా రాధకే ఎందుకు దక్కాలనే యీర్ష్యాళువులు మాలో కొందరు లేకపోలేదు. కాని వాళ్ళేం చెయ్యగలరు? రాధ సమర్థురాలు కావడంవల్ల యీ కుటిలమనస్కుల్ని లెఖ్ఖచేసేది కాదు.

మేమిద్దరం ఒకేవీధిలో వుండటంవల్ల క్లబ్ స్నేహమే గాకుండా యింటిస్నేహం కూడా కలిసింది. నేను లేకుండా రాధ యింతవరకూ ఒక్కసినిమాకు పోలేదు.

"ఏం రాధా ఏవో కలలు కంటున్నావ్?" అన్నాను నవ్వుతూ.

"మనసేమిటో బాగాలేదు" అంది ముభావనగా.

రాధకి మనసు బాగా లేకపోవడమా? యిదే మొదటిసారి నేను వినడం. అందరికి మల్లే రాధ భర్తతో కీచులాడదు. పనివాళ్ళ మీద విసుక్కోదు. పెంకిపట్టు పట్టదు. నవ్వుతూ అందర్నీ తనచుట్టూ తిప్పుకోగల రాధకి మనసు బాగుండకపోవడమా? చిత్రంగా వుందే!

"వంట్లో నలతగా వుందా?" అన్నాను.

"డాక్టరు ప్రాణనాధుడై వుండగా నాకు జబ్బేమిటి?" అంది మామూలు ధోరణిలో.

"మనసు బాగా లేకపోవడానికి కారణం?"

"ఏంలేదు" - అంటూ టేబుల్ మీద కాయితాన్ని వూరికే చూస్తోంది. బహుశా వాళ్ళవాళ్ళకి వొంట్లో బాగా లేదని వుత్తరం వచ్చిందేమో?

"డాక్టరుగా రొచ్చేవేళయినట్టుంది. కాస్త ముఖం కడుక్కుని చీరె మార్చుకోవూ?"

"తొమ్మిదింటిదాకా రారు."

"అంటే అప్పటిదాకా యిలా దిగాలుగా కూచుంటావా?"

"కూచుని నేను చేసేదేమీలేదు" అంది నిరాశగా.

"అసలునువ్వు చెయ్యదల్చుకుందేమిటి?" అన్నాను జాజిపందిరి కిందకు తీసుకెడ్తూ.

తనచేతిలో వుత్తరం నాచేతిలో పెట్టి "చదువు—నీకే తెలుస్తుంది" అంది రాధ.

చదివాను. రాధ అన్నగారు రాసిన వుత్తరం. రాధ తన తల్లిదండ్రులగురించీ, చెల్లెళ్ళూ తమ్ముడూ గురించీ చెప్పిందిగాని తనకో అన్నగారు వున్నట్లు చెప్పలేదు. ఆరేళ్ళతర్వాత చెల్లెల్ని చూసేందుకు వస్తున్నాడు. అతనివెంట అచ్యుతాన్నిగూడా తీసుకొస్తున్నాట్ట. బాగానేవుంది. ఇందులో ఆలోచించాల్సినంతకారణం ఏమీలేదే? అసలు అన్నగారు వస్తున్నందుకు పొంగిపోవాల్సింది. రాధ దీర్ఘంగా ఆలోచిస్తోంది ..... తలా తోకా కూర్చుకోలేక ప్రశ్నార్థకంగా చూశాను.

"మా అన్న వస్తున్నందుకు నేను ఆలోచించడంలేదు. వస్తూ ఆ అచ్యుతాన్ని ఎందుకు తేవాలి అని పట్టుకుంది."

"ఏం? స్నేహితుడుకాబోలు. నీకు తెలుసునంటున్నాదాయన. ఏదో రెండురోజులుండి వెళ్తారు. దానికి బుర్ర బద్దలు చేసుకోవాలా?" అన్నాను గుక్కతిప్పుకోకుండా.

"నీ కర్థంకాదు. మణీ. నే చెప్పిందంతా విన్నతర్వాత మాట్లాడు.

ఈ అచ్యుతాన్ని ఎనిమిదేళ్ళ క్రితం చూశాను. ఒక సాయింత్రం - అంటే నేను S. S. L. C. చదువుతున్న రోజుల్లో స్కూలునించి యింటికొచ్చేవేళకి-మా అన్నా, యీ అచ్యుతం కనిపించారు. అప్పటికి ఏడాదినుంచి అన్నయ్య బొంబాయిలో వుంటున్నాడు. ఏదో చదువుకని వెళ్ళి డబ్బంతా తగలేస్తున్నాడని నాన్న అన్నయ్యమీద నిప్పులు చెరుగుతుండేవారు. అకస్మాత్తుగా అన్నయ్య రావడం నాకు ఆశ్చర్యంవేసింది.

దక్షిణవేపు గచ్చరుగుమీద నుల్చున్నాను. అప్పుడే సూర్యుడు అస్తమిస్తున్నాడు. చాలా గమ్మత్తుగా వుంది. అరుగుమీద నుల్చున్న నన్ను అచ్యుతం కిటికీగుండా తీక్షణంగా చూస్తున్నాడు కాబోలు - ఆ చూపులు నా వీపుని సూదుల్లా పొడిచినట్టయింది.

వంటింట్లోకి వెళ్ళిపోయాను. కాసేపు అయాక అన్నయ్య నన్ను అచ్యుతానికి పరిచయం చేశాడు. వారిద్దరూ ప్రాణ స్నేహితులట.

అచ్యుతానివి మనిషిని నిలబెట్టే చూపులు. అతను అంత అందగాడుకాదు. సన్నగా పొట్టిగా వుంటాడు. ముఖంలో కళాకాంతులు వుండవు. ఆ కళ్లే సూదుల్లా వుంటాయి.

మొగాళ్ళంటే ఏమాత్రం నదురూ బెదురూ లేని నేను కొంతసేపటిదాకా అచ్యుతంతో సరిగా మాట్లాడలేకపోయాను. అతని చూపులు కందిరీగల్లా ఝుంయ్‌మంటూ కుడతాయి.

మాటల్లో పడ్డాం. ఏవో ఖబుర్లు అంజూర చెట్టు కింద సన్నని వెన్నెల్లో కూచుని మాట్లాడుకున్నాం. అచ్యుతం-చింతపండు ధర దగ్గరనుంచి చీనా సమస్యదాకా ఒకటేమిటి అన్నీ - ధారాపాతంగా మాట్లాడతాడు. లోకజ్ఞానం ఎరగని నాకు అతనొక మహాపండితుడులా తోచాడు.

అందరం భోజనాలుచేశాం. అన్నయ్యకీ, అచ్యుతానికీ దొడ్లో కాకరపాదు నీడలో పక్కవేశారు. నేను పుస్తకాలు పుచ్చుకు చదువుకి వుపక్రమించాను. అచ్యుతం కళ్లూ, మాటలూ నా ఏకాగ్రతని పాడుచేశాయి. ఏదో చదువుకుపోతున్నాను. నా వెనక అడుగుల చప్పుడుకి తలెత్తి చూశాను.

"ఈ ఒక్క రాత్రీ ఆ అర్థంలేని పాఠాలకి శెలవివ్వకూడదూ? తెల్లారగట్ల మేం వెళ్ళిపోతాం. ఆ తర్వాత మీరా పుస్తకాల్తో కుస్తీపట్టచ్చు. మీ అన్నయ్య పిలుస్తున్నాడు. రండి. చక్కటి ఖబుర్లు చెప్పుకుందాం దొడ్లో కూచుని." అన్నాడు అచ్యుతం.

అన్నయ్య మంచంమీద కూచున్నాను. అచ్యుతం దిళ్ళమీద చెయ్యి ఆనించి, అరచేతులో గడ్డం పెట్టుకు, వరిగి పడుకున్నాడు. ఏవేవో ఖబుర్లు. మధ్యమధ్య అతను తన చూపుల్తో నన్ను చీల్చేస్తున్నాడు. అలా చూసినపుడు ఆ కళ్ళు రెండూ పొడవాలనిపించేది. అన్నయ్యా తనూ కలిపి ప్రపంచాన్ని మారుస్తారట. ఆ మార్పుకు ధనం అవసరం. అందుకోసం నాన్న దగ్గరకు అన్నయ్య వచ్చాడు. చుట్టూ వెన్నెల, పుచ్చపువ్వులాంటి



వెన్నెల. వెన్నెల్లో కొకరాకుల వంపుల నీడలు. నిశ్శబ్దంగావుంది ప్రకృతి. పైథాగరస్ థీరమ్ కిందవున్న మూడో రైడరు రాలేదని నాకు మనసులో బాధగావుంది.

"పొద్దుటే స్కూలికి వెళ్లాలి. నిద్దరొస్తోంది" అన్నాను అన్నయ్యనీ అచ్యుతాన్నీ వుద్దేశించి. పన్నెండుకొట్టారప్పుడే.

"మేము వెళ్ళేవేళకి లేవరూ?" అన్నాడు అచ్యుతం.

"అల్లాగే" అంటూ లోపలికివెళ్ళి పక్కమీద పడ్డాను. నా కళ్ళు మూతలుపడ్డాయి.

తెల్లారగట్లమూడింటికి అన్నయ్య లేపాడు- శాము రైలుకి వెళ్ళిపోతున్నామని.

గచ్చరుగు మీదకొచ్చి నుల్చున్నాను. వెన్నెల వెలా తెలా పోతోంది. మామిడాకుల నీడలు మామీద పడ్తున్నాయి. అచ్యుతం నాచేతిని తనచేతులోకి తీసుకుని వేళ్లనొక్కుతూ 'వస్తాన'న్నాడు. నాచెయ్యి ఝల్లుమంది.

ఇంటర్ సీనియర్ చదువుతుండగా నాకు పెళ్ళయింది. నా పెళ్ళయిన నెల్లాళ్ళకు అన్నయ్యకీ నాన్నకీ డబ్బువిషయంలో పేచీలు వచ్చాయి. నాన్న అన్నయ్యని యింట్లోంచి తరిమేసి ఒక్కదమ్మిడీ అడగొద్దన్నారు. అన్నయ్య డబ్బు బాగా తగలేసినమాట నిజమే. అచ్యుతంవల్లనే యిలా తయారయాడని నాన్న అప్పుడప్పుడు అమ్మతో భోజనాలదగ్గిర అంటూండేవారు.

ఆ తర్వాత అచ్యుతాన్ని పూర్తిగా మరిచిపోయాను. జ్ఞాపకం వుంచుకునేందుకు ఏముంది కనక? మొదటినుంచి అన్నయ్యకి నాపెళ్ళి యిష్టంలేదు. కాని అతని యిష్టాయిష్టాల ప్రసక్తి ఎవరికి? అన్నయ్యమాటకు యింట్లో విలువలేదు. ఈ ఆరేళ్ళబట్టీ అన్నయ్య ఖబురు మాకు తెలియదు. మళ్ళీ యివ్వాల్టికి యీవుత్తరం. అన్నయ్యవస్తే ఫర్వాలేదుగాని, అచ్యుతాన్ని ఎందుకు తోడు తీసుకురావాలి?

ఆరేళ్ళనుంచి హాయిగా వెళ్ళిపోతోంది. కాని అతని చూపులు తలుచుకుంటే ఎందుకో భయంగా వుంది. అసలు అతను యిప్పుడు యిక్కడికి రావడం ఎందుకు?

"ఏంవస్తే? ఆనాటి చిలిపి రాధ యీనాడు ఎలావుందో చూదామని రావచ్చు. బంగారు దేనికి? వుండాల్సినంత దూరంలో వుంచు. చిన్నతనంలో జరిగిన ప్రతిదాన్నియిలా పట్టుకూర్చుంటారా? వడ్లగింజలో బియ్యపు గింజ" అన్నాను.

"నీకు తెలియదు మణీ. ఆ చూపుల్లోని మంత్రప్రభావం నీ కర్థంకాదు. హాయిగా నిర్మలంగా గడిచే నాజీవిత ప్రాంగణంలోకి అతను ఎందుకు రావాలి?"

"ఎంత వెర్రిదానివి! గోరంతలు కొండంతలు చేసుకువిచ్చిని పడుతున్నావు. మీఆయన స్నేహితు లెందరు రావడంలేదు-మీయింటికి? చూపుల్లేవు - గీపుల్లేవు. లోకజ్ఞానం తెలియని దానివి కాబట్టి ఆనాడు ఆ చూపులు నిన్ను కట్టేశాయి. ఆరేళ్ళు కాపరంచేశావు. ఒక మొగాడికి భయపడ్తావా? స్త్రీకి వివాహంతో బాల్యమంతా అంతర్ధానమవుతుంది. నీ కిష్టం లేకపోతే వెళ్ళిపొమ్మని చెప్పు. మీ అన్న య్యని చివాట్లెయ్యి. అంతేగాని యింత కలవరమా?"

"కాని ..." రాధ వాక్యం నమిలింది.

ఏదో గడ్డుసమస్యే వచ్చేట్టుంది. ఆ సాయంత్రం ఎనిమిదింటిదాకా ఖబుర్లాడి యింటికొచ్చాను. కాని ఎందుకో ఆ రాత్రి నిద్రపట్టలేదు. రాధముఖం పలుమార్లు వికారంగా కనపడింది కళ్ళముందు.

మర్నాటి సాయంత్రం రాధ యింటి కెళ్ళాను. నే వెళ్ళే వేళకి తోటలో వాలుకుర్చీ మీద ఒక ఎముకలపుట్ట వుంది. లోపలి కెళ్ళాను. హాల్లో రాధలేదు. డాబామీద చాప పరచుకు పడుకునుంది. ఇరవైనాలుగు గంటలలో రాధలో విపరీతమైన మార్పు వచ్చింది. నవ్వే ఆ కళ్లు నీలిమబ్బుల్లా బరువుగా వున్నాయి. చెక్కిళ్ళు వడలిపోయాయి. ఏదో పెద్ద ఆపదలో చిక్కుకున్నట్టుంది. ఇదెక్కడి అవస్థ రాధకి?

"రాధా!" అన్నాను.

"వచ్చావా?" అంది - నాకోసమే ఎదురు చూస్తున్నట్టుగా. ఆమె అరిచేతులు సలసల కాగుతున్నాయి.

"ఏమిటి రాధా?"

"ఏముంది - అనుకున్నంతా అయింది."

"అంటే?"

"వచ్చేటప్పుడు చూడలేదూ?"

"ఏమిటి?"

"అతన్నే - అచ్యుతాన్ని. నాకోసం ఎలా అయిపోయాడో - చూడు. ఎంత పాడయి పోయాడో - పాపం ఆరేళ్లు ఎలా కృశించి పోయాడు!"

అర్థం అవుతోంది. వెర్రిరాధ! మొగవాళ్ళ దబ్బామోతల్ని రాధ నమ్ముతోంది. అచ్యుతం ప్లేటు మార్చాడా? రాధ హృదయాన్ని కదిలించపోతున్నాడా? యిద్దరూ కష్టసుఖాలు చెప్పుకున్నారన్నమాట! సాలెగూట్లో నా రాధని చిక్కుకోనిస్తానా? ఈ మొగాళ్ళు ఐంద్రజాలికులు. రాధ అన్నగారు మనిషా - పశువా?

"ఈ ఎనిమిదేళ్ళూ నేను అతన్ని మర్చిపోయాను. కాని నన్ను అతను ఒక క్షణం గూడా మరవలేకపోయాడు. గచ్చరుగుమీద ఆనాడు నన్ను చూసిన వుత్తర క్షణంలోనే ప్రేమించాట్ట. యీ లోగా నేను మరొకరి సొత్తునయిపోయాను. ఈ ఎనిమిదేళ్ళూ నన్ను తల్చుకుంటూ ఎలా కృంగి, కృశించి పోయాడో - పాపం! చూడు ఒట్టి ఎముకల పుట్ట యీనాడు. నేను హాయిగా నవ్వుతూ అచ్యుతంలాంటి మనిషి ఒకడున్నాడనే సంగతే మర్చిపోయాను. నా ప్రేమకోసం తపనపడి యిలా అయిపోయాడు" అంది.

ప్రేమపైత్యం రాధకి పూరాగా ఎక్కింది. అచ్యుతం గ్రామఫోను పాటని వోపిగ్గా విన్నదన్నమాట. "అయితే మరి నీ పెళ్ళికాక మునుపే, ఆ ప్రేమని వెళ్ళబెట్టకపోయాడా?" అన్నాను కోపంగా - కసి కనిపించనీకుండా.

"నా పెళ్ళి అంత తొందరలో అవుతుందని అనుకోలేదుట. తనకి నామీద ప్రేమ వున్న సంగతి అన్నకి తెలుసట. అందుకే అన్న నా పెళ్ళికి యిష్టపడలేదు కాబోలు."

"పోనీ - నీ పెళ్ళి యిద్దరూ కలిసి ఆపించలేకపోయారా?"

"ధైర్యం లేకపోయిందట."

"ధైర్యం లేకపోయిందీ? యిప్పుడు నిర్మలంగా గడిచే నీ సంసారాన్ని కలత పెట్టేందుకు ధైర్యంవచ్చిందా? రాధా! ఎంత తెలివిగలవాళ్ళూ, ఒక్కొక్క సందర్భంలో మూర్ఖులైపోతారు సుమా? నువ్వింకొకరి భార్యవి. నీ కనేక బాధ్యతలున్నాయి. మీ అన్నయ్యా అచ్యుతం దేశదిమ్మరులు. నేను కనుక్కుంటా యీ సంగతంతా - మీ అన్నయ్యేరీ?"

"అన్నయ్యా డాక్టరుగారూ క్లబ్‌కి వెళ్ళారు."

"మీ యిద్దర్నీ యింట్లో వదిలా? భేష్!"

రాధ చురచుర చూసింది. ఆ ఎముకల పుట్టను చూసి ఏమానవమాత్రుడూ తప్పు పట్టలేడు. రాధ సౌశీల్యంగురించి కాదు నా చింత. పరిశుభ్రమైన మనసుని పాడుచేసుకుంటోందే అని నాబాధ.

"ఇంతకీ అచ్యుతం యిక్కడి కెందు కొచ్చినట్టు?" అని అడిగాను.

"ఏమీలేదు. డాక్టరు టి. బి. అన్నాడు. డాక్ట రెందుకు - ఆమాట మనమే చెప్పచ్చు. శానటోరియమ్‌లో జేరాలిట. చివరిసారి నన్ను చూద్దామని వచ్చాడు. అట్టే ఆశలులేవు. మహాఅయితే ఓయాడాది బతకొచ్చుట. అదిగాక అతనికి జీవించాలని పెద్ద కోర్కెకూడా లేదు," అంది రాధ విచారంగా.

"ఏం?" అన్నాను. జారిపోతున్న రాధని పట్టుకోవలసిన భారంనాది. "అయితే రాధా! ఆరేళ్ళనుంచీ రాక యిప్పుడు రావడమేం? ఆరోగ్యం నాశనం చేసుకుని నువ్వు కారణం అని యిప్పుడు చెప్పటం దేనికి? ఇంత హీనస్థితికి రాకమునుపే నిన్ను చూసి వెడితే కనీసం నీకు శాంతి అయినా వుండేదిగా. తను మనసారా ప్రేమించిన మనిషి అశాంతి పాలు కాకుండా వుండేదిగా?"

"నువ్వు నాగురించి తాపత్రయపడుతున్నావుగాని అతని హృదయాన్ని చూడటం

లేదు, మణీ. ఏ ఆశా చిగురించక జీవితపు ఆఖరిదినాల్లో యిక్కడికొచ్చి....”

“వొచ్చి!....అతనికి ఏంకావాలి? ఎందుకు వచ్చాడు?”

“అతనికి ఏమీ అక్కర్లేదు. నన్ను కడసారి చూద్దామని వచ్చాడు. అతను కోరేదేమిటి? నాకు నేనే....” అని నాకళ్ళలోకి చూసి ఆగిపోయింది.

చివరి అధ్యాయం దగ్గిరకొచ్చామన్నమాట. “అసలు నీవుద్దేశం ఏమిటి, రాధా? నువ్వు అతన్ని ప్రేమిస్తున్నావా?”

రాధ నాప్రశ్నకి సమాధానం చెప్పకుండా రోగిష్టినవ్వు నవ్వింది.

“ఎల్లుండి పొద్దుట అతను శానటోరియమ్‌లో జేరుతాడు. నాకోసం అతను చనిపోడం యిష్టంలేదు. నాచేతనైన కృషితో మృత్యుముఖంనుంచి అతన్ని తప్పించాలని వుంది.”

“నువ్వు అతన్ని ప్రేమిస్తూవుంటే నేను చెప్పకలిగిందేమీ లేదు. అది నీ హృదయానికి సంబంధించిన విషయం” అన్నాను ముక్తసరిగా.

రాధ ఆకాశంలోకి చూస్తూ కూచుంది.

“అయితే - అతను నీవల్లే యీ స్తితికి వచ్చాడని నిజంగా నమ్ముతున్నావా రాధా? నిజంగా నీవల్ల యీ స్తితి కొచ్చిన మనిషి, అంత బాధ భరించగల వోపిక వున్న మానవుడు ఆఖరి ఘడియల్లో పాలల్లో వుప్పురాయి విసరడు. నీ జీవితంతో చెలగాట మాడేందుకు అతనెవరు? నిజంగా స్వార్ధం కనక లేకపోతే అసలు యిక్కడికి రానేరాడు. వొచ్చినా పెదవి మెదపక వెళ్ళిపోయి వుండును. నువ్వు కళ్ళు తెరిచి ముళ్ళలోకి అడుగెడుతున్నావ్. ఊబిలో కూరుకుపోతావ్. తిరిగి డాక్టరు గారింటిలో ప్రవేశించే అర్హత నీకు వుంటుందా? బాగా ఆలోచించుకో” అని చివాలున లేచాను.

“మేమిద్దరం మాట్లాడుకోవల్సిందేమీ లేదింక, ఇద్దరిదీ చెరోదారి.”

ఆ రాత్రి ఎన్నో పీడకలలు వచ్చాయి. రాధ మీద చెప్పలేనంత ప్రేమ పుట్టుకొచ్చింది. నేను ఏంజేసి రాధను కాపాడగలను? నిజంగా నాకు ప్రేమ తెలీదా? ప్రేమించ గలిగే హృదయం నాకు భగవంతుడు ప్రసాదించలేదా? ‘ఎందుకలా వులికిపడుతున్నావ’ని ఆయన ఎన్నోసార్లు అడిగారు.

తొలికోడి కూసింతరువాత, కాస్త కునుకు పట్టింది. ఇంతలో పాలమనిషి దబదబా తలుపుకొట్టాడు. తలుపు తీసి చూతునుగదా పాలమనిషిగాదు—రాధ! నన్ను గట్టిగా కావిలించుకు బావురుమంది.

తెలతెలవారుతుండగా అచ్యుతం తన చేతుల్లోనే నిశ్చింతగా కళ్ళు మూసుకున్నాట్ట. రాత్రంతా అతన్ని ఎంత శపించి పోశాను!



# అగాధపుటంచున....

నాకు చిన్నప్పట్నించీ, అంటే సరిగ్గా వూహ తెలియకముందునుంచి, కూడా ఆత్మహత్య అంటే ఒక రకమైన భయభక్తులు, ప్రేమాదరాలు వుండేవి. దీనికికారణం నేను సరిగాచెప్పలేను. కాని బహుశా ఒకటైయుంటుంది. చిన్నతనంలో మనకి జీవితం అంటే ఆపేక్ష చాలాయెక్కువ. నిజంగా జీవితాన్ని సంపూర్ణంగా హత్తుకొని అనుభవించగలిగే చిన్నతనంలోనే అలాంటి జీవితాన్ని యెవడైనా స్వేచ్ఛగా తృణీకరించాడంటే వాడిని ఒక రకంగా గొప్పవాడినిగా యెంచటం సహజం. కాని రానురాను నాకు ఆత్మహత్యమీద యీ గౌరవంపోయింది. ఆత్మహత్య చేసుకొనే వాళ్ళ వుద్దేశ్యాలు నేను అనుకొన్నంత మహత్తరమైనవి కావేమోననే అనుమానం కలుగసాగింది. భర్తతో పోట్లాడి చెరువులో దూకి చనిపోయిన భార్య, పరీక్షతప్పి రైలు కింద తలదూర్చిన విద్యార్థి కడుపునొప్పిని భరించలేక విషంపుచ్చుకున్న ముసలాయన వీళ్ళందరూ నిజంగా ఘనకార్యంచేసినవాళ్లేనా అని నేను ప్రశ్నించుకొనేవాణ్ణి. కాని ఆత్మహత్యల్లో అన్నికేసులూ యిలాంటివికావు.

కొన్నిసంవత్సరాలక్రితం నేను వార్తాపత్రికల్లోఒక వార్త చదివాను. అది విభిన్న జాతిమతాలకుచెందిన నిరాశప్రేమికుల విషాదాంతగాథ. సంఘాన్ని తల్లిదండ్రులను తదితర బాహ్యప్రాపంచిక శక్తులను చూచి వెఱపొందిన యిద్దరు ప్రేమికులు మద్రాసు నగరంలో ఒక హోటలు కిరాయి గదిలో కలుసుకొన్నారు. వాళ్ళిద్దరు యిదివరకే ఒక నిశ్చయానికి వచ్చియున్నారు. ఆరాత్రి వారు యెంతో కులాసాగా విందుకుడిచి ఆ పవిత్రావసరంలో సోమపానంగూడా చేశారు. నూతన వధూవరుల్లాగా చక్కగా అలంకరించుకున్నారు. ఇదివరకు వందలమందికి ఆశ్రయమిచ్చిన ఆ హోటలు పక్కనువాళ్ళు గులాబీపూలతో కప్పివేశారు. ఆరాత్రి వాళ్ళు యేం మాట్లాడారో యేం ఆలోచించారో వూహించడం చాలా కష్టం. జీవితకాలమంతటిలో పొందవలసిన అనుభవాన్ని అనుభూతిని కొద్దినిముషాల్లో యిమడ్చగలగటం, సంవత్సరాల ఆవేశాన్ని కొద్దిక్షణాల్లో కూడగట్టగలగటం, ప్రాపంచికవిషయాల జంజాటంలోనుంచి సారాన్ని గ్రహించి తుక్కును వదలివేయగలగటం, యివన్నీ ప్రతివొక్కడికీ తటస్థించవు. సాధారణ జీవితం జననమరణాల ఆహారమైధునాల చేతి పరిశ్రమలాగ తేలికగా వెళ్ళిపోతూవుంటుంది. తుఫానువేగాన్నీ హాలాహలంచేదునీ అగ్నిపర్వత గర్భంలోని వుష్ణతనూ మనం అంచనావేసే పరిస్థితి యెప్పుడో

'బైరాగి'

గాని రాదు. ఆ ప్రేమికులిద్దరికీ యీ గొప్ప అదృష్టంపట్టింది. వాళ్ళ అంతిమక్షణాలు మానవుని అమరత్వంలో అచంచలమైన విశ్వాసంతోనే గడిచిపోయాయని అను కొంటాను. రెండవరోజు ప్రొద్దునపూట పోలీసు యజమానికి తలనొప్పి, పోలీసు వాళ్ళకి చేతినిండాపని, మర్యాదస్థులయిన వారి బంధువులకు తలవంపులు మిగిలాయి. పత్రికలవారు మాత్రం బాగా వుపయోగించు కున్నారు, యీవార్తను. ఈ పైనుదహరించిన కేసులో ఒక రకమయిన అందంలేకపోలేదు. పూర్వపు నవలారచయితలైతే యిలాంటి ఘట్టాలను యెంతో సజీవంగా సహానుభూతితో చిత్రించివుండేవాళ్ళు. కాని నేటి ప్రపంచంలో యెక్కువమంది యిలాంటి వార్తలువింటే నవ్వటమో హేళనగా తలవూపడమో జరుగు తుంది. నామట్టుకు నేను అది ఆ ప్రేమికుల పిరికితనమని నిందించాను. ఇవ్వాళగూడ నేను నలుగురిలో మాట్లాడవలసివస్తే అది పిరికితన మనే అంటాను. నాలాగాకాక మరికొంత మంది దీనికి ఆర్థికరాజనైతిక కారణాలుకూడా వెతకగలరు. వారివాదన సబబుగానేవుంటుంది. ఫలానాపరిస్థితుల్లో ఫలానా మనస్తత్వంగలిగిన వాళ్ళు గనక వారు ఫలానావిధంగా ప్రవర్తిం చారు అని అంటారు యీ మహాశయులు. వీరు మానవజీవితాన్ని గణితసూత్రాలుగా ప్రతిపాదించగలరు. వీరిదృష్టిలో మానవుని యింద్రియానుభవాలన్నీ రాసాయనిక పరి వర్తనాలవలన కలుగుతాయి. వీరు యెంతటి గడ్డుసమస్యనయినా పాఠ్యగ్రంథాల ననుస రించి యిట్టె పరిష్కరించి వేయగలరు. ఇలాంటివారికి ఆత్మహత్య యెప్పుడూ ఒక సిగ్గుపడవలసిన విషయంగా కనిపిస్తుంది.

నాకుపద్దెనిమిదిపందొమ్మిదియేండ్లున్నపుడు తర్కబుద్ధిలో అచలమైన విశ్వాసంవుండేది. అప్పుడు తర్కించందే యేవిషయాన్నీ అంగీ కరించేవాణ్ణికాదు. ప్రతిదానికి కార్యకారణ సంబంధం వెతికేవాణ్ణి. ప్రపంచ వ్యవహారా లన్నిటినీ యేదో ఒక సిద్ధాంతంలో యిముడ్చు కోవాలని చూసేవాణ్ణి. అలా యిమడనివాటిని బెజ్జములోపట్టని మరమేకులాగ అవతల పారవేసేవాణ్ణి. అప్పుడప్పుడు నామనస్సు యెదురుప్రశ్నలు వేసేది. కాని దాన్ని యెలా గోలా సమాధానపర్చేవాణ్ణి. ప్రపంచా న్నంతటినీ ఒక సువ్యవస్థితమయిన సామ్రా జ్యంలాగ సంభావించే యీ అలవాటు కొత్తది గాదు. నాకంటేముందు యెంతమంది దీనివల్ల బాధపడ్డారో? ఆరోజుల్లో నాప్రశ్నలకు విసిగిన పండితులు నన్ను వితండవాది అనేవాళ్ళు. పామరులు రెట్టమతస్థులనేవాళ్ళు. అప్పుడు నేను చాలయెక్కువగా వాగుతూండేవాడి నన్నమాట నిజం. ఆరోజుల్లో నాకు ఆత్మ హత్య అర్థంఅయ్యేదికాదు. నిర్హేతుకంగా కనిపించిన ప్రతిదాన్ని శంకించేవాణ్ణి. తన కర్థంగానిదాన్ని దూషించటం మానవసహజం గదా? అందువల్ల నేను అలాగే చేసేవాణ్ణి. అప్పుడు నేను యిలా తర్కించుకునేవాణ్ణి: "బ్రతకటంవల్ల యేంలాభం అని అంటున్నావు నిజమేకావచ్చు. కాని చావటంవల్ల మాత్రం యేంలాభంవుంది? అందువల్ల బ్రతకటమే మంచిది." అప్పుడు నేను యిది లాభనష్టాలకు సంబంధించిన విషయంకాదని గ్రహించలేక పోయాను.




"ముద్దాయివీరయ్య సోమయ్యగొంతు పిసుకుతున్నప్పుడు మీ రేం చేస్తున్నారు?"
"నన్ను సాక్ష్యంవేసుకుంటారని భయంవేసి కళ్లుమూసుకున్నాను సార్!"

కాని తరువాత తరువాత నాదృక్పథం మారింది. ఇది యెలామారిందో నేను చెప్ప లేను. బహుశా నేను బొమ్మను తలకిందులు చేసి చూడటం నేర్చుకొని వుంటాను. నేను నిరాశావాదిని అయ్యానని మీరంటారేమో. కాని యిది నిజంకాదు. నేను పూర్వం యెలాగున్నానో యిప్పుడూ అలాగే వున్నాను. నాలో పెద్దమార్పేమీ లేదు. పూర్వం నేను యేరీతిని ఆలోచించేవాడినో అదేమాదిరిగా యిప్పుడూ ఆలోచిస్తున్నాను. నాలోవచ్చిన మార్పేమన్నావుంటే అది క్రమాగతమయిన వికాసంలాంటిదే. నాలో అంతర్విప్లవాలేమీ జరుగలేదు. కాని ఒకటిమాత్రం నిజం. నాకిప్పుడు హేతువాదంలో పూర్వంవున్నంత సమగ్రమైన విశ్వాసంలేదు. అంటే నా కిప్పుడు ప్రకృతినియమాల్లో నమ్మకం పోయిందనిగాని లేక సూర్యుడు తూర్పునగాక పడమరనగూడా వుదయించవచ్చుననే అనుమానం గలిగిందనిగాని కాదు. పురాతనపు తర్కబుద్ధి యిప్పుడుకూడా అన్నివిషయాల్లో పనిచేస్తూనేవున్నది. రాచకీయాలూ, ఆర్థిక సంబంధాలూ, కొరియాయుద్ధం, నైతికపు విలువలు వీటినిగురించి మాటాడేటప్పుడు నేను యిదివరకెలా తర్కసమ్మతంగా వుండేవాడినో యిప్పుడూ అలాగేవుంటున్నాను. కాని యీతర్కం అన్నిచోట్లా, ముఖ్యంగా మానవజాతితో.వైయ్యక్తిక సంపర్కం కలిగిన చోట్ల, పనిచేయటంలేదు. అలాంటి పనిచేయని చోటులలో ఆత్మహత్య ఒకటి. అంటే ఒకప్పుడు నా తర్కంతో యీ చిక్కుల్ని

విశమర్చగలిగి వుండేవాణ్ణికాదు. లేదా యేమిటంటే అప్పుడు నేను నావోటమిని వొప్పుకొనేవాణ్ణికాదు, యిప్పుడు ఒప్పుకొంటున్నాను. పూర్వం మాదిరిగా నేను నా తలకుమించిన సమస్య వచ్చిపడ్డప్పుడు కండ్లుమూసుకొని తప్పుకుపోవాలని చూడటం లేదు. నేనిప్పుడు ధైర్యంగా దానికేసి చూస్తున్నాను. జీవితం విచిత్రమయినది. మృత్యువుకూడా విచిత్రమయినదే. ఈ రెండింటిలో యేది యెక్కువ విచిత్రమయినదో చెప్పగలగటం చాలాకష్టం. ఆమాట కొస్తే యేది మృత్యువో యేది జీవితమో చెప్పటమే కష్టం. జీవితం మృత్యువులో వికసిస్తుంది. మృత్యువు జీవితంలో వాడిపోతుంది. మెరుపుమెరిసేముందు చీకటి. మెరుపు మెరిసింతరువాత చీకటి. దానినే మనం రెండుచీకట్లమధ్య మెరుపనిగాని, రెండుమెరుపులమధ్య చీకటి అనిగాని అనొచ్చు. లెఖ్ఖలేనన్ని అంకెలుగలిగిన యీగొలుసుకి యెక్కడ మొదలో యెక్కడ ఆఖరో చెప్పటంకష్టం. కోట్లకొలది క్షణాలతో అనంతమయిన కాలావధి నిర్మించబడింది. కాని ఒక్కొక్క క్షణంలోనే ఒక్కొక్క అనంతంవున్నది. ఈవిధంగా పూలతోటలో వున్న వందలకొలది పూలల్లో ఒక్కొక్కదానిలో ఒక్కొక్క పూలదోటవున్నది. ప్రతి మనిషి తనకితాను మొదలు, తనకితాను చివర. ప్రతిమనిషీ ఒకసృష్టి. ఒకప్రళయం. ఆద్యంతాలులేని జీవితపు నవలలో ఒక్కొక్క పరిచ్ఛేదం. ఒక్కొక్క స్వయం సంపూర్ణమయిన కథ. దాని పుటకి కదేకారణం. ఈ విధంగా కన్నులు మిరుమిట్లుగొలిపే మెరుపూ, కాటుకవరదలా కమ్ముకొనే చీకటీ, అకాశ సముద్రంలో తరంగాలు. ఇదిబుడగ. ఇది నురుగు. ఇది యెక్కడినుంచి బయలుదేరిందో యెందుకు బయలుదేరిందో యెవడు చెప్తాడు? తరంగాలులేచి పడిపోతాయి. తుపానులేచి ఆగిపోతుంది. కాని సముద్రం అలాగే వుంటుంది. అదేవిధంగా జనన మరణాలను అధిగమించిన శక్తివొకటి వుంటుందని కొంతమంది అంటారు. నాకు తెలియదు. ఇందువలన నే నిది నమ్మలేను. నాకు పునర్జన్మలో నమ్మకంలేదు. కాని నాచైతన్యం నాతోబాటు అంతమొందుతుందని నేను ఆలోచించలేక పోతున్నాను. ఏదోవొక రూపంలో అమరత్వంఅనేది వుంటుందనే ఆశ మానవజాతిని యెప్పుడూ పీడిస్తూనే వుంటుంది. ఎందువల్లనంటే మనక్రియాకలాపాలుగాని, తత్సంబంధమయిన ప్రతిక్రియలుగాని మనతోబాటే అంతమొందితే యిక యీ జంజాటంఅంతా యెందుకు? దైహికానందంతో అసంతృప్తిచెందేవాడికి జీవితంలో కోరతగింది చాలాతక్కువ. ఒక 60 సంవత్సరాల్లో నేననేది లేకుండాపోయినపుడు నాకుసంబంధించిన ఋజువు ప్రపంచంలో యేమి మిగిలివుంటుంది? ఒకవేళ మిగిలివున్నా దానివలన నాకువచ్చే లాభం యేమిటి? ఈదృష్టితోచూస్తే జీవితసంఘర్షణ అనవసరంకాదా? ఆవేశాల అగ్నిలో కాలిపొయ్యే మానవుని ఆత్మకు శాంతియెక్కడ? అలాంటి శాంతివుండే ఆశకూడాలేనపుడు నిశ్శబ్దంగా చీకటిలో చెరిగిపోవటమే మంచిది



పంతులు :- అరే, నువ్వొక్కడివే యిన్నితప్పు లెలాచేశావో నాకు ఆశ్చర్యంగావుంది.

విద్యార్థి :- నేనొక్కణ్ణీకాదుసార్ ; మా అన్నయ్యా, నాయనాకూడా చేశారు.

కాదా ? ఈవిధమయిన ఆలోచనలు అన్నీ ఒకేదిక్కుకి సంకేతంచేస్తాయి.

కాని నాచైతన్యం నాతోబాటే ఆఖరా ? నే ననుభవించిన సుఖదుఃఖాల్లో నావెలుగుచీకట్లలో నా హృదయంలో రేగినతుపానులో, వరదల్లో, భూకంపాల్లో చివరకు శేషంయేమీ మిగలదా ? నన్ను తృణాలాగా తోసుకెళ్లతున్న యీ కాలప్రవాహం యెక్కడకు తీసుకెళ్లివదుల్తోంది ? నాకుముక్తియెక్కడ ? నేను యీజన్మలో ఆచరించిన కర్మలు నాతోబాటే ఆఖరయితే నేను పుణ్యంచేస్తేనేం ? పాపంచేస్తేనేం ? ఏదిచేసినా ఒకటె కాదా ? అందుకనే మానవులు యింతమంది దేవతలను, యిన్నిమతాలను సృష్టించుకొన్నారు. ఏదోవొకరూపంతో మృత్యువు తరువాత గూడా తనుమిగిలి వుంటానని ప్రతివొక్కడూ తనను తాను నమ్మించుకోజూస్తాడు. కొంతమంది ఐహికాదర్శాల్లో తమయొక్క యీ స్వప్నాన్ని సఫలం చేసుకోవాలని చూస్తారు. కాని వీటివేటిల్లోనూ నమ్మకం లేనపుడు ఆత్మహత్యవొక్కటే శరణ్యం. తనకు మించిన శక్తినిగుర్తించి పరాజయం అంగీకరించటమే ఆత్మహత్య. కూడికలు తీసివేతలు అన్నీ అయిపోయి శేషంగామిగిలినశూన్యమే ఆత్మహత్య.

* * *

కాలప్రవాహంతో స్వేచ్ఛగా మునిగి కనపడకుండా పోయినవారిని నేను యిప్పుడు

నిందించబోవటంలేదు. వారిని నిందించడానికి నేనెవరిని? జీవితం సిద్ధాంతాల బంధనాల నన్నింటినీ ధిక్కరిస్తుంది. ప్రతివొక్కరికీ వొక్కరూపంలో సాక్షాత్కరిస్తుంది. వారు తమత్రోవతాము చూచుకొన్నారు. నేను వారిని పిరికిపందలని యేలా అనేది? మసరిక్, మైకోవస్కీ, ఎసినిన్ యింకా యెంతోమంది మహానుభావులు యీత్రోవను నడిచారు. మానవ ప్రయత్నాల వ్యర్థత్వాన్ని గుర్తించిన నాడు వారినీ అఘాతంలో దూకకుండా అడ్డగలిగినశక్తియేది? వారు అకస్మాత్తుగా త్రోవ మలుపులో మాయమయ్యారు. వాళ్లనెందుకు ఆపాలి?

నాకు మానవుని సంపూర్ణ స్వాతంత్ర్యంలో నమ్మకంవున్నది. అతడు తన అదృష్టానికి తానే అధినేత. అతడు తనను యేరూపంలో కావాలంటే ఆరూపంలో నిర్మించుకోగలడు. అతడు తన జననమరణాలనుకూడా శాసించగలడు. చైతన్యం వున్నంతవరకూ అతడు తన ప్రపంచాన్ని తానే నిర్మించుకుంటాడు. అలాగే నాశనంకూడా చేసుకుంటాడు. అతడు యివ్వాళవున్నరూపం కావాలని కోరితెచ్చుకున్నదే. దానికొరకతడు యెవ్వరినీ దూషించి ప్రయోజనంలేదు. అతడు తనకర్మలన్నిటికి తానే పూర్తిబాధ్యత వహిస్తాడు. అగాధంలో దూకినవారు కావాలనే అలా చేశారు. అందువల్ల వారితో నాకు పేచీలేదు. ఏదో ఆదర్శంకొరకు ప్రాణాలర్పించినవాళ్లు తగినపనేచేశారు. ఏ ఆదర్శం లేకుండా ప్రాణాలర్పించినవాళ్లుగూడా మంచిపనేచేశారు. ఏదో ఒక ఆదర్శంవుండటం మంచిదే కాని యే ఆదర్శం లేకపోవటంకూడా మంచిదే. వాస్తవమేమిటంటే యేదిమంచిదో యేది చెడ్డదో యెవరికి వారే నిర్ణయించుకోవాలి.

ఇప్పుడుపగలు తొమ్మిదింపావు అవుతుంది. కొద్దిగామబ్బు పట్టినట్టుగావున్నది. కాని యివి కురిసిపోయ్యేమబ్బులుకావు. నేను నాగదిలో కుర్చీలో కూర్చునిరాస్తున్నాను. కిందయెక్కడో పనిచేస్తున్నయంత్రాలు నా ఆలోచనకు తాళం వేస్తున్నవి. గాలిచల్లగావున్నది. చెట్లుపచ్చగా వున్నవి. నేను బయటికిచూచినప్పుడు జీవితం నృత్యంలాగా గానంలాగా ఆనందతరంగాల్లా కనిపిస్తూవుంది. వందలకొలది వేలకొలది యిళ్ళల్లో యెక్కడో పిల్లలాడుకుంటున్నారు. పెద్దవాళ్లు యెవరిపనులు వారే చేసుకుంటున్నారు. చప్పట్లు, యీలలు, నవ్వులు, యేడ్పులు, వేలకొలది భావాలు వెలిబుచ్చటానికి, వేలకొలది శబ్దాలు గాలిలోకలుస్తున్నవి. ఈవిశాల మహీతలం చక్కలిగింతలు తగిలిన శరీరం లాగావున్నది. నేను వొంటరిగావున్నాను. అయినప్పటికీ నాచుట్టూ సముద్రాల అవతలా యివతలా అనేక ఖండాల్లో నాలాటివారు, కోట్లకొలది జీవిస్తున్నారు. వారు జీవిస్తున్నారనే భావములో నాజీవితంకూడా యిమిడివుంది. ఈ అనంత గ్రహాదులను, సూర్యచంద్రాదులను, వుదయాస్తమయాల హేమంతవసంతాల ప్రకృతి నియమాలను నేను నిర్మించలేదు. అయినా యీక్షణం వాటిని నేనే నిర్మించినట్టు భావిస్తున్నాను. నాహృదయం ఒక తీవ్రమయిన ఆవేశపువరదతో నిండిపోతుంది. ఇది పరమానందంకావచ్చు. ఇది చరమ యాతన కావచ్చు. రెండింటి అనుభవం వొక్కలాగే కనిపిస్తుంది. కణకణలాడే అగ్నికణాలను ముట్టుకున్నా, చల్లని మంచుగడ్డనుముట్టుకున్నా


వాకేరకమైనభావం కలుగుతుంది. కారణాలు వెతకనక్కరలేదు. కావలసిందల్లా ఆ అనుభవం. ఇదిజీవితంకావచ్చు ఇదిమృత్యువు కావచ్చు. కానియీక్షణం నేను జీవిస్తున్నానన్న విషయం నాకుతెలుసు.

ఈ ఆవేదనను వర్ణించటంయెలాగ? ఇది యెక్కడనుండి వస్తుందో చెప్పడంకష్టం. దీనికి కారణం నాకు తెలియదు, సూర్యునిస్వర్ణ కాంతిలో నిశ్చింతగా ఆడుకుంటున్న పసిపాపలను చూచినప్పుడో, ముసలమ్మ బోసినోటిమీద చిరునవ్వులు చూచినప్పుడో, హిమగిరిశిఖరాల స్వచ్ఛధావళ్యాన్ని గుర్తుకుతెచ్చుకున్నప్పుడో, వెన్నెల రాత్రులలో తాజ్ మహల్‌ని తలుచుకున్నప్పుడో, ప్రియురాలి కన్నుల నీలిలోతుల్లోకి తొంగిచూచినప్పుడో, చక్కని కవిత్వం చదివినప్పుడో, గుండెలను కలచివేసే పాటవిన్నప్పుడో, యెప్పుడో అకస్మాత్తుగా యీ అనుభవం నిన్ను చుట్టుముట్టి వుక్కిరిబిక్కిరి చేస్తుంది. నేటితో జీవితసారం గ్రహించినట్లనుకుంటావు. ఇకనీకు జీవించాలని కోరికవుండదు. ఆ వొక్కక్షణం నీవు జీవనమరణాలను ఒకేకంటి అద్దమునుంచి చూచావు. చీకటిలో మెరుపుమెరసిన క్షణం అదే, జీవితంఅంటే యేమిటో నీవిప్పుడు తెలుసుకున్నావు. నీకు సంపూర్ణమయిన తృప్తికలిగింది. మెరుస్తూ తడిగావున్న కళ్ళతో నీవు తిరిగి ప్రపంచాన్ని చూచినప్పుడు అది పూర్వంమాదిరిగా వుండదు. అదే అగాధపు అంచున వున్న క్షణం.

ఇంకా యేమిటికావాలి నీకు? నీవు చూడవలసింది చూచింతరువాత నీకు కావలసింది అయింతరువాత యింకాయెందుకు బతకాలనుకుంటావు? "నిద్ర, కలలు, అక్కడే వున్నది గమ్మత్తు అంతా. నీవు ఈ నశ్వరరూపాన్ని త్యజించిన తరువాత శాశ్వత నిద్రలో యేమి కలలు గంటావో యెవడికి తెలుసు?" అనుమానించకు. నిద్రపో, నీఆత్మ రోజాపూలవాసనలాగ అదృశ్యమయి గాలిలో తేలిపోతుంది. ఒక అపరిచితమయిన స్టేషనులో అప్పుడే రైలునుంచి దిగినట్టుగా వుంటుందినీకు. నీకు యే సాహసకృత్యాలు తటస్థిస్తాయో యెలాతెలుసు? నిర్భయంగా నిద్రపో. నీ పక్క తెల్లగా శుభ్రంగా వున్నది. పక్కన పుష్పపాత్రలు, రంగురంగుల పూలున్నాయి. తెల్లని దుప్పటి కప్పుకో. నీ అలసినశరీరంలో ఒక రకమైన వెచ్చదనం ప్రాకుతుంది. నీవు నిశ్శబ్దంగా చిన్న అలలమీద తేలిపోయే వినోదనౌకలా నీకు తెలియకుండానే అనంత వినీలసాగరంలో ప్రవేశిస్తావు. అక్కడే అన్నిత్రోవలూ కలుసుకుంటాయి.



[పెద్దకథ]




## మొదటి ప్రకరణం

***

మధ్యాహ్నం ఒంటి గంటనుంచి దాదాపు నాలుగు గంటలదాకా సీతమ్మకు విశ్రాంతి. నలుగురు అమ్మలక్కలు చేరి లోకాభిరామాయణం మాట్లాడటానికి అదే సమయం. ఈ లోకాభిరామాయణం అందరాడవాళ్ళకూ అవసరమే గాని కొందరు దీనికోసం ఇతరుల దగ్గిరికి వెళ్ళనవసరం లేకుండా సీతమ్మలాగా తమదగ్గిరికే ఇతరులను రప్పించుకోగలరు. మరి కొందరు అమాయికస్త్రీలు సుబ్బమ్మలాగా రోజూ ఎవరో ఒకరి ఇంట అటెండన్సు వేయించుకోవలిసిందే.

సుబ్బమ్మంటే సీతమ్మగారింటో పడమటిభాగంలో కాపరం ఉంటున్న లావుపాటి, నల్లటి ఆవిడ. ఇంకెవ్వరూ రాకపోయినా సుబ్బమ్మ మటుకు రెండు గంటలలోపలే హాజరయేది. పూర్తిగా రెండు గంటలసేపు లోకాభిరామాయణం నడిచేది.

ఆడవాళ్ళ ముచ్చట్లను మగవాళ్ళెన్నటికీ పూర్తిగా అర్థం చేసుకోలేరు. నూటికీ, కోటికీ, గాని ఇల్లు దాటిపోని సీతమ్మలూ, సుబ్బమ్మలూ, మాచమ్మలూ, కూచమ్మలూ రోజూ అంతంతసేపు ఏం మాట్లాడుకుంటారు? ఎంతో ఆప్యాయతగల స్నేహితాలన్నా ఉంటే పోనీ అనుకోవచ్చు. కాని ఈ ఆడవాళ్ళలో అవీ కనిపించవు. వాళ్ళు పెద్దస్నేహాలు చెయ్యకుండానే రోజూ ఒకరికొకరు అంతులేని విషయాలు చెప్పుకుంటారు.

ఏమిటీ విషయాలు? ఇవి తమకూ, తమ వారికీ సంబంధించినవి కావచ్చు. ఇతరులకు సంబంధించినవి కావచ్చు. ఈ ఆడవాళ్ళు ఇళ్ళు దాటకపోయినా పైవాళ్ళు ఇంటికి వస్తారు. వాళ్ళు ఏవేవో వార్తలు తెస్తారు. ఎప్పుడైనా ఒక ఉత్తరం ఎక్కడినుంచైనా రావచ్చు. వీటిని గురించి ఎన్నాళ్ళయినా మాట్లాడుకోవచ్చు. కాలక్షేపానికి నిత్యమూ కొత్త విషయాలుండాలని కూడా లేదు.

చెప్పుతున్న విషయాలే మళ్ళీమళ్ళీ చెప్పుకోవచ్చు.

ఈ చెప్పుకోవటం ఆడవాళ్ళ జీవితాలకూ, వ్యక్తిత్వాలకూ ఎంతో ముఖ్యం. ఇది వాళ్ళ చదువు, వాళ్ళ సాహిత్యం, వాళ్ళ తత్వజ్ఞానం, వాళ్ళ తపస్సు. నాలుగు రోజులపాటు ఆడవాళ్ళను కలవకుండా చేస్తే, తాము ఎటువంటి బానిసత్వంలో ఉన్నదీ, కూపస్థ మండూకాల్లాగా ఎట్లా జీవిస్తున్నదీ వాళ్ళకు తెలిసివస్తుంది.

* * *

పక్కభాగంలో ఉండే సుబ్బమ్మ ఇవాళ ఇంటో లేదు. ఎవరో బంధువులింటో పిల్లవాడికి అక్షరాభ్యాసమైతే వాళ్ళంతా భోజనానికి వెళ్ళారు.

"సుబ్బమ్మగారూ, లక్ష్మి వాళ్ళంతా ఎక్కడికమ్మా పోతున్నారూ?'' అని పొద్దున సుందరం తల్లిని అడిగాడు.

''వాళ్ళ బంధువు లబ్బాయి, నీవంటి వాడే ఉన్నాట్ట. వాణ్ణి బళ్ళో వేస్తున్నారట. అందుకని భోజనానికి పోతున్నారు,'' అన్నది సీతమ్మ.

సుందరం ఉత్సాహంతో, "అమ్మా, నా అక్షరాభ్యాసానికికూడా అందరూ భోజనానికొస్తారా?" అన్నాడు.

''ఎందుకు రార్రా? మనవాళ్ళంతా వస్తారు," అన్నది తల్లి.

సుందరం కాసేపు ఆలోచించి, "అయితే, అమ్మా, నా అక్షరాభ్యాసం ఎప్పుడూ?" అన్నాడు.

ఈ ప్రశ్న వస్తుందని సీతమ్మకు తెలుసు. ఎందుకంటే ఆవిడ [illegible] మాసాలనుంచీ సుందరానికి చదువుమీద అంతులేని ఆసక్తి కలిగిస్తున్నది. తన ప్రయత్నం ఫలించి, సత్యం చదువంటే ఎప్పుడా, ఎప్పుడా అని తహతహలాడటం కూడా ఆవిడ చూస్తున్నది. అయినప్పటికీ ఏక్షణాన ఎవరు తన కొడుక్కు చదువంటే భయంకలిగేట్టూ, అసహ్యం పుట్టేట్టూ చేస్తారో అని ఆవిడ గుండెలు పీచుపీచుమంటూనే ఉన్నాయి.

ఎందుకంటే సీతమ్మ చూసినంతలో చాలామందికి, పిల్లల్ని చదువంటే బెదరగొట్టటం చాతయినంత బాగా వాళ్ళకి చదువుమీద ఇష్టం కలిగించటం చాతకాదు. పిల్లలుచేసే అల్లరితో వేగలేక అనేకమంది తల్లులు, ''వెధవా, బళ్ళోవేస్తేగాని నీ పొగరణగదు,'' అని పిల్లల్ని భయపెట్టటం ఆవిడ ఎరుగును. ఎంతోదూరం పోనవసరంలేదు. సీతమ్మ ఆడబడుచు కొడుకు బళ్ళోకి పోవటానికి కానీ, అర్ధణా లంచాలిస్తుంది.

చదువు గురించి ఎవరుగాని ఆగౌరవంగా మాట్లాడినా, పిల్లలకి చదువుమీద భయమో, అనుమానమో, అలక్ష్యమో కలిగించినా సీతమ్మ భరించలేకపోయేది. ఆవిడకి చాలా చిన్నతనంలోనే చదువుమీద ఎక్కడలేని అభిమానమూ కలిగించారు. ఆవిడకు తల్లిదండ్రులు చదువు చెప్పించలేదు. అన్నలు చదువుకునే పుస్తకాల సహాయంతో తానే చదవటమూ, రాయటమూ నేర్చు

కున్నది. ఆవిడ బంధువులందరూ ఆవిడ నీవిషయంలో చాలా మెచ్చుకునేవారు.

సీతమ్మ కాపరానికి వచ్చిన కాలంలో అత్తవారింట విశేషం పుస్తకాలుండేవి కావు. ఆవిడ మామగారి తాలూకు భాగవతం ఉండేది. వీలుదొరికినప్పుడల్లా ఆవిడ ఆ భాగవతం తీసి చదువుతూ ఉండేది. అందులో అనేక మాటలకు అర్థాలు తెలియకపోయినా ఆవిడ నిరుత్సాహపడకుండా చదివేది. పుస్తకాలు చదవటంలో సీతమ్మకున్న ఆసక్తిని అత్తవారివేపు వారు శ్లాఘించకపోగా ఎద్దేవకూడా చేసేవారు! కాని ఆ భాగవతంలోనే ప్రహ్లాద చరిత్రలో ఉన్న "చదువని వాడజ్ఞుండగు." అనే పద్యం సీతమ్మకు ఎంతో బలం చేకూరుస్తూ ఉండేది. ఒక్క సద్గుణమైనా లేని హిరణ్యకశిపుడికి చదువుమీద అంత గురి ఉన్నందుకు ఆవిడ ఆశ్చర్యపడేది.

*   *   *

"ఒక్క రోజు సుబ్బమ్మ లేకపోతే బొత్తిగా సందడేలేదు." అనుకున్నది సీతమ్మ. కాస్సేపు కన్ను మూద్దామని ప్రయత్నించింది. కాని, పగటి నిద్ర, అలవాటు లేని కారణంచేత, ఫట్టలేదు. ఏంపని కల్పించుకుందామా అని ఆవిడ ఆలోచిస్తుండగా దొడ్లో కాలయాపన చేస్తున్న సుందరం పరిగెత్తుకుంటూ వచ్చి, "అమ్మా! అమ్మా! ఇంకో కొబ్బరిమట్ట పడింది. ఈనెలు తీద్దామా?" అన్నాడు.

సుందరం, తల్లి కూరిమి పిల్లవాడు. సీతమ్మ కొడుకును ఎక్కువ గారాబం చెయ్యకుండానే, వాడి అవసరాలను గురించి అందరికన్న ఎక్కువ శ్రద్ధ కనబరచి వాడి అభిమానం సంపాదించింది. తల్లుల్ని ఆరాధించే ఇతర పిల్లలల్లేనే సుందరంకూడా తన తల్లి ఏం చేసినా అందంగా ఉన్నట్టూహించుకునేవాడు. ఆవిడ ఏపని చేసినా వాడికి చూడబుద్ధి అయేది. ముఖ్యంగా తాపీగా కూర్చుని చేసేపనులంటే వాడికి మరీ ఇష్టం. ఆవిడ కూరలు తరుగుతున్నా, లాంతర్లు తుడిచి నూనె పోస్తున్నా, దీపాలు వెలిగిస్తున్నా, పొయ్యిదగ్గిర కూర్చుని వంటచేస్తున్నా ఏదో గొప్ప దృశ్యం చూసినట్టు చూసేవాడు సుందరం. ఆ పనులన్నీ వాడికి కూడా చెయ్యాలని ఉండేది. అటువంటి పనులలో తానుకూడా భాగం పంచుకోగలిగితే వాడి కంతకన్న ఏమీ అక్కర్లేదు. వాళ్ళమ్మ పుస్తకం చదువుతుంటే చూసి ఆనందించటంవల్లనే వాడికి చదువంటే ఇష్టం ఏర్పడి ఉండవచ్చు.

సుందరం తల్లికి సహాయపడగల పను లెన్ని ఉంటై కనకా? కూరలు అందించటమూ, పొయ్యి విసిరి పెట్టటమూ—అదయినా బొగ్గుల పొయ్యి అయితేనే! కొబ్బరి ఈనెలు తీయటం అటువంటి పనుల్లో ఒకటి. ఇది అన్నప్పుడల్లా పడే పనికాదు. మూడు నాలుగు నెలల కొకసారిగాని ఈ అవకాశం

రాదు. అందులో ఇవాళ తన తల్లి ఖాళీగా ఉంది కూడానూ.

"ఏమమ్మా, కొబ్బరీనెలు తియ్యోద్దూ?" అన్నాడు సుందరం, తల్లిని తొందరచేస్తూ.

సగం సుందరం ముచ్చట తీర్చటానికని సీతమ్మ ఒప్పుకుంది. సుందరం కొబ్బరిమట్టలు ఈడ్చుకురావటానికి పరిగెత్తాడు.

తల్లీ కొడుకూ కలిసి కొబ్బరీనెలు తీస్తుండగా, పెళపెళలాడే పట్టుచీరెతో, మొహాన ఇంత పెద్ద కుంకం బొట్టు పెట్టుకుని, మెడనిండా గంధం రాచుకుని, భుక్తాయాసం ఇంకా తీరనిదానల్లె సుబ్బమ్మ చంటివాణ్ణి చంకనేసుకుని లక్ష్మిని రెక్కపట్టుకుని వచ్చి అరుగు మీద చతికిల పడింది.


"ఇదేనుటమ్మా రావటం?" అన్నది సీతమ్మ.

"అవునమ్మా. ఇంకా తలుపుకూడా తెరవలా....చాలా హైరానయింది బాబూ." అన్నది సుబ్బమ్మ.

"రెండు మట్టలు. ఈసారి పెద్ద చీపురవుతుంది." అన్నది సీతమ్మ, తాము తీస్తున్న కొబ్బరీనెలను గురించి మాట్లాడుతూ.

"మాతల్లి, రెండు కట్టలు తీసి నా కొకటిద్దూ." అన్నది సుబ్బమ్మ.

ఆవిడకు చూసిందల్లా అడిగేస్వభావం ఉన్నది సీతమ్మ సంభాషణమారుస్తూ, "అయితే పిల్లాణ్ణి బళ్లోవేశారా?" అన్నది.



"ఆహా, వేశారు—ఎట్లాయితేనేం! యజ్ఞం చేసినంత పనయింది!.... పోనిస్తూ. ఎందుకొచ్చిన చదువులూ! నే చెప్పా—ఏదో ముక్కు తీర్చేశారు, సరిపోయింది, ఇంకో ఏడాదిపాటు, పాపం, వాణ్ణి బడికి పంపకండర్రా, అని," అన్నది సుబ్బమ్మ.

"ఏం? పాపం, బాగా ఏడిచాడా?" అని అడిగింది సీతమ్మ.

"ఏడుపా?" అన్నది సుబ్బమ్మ అత్యాశ్చర్యంతో. "ఏడుపేమిటి? ఏడుపుతో పిల్లాడు మెలికలు తిరిగిపోయి ప్రాణం కడబట్టేనూ!"

సీతమ్మ తన కొడుకువంక చూసి సంభాషణ మార్చటం మేలనుకున్నది. సుందరం కొబ్బరాకు చేత్తో పట్టుకుని సుబ్బమ్మకేసి నోరు తెరుచుకు చూస్తున్నాడు. కాని వాడి మనస్సులో సుబ్బమ్మ మాటలకు భయం కలగలేదు. ఆశ్చర్యం కలుగుతున్నది, బడికిపోయి చదువుకోవటానికి ఎవరన్నా ఏడుస్తారా, ఏడిచే వాళ్లని ఎక్కడన్నా పెద్దవాళ్లు పాపం

తుంస్తారా అని సుందరం ఆశ్చర్య పడుతున్నాడు.

కాని సీతమ్మ కది తెలీదు. "సరే కాని, ఒరే సుందరం, ఒసే లక్ష్మీ, మీ రిద్దరూ వెళ్ళి ఆడుకోండి'' అన్నదావిడ.

సుబ్బమ్మ అదొక రకం మనిషి. అనేక విషయాల్లో ఆవిడ అమాయకు రాలు. సీతమ్మ తన కొడుకును ఎందుకు ఆడుకోవటానికి పంపిందీ ఆవిడ గ్రహించలేదు. ఆసలాసంగితే ప్రత్యే కంగా గమనించలేదు. ఆనాడు అక్షరా భ్యాసం జరిగిన కుర్రవాడు ఎట్లా ఏడి చాడో, పదిమందీ కలిసి వాణ్ణి ఎట్లా పట్టుకోలేక పోయినారో, వాడు వాళ్ళ ముసలమ్మను ఎట్లా వాటేసుకున్నాడో, పిల్లవాణ్ణి తల్లి కాస్త సమదాయించ టానికి ప్రయత్నం చేస్తుంటే తండ్రి ఆవిణ్ణి ఎట్లా తిట్టిపోశాడో సుబ్బమ్మ చాలాసేపు వర్ణించి చెప్పింది. ఆ చెప్పటంలోనే, పిల్లల్ని చదవెయ్యట మంటే తన కెంత అయిష్టమో కూడా బయటపెట్టింది. పాపం, సుబ్బమ్మకు ఎవరు ఏమాత్రం బాధపడటమూ ఇష్టం లేదు. బాధకలిగించే పనులు ఎవరూ చెయ్యకుండా ఉంటే జీవితం చాలా ఆనందంగా ఉంటుందని ఆవిడ ఉద్దేశం. ఏటువంటి బాధ అకారణమైనది, ఎటు వంటి బాధ తప్పనిసరి అయినది అన్న విషయం ఆవిడకే అభిప్రాయాలూ లేవు. పిల్లలు బళ్ళోకి వెళ్ళటానికి ఏడుస్తారు కనుక అక్షరాభ్యాసం చెయ్యరాదు. శోభ నపు పెళ్ళికూతుళ్లు గర్భాధానపు గదిలోకి పోవటానికి బెదురుతారు కనుక గర్భా ధానాలు చెయ్యరాదు. ఆడవాళ్ళు పిల్లల్ని కనటానికి హింసపడతారు కనక పిల్లల్ని కనరాదు. ఆవిడ తాత్వికదృష్టి అంత సంకుచితమైనది. ప్రపంచం తనదృష్టి ప్రకారం నడిస్తే ఆవిడకు ఒక్కనాటికి సంతృప్తి కలగదు. కాని ఆవిడకు కావలిసింది ప్రపంచాన్ని తన అభిప్రా యాలకు అనుగుణంగా మార్చటం కాదు—ఉన్న ప్రపంచాన్ని తప్పు పట్టటం మాత్రమే.

## రెండవ ప్రకరణం

సుందరానికి అయిదో ఏడు వెళ్ళు తుందనగా పుట్టు వెంట్రుకలుతీసి అక్షరాభ్యాసం చెయ్యటానికి మంచి రోజు నిర్ణయించారు. దీనికి చాలామంది బంధువులు వచ్చారు. వీరిలో ఎక్కువ మంది పల్లెటూళ్ళకు చెందినవాళ్లు. ఆ రోజుల్లో బస్సులులేవు కనుక వీళ్ళు ఎడ్లబళ్ళమీదా, కాలినడకనా వచ్చారు. సుందరం వారిని చాలామందిని ఎరగడు. సుందరం తండ్రి శ్రీమన్నారాయణ అన్నప్పడల్లా ఇల్లు కదిలేరకంకాదు. సుందరం బారసాల తరవాత శ్రీమన్నా రాయణ ఇంట అక్కర జరిగి నలుగుర్ని పిలవడం మళ్ళీ ఇప్పుడే.

సుందరం వాళ్ళ నెరక్కపోయినా బంధువులు సుందరాన్నెరుగుదురు కనక అక్షరాభ్యాసం విషయమై వాణ్ణి ఏడిపించ టానికి ప్రయత్నం చేశారు.

"ఏంరోయ్, రేపణ్ణుంచీ ముక్కుకు తాడు పోస్తారా?" అని ఒకాయన అన్నాడు.

"ఇన్నాళ్లూ, పాపం, అడిగేవాళ్లు లేకుండా హాయిగా తిరిగాడు," అన్న దొకావిడ.

"చదువు సరిగా చదువుకోకపోతివా పంతులు చిరతవేస్తాడు జాగర్త," అని మరెవరో అన్నారు.

వాళ్ళీ ధోరణిలో మాట్లాడటం సీతమ్మకెంత బాధకలిగించిందో సుంద రానికి అంత అసహ్యం కలిగించింది. వాళ్ళంతా తనను అపార్థం చేసుకుంటు న్నారనీ, తాను ఎటువంటి వాడయిందీ ముందు ముందు తెలుసుకుంటారనీ సుందరం అనుకున్నాడు.

సీతమ్మ ఇటువంటి సంభాషణ అయినా సహించగలిగింది గాని మరో రకం సంభాషణ బొత్తిగా సహించలేక పోయింది.

"అయ్యో, అదేమిటర్రా? ఇంత పసి వెధవను ఇప్పుడే బళ్ళోవేస్తారుటర్రా? ఇంకా రెండేళ్ళు పోనీరాదూ?"

వాళ్ళంతా అతిథులు, కాబట్టే సరి పోయింది గాని, సీతమ్మకు వాళ్ళను నాలుగూ పెట్టబుద్ధయింది. అప్పటికీ ఆవిడ సమయోచితంగా, "వాడికి చదువుకోవటమంటే ఇష్టమే," అనీ, "ఇప్పుడు బడికి పోకపోతే ఇంకో రెండేళ్ళకు అసలు వెళ్ళడేమో," అనీ సమాధానాలు చెబుతూవచ్చింది. నిజానికి, సుందరం చదువుకుంటాడా, లేదా, వాడికి చదువు వస్తుందా, రాదా అన్న విషయా లను గురించి వచ్చిన చుట్టాలలో ఎవరికీ విచారంలేదు. ఎవళ్ళ సంస్కారాన్ని బట్టి వారు అనవలసిన మాట లని అంతటితో ఊరుకున్నారు.

* * *

సుందరానికి శాస్త్రోక్తంగా పుట్టు వెంట్రుకలు తీసి అక్షరాభ్యాసం చేయించారు. రాఘవయ్య పంతులువచ్చి సుందరం వేలు పట్టుకుని బియ్యంలో "ఓ న మః శి వా య్యః" అని రాయిం చాడు. "ఓ నా మహా, శీ వా యహా" అని నోటితో అనిపించాడు.

వచ్చిన బంధువుల్లో ఒక విమర్శ కాగ్రేసరు డున్నాడు—ప్రతి బంధువర్గం లోనూ అటువంటివాడుంటూ ఉంటాడు. నలుగురూచేరిన చోటనల్లా, తానెంత తెలివిగలవాడో, ఎవరికీ తెలీని విష యాలు తనకెంత బాగాతెలుసునో, ప్రద ర్శించటమే ఆయన పని.

"మన చదువు లిందుకే ఇట్లా తగ లడుతున్నయ్," అన్నాడాయన, ఒక వంక అక్షరాభ్యాసం జరుగుతుండగా.

పక్కనున్నవాళ్లు ప్రశ్నార్థకంగా చూశారు....



"అడుగులోనే హంసపాదు. ఓ నా మహా ఏమిటి? శివా యహా ఏమిటి? అసలు మాట ఓం నమశ్శివాయః."

తాను కనిపెట్టిన ఈ పరమ సత్యానికి అందరూ ఆశ్చర్యచకితులైనారో లేదో తెలుసుకోవటానికని ఆయన చుట్టూ కలయజూశాడు.

"అట్లా అనటానికి వీల్లేదులే," అన్నాడింకొక పెద్దమనిషి. "ఓం నమశ్శివాయ అయితే ఎవడిక్కావాలి? ఓం నమోనారాయణాయ అయితే ఎవడిక్కావాలి? ఓ నా మహా శివాయహా అనకపోతే అది అక్షరాభ్యాసమే కాదు."

దీనికి చాలామంది ఒప్పుకున్నారు.

శ్రీమన్నారాయణ రాఘవయ్య పంతులుకు ధోవతులచాపూ, తాంబూలంలో దక్షిణా ఇచ్చాడు. రాఘవయ్య పంతుల బడిపిల్లలందరికీ పప్పు బెల్లాలు ముట్టినై.

చంకన పలకా చేతిలో బలపమూ పట్టుకుని సుందరం ఆడుకోవటానికి వెళ్లేవాడల్లే మిగిలిన పిల్లలవెంట బడికి బయలుదేరాడు.

వాడెందుకు వెక్కివెక్కి ఏడవటం లేదో చాలామందికి అర్థంకాలేదు. కొంత మంది వాణ్ణి మెచ్చుకున్నారు. మరి కొందరు, "పిల్లకాక్కేం తెలుసు ఉండేలు దెబ్బ?" అన్నారు. ఈ రోజు కోసం సుందరం ఎంత కాలంనుంచీ ఎదురుచూస్తున్నదీ ఎవరికీ తెలీదు.

*   *   *

పిల్లలంతా పప్పుబెల్లాలు తిని అట విడుపు ధోరణిలో ఉన్నారు. రాఘవయ్య పంతులు ఒక్కసారిగా ఉరిమినట్టు, "ఎవరి పాఠాలు వాళ్ళు చదువుకోండి," అనే సరికి పిల్లలు సద్దుమణిగారు.

పంతులు సుందరం కొత్త పలక మీద "అ ఆ" అనే రెండక్షరాలూ పెద్దవిగా వ్రాసి రెండు మూడు సార్లు సుందరం చెయ్యిపట్టుకుని దిద్దబెట్టి, అట్లాగే దిద్దుతూ ఉండమన్నాడు.

మిగిలిన పిల్లలను గదమాయించినట్టు పంతులు తనను గదమాయించక పోవటం చూసి పంతులుకు తనమీద ఇష్టమనుకున్నాడు సుందరం. పంతులు రాసిన అక్షరాలు వాడి కళ్ళకు చాలా అందంగా తోచినై. చదువుమీది అభిమానంకొద్దీ వాడు తనకు ఎంత స్వల్ప విషయాలు బాగా కనిపించినా వాటితో సంతృప్తి చెందటానికి సిద్ధంగా ఉన్నాడు.

బలపం పట్టుకోవటం సుందరానికి సరిగా చాతకాలేదు. అది పలకమీద

దాని ఇష్టం వచ్చినట్లు నడుస్తుంది గాని అక్షరంమీదిగా నడవదు. బలపం పట్టు కోవటంతోనూ, దాన్ని అక్షరంమీదిగా నడిపించటంతోనూ సుందరం వేళ్ళు చెప్ప శక్యం కాకుండా నొప్పి పెట్ట సాగినై. కాని సుందరం ఈ బాధను పాటించకుండా పళ్ళు బిగువున దిద్ద సాగాడు.

"ఒరే గుండూ!"

పంతులు తననేపిలిచాడని సుందరం చప్పున గ్రహించలేదు. గ్రహించిన తరవాత వాడికెంతో అభిమానం కలిగింది. తలఎత్తి పంతులుకేసి పిచ్చి చూపు చూశాడు—పంతులు తనను నలుగురిలోనూ ఎందుకవమానపరిచిందీ అర్థంకాక.

"నీకు నోరు లేదుట్రా? అక్షరం ఉద్దేటప్పుడు పైకి అనలేవూ?"

పంతులేమడుగుతున్నదీ ఇంకా సుందరానికి అర్థంకాలేదు. పంతులు చెయ్యి సుందరం ఎడమ చెవి మీదికి పోయింది. లేత చెవి చుర్రుమన్నది.

"ఇదేమిటి?" అన్నాడు పంతులు.


"అ'' అన్నాడు సుందరం. దుఃఖం పొంగివస్తూ.

"ఇది?"

"ఆ.''

"ఇంకేం, పైకి అనూ."

చెవికి విమోచనం కలిగిందిగాని బాధ పోలేదు. ఉద్దే అక్షరాన్ని పైకి ఉచ్చరిస్తూ సుందరం దిద్దసాగాడు. కాని ఇది



చాలా నిరర్థకమైన పనిగా కనిపించింది. ఇది చదువులో ఒకభాగంగా వాడికి తోచలేదు.

క్షణక్షణానికీ వేళ్ళతీపు హెచ్చిపోతున్నది. పంతులు రాసిన అక్షరం అంతకంతకూ లావెక్కి మెలికలు కలిసిపోతున్నై. దీనికి తగ్గట్టుగా అరిచేతులు చెమటపట్టి ప్రవాహాలు కడుతున్నై. సుందరం బలపాన్ని కిందపెట్టి అరిచెయ్యి లాగుకు తుడుచుకుని చూసుకున్నాడు. చూపుడువేలిమొనా, మధ్యవేలి మధ్యకణుపు పక్కభాగమూ, బొటవేలిమొనా ఎర్రగా కందినై.

"ఉద్దూ!''

ఈ పెడబొబ్బకు సుందరం హడిలిపోయినాడు. మళ్ళీ అక్షరాలు దిద్ద సాగాడు.

ఎంతసేపు దిద్దాడో తెలియదు. చెయ్యిఅక్షరం దిద్దుతూనేఉంది. నోరు అక్షరాలను ఉచ్చరిస్తూనే ఉంది. కాని సుందరం మనస్సు ఎక్కడో ఉంది. వాడికి వాళ్ళమ్మ జ్ఞాపకం వచ్చింది.

సుబ్బమ్మ కూతురు లక్ష్మి జ్ఞాపకం వచ్చింది. కింద చేడువాళ్ళబంధువులింట్లో జరిగిన పెళ్ళిజ్ఞాపకం వచ్చింది. పందిళ్ళ వాసన జ్ఞాపకం వచ్చింది. ఆ పెళ్ళి అయిపోయినతరవాత కొన్నిమాసాలకు శ్రీమన్నారాయణ తమ వాకిలిముందు చిన్నతాటాకుల పందిలివేయించాడు. ఆ తాటాకుల వాసన తగలగానే తను "అమ్మా, మన పందిలి పెళ్ళివాసన", అన్నాడు తను. ఆ మాటకు తల్లి తనను ముద్దుపెట్టుకుంది.

రాఘవయ్యపంతులు బళ్ళో కూచుని అక్షరాలు దిద్దుకునే సుందరం మొహాన కొద్దిపాటి ఆనందరేఖ కనిపించింది.అది మరెవరికీ కాదు, రాఘవయ్యకే కనిపించింది. మరుక్షణం తపీమని సుందరం నెత్తిన మొట్టికాయపడింది.

"వెధవా, అక్షరాలన్నీ చెరిపేస్తావా?" అన్నాడు పంతులు. అప్పటిదాకా సుందరం చూసుకోనేలేదు. వాడి చేతి చెమటకు అక్షరాలు చాలా భాగం చెరిగిపోయినై.

రాఘవయ్యపంతులు పలక చెరిపి మళ్ళీ అక్షరాలురాసి దిద్దమన్నాడు.

* * *

రాఘవయ్యపంతులు బడి వీధిబడికాదు. ఆయన తన సొంత ఇంటి ఆవరణలోనే ఒకపక్కన పెంకులు కప్పిన వసారా ఒకటి వేయించి అందులో బడి పెట్టేవాడు. అందులో కాస్త మంచి తరగతికి చెందిన కుటుంబాల పిల్లలు చదువుకునేవాళ్లు. వీధిబడికి తమ పిల్లల్ని పంపటం నామోషీగా భావించేవాళ్ళు రాఘవయ్యకు ప్రోత్సాహం ఇచ్చేవాళ్లు. ఈ బడిమీద రాఘవయ్యకు నెలకు ఏ పది పన్నెండు రూపాయలో గిట్టేది.

రాఘవయ్య బాగా చెప్పగలవాడని ప్రతీతి ఉండేదిగాని నిజంగా ఆయన పిల్లలకు శ్రద్ధగా చదువుచెప్పేవాడుకాడు. ఎక్కువకాలం పిల్లలతో గడిపేవాడు కాడు. పిల్లలదగ్గిర కూర్చున్నంతసేపూ వాళ్ళను హింసించేవాడు. ఆయన బాగా పిల్లలను శిక్షిస్తాడనేమాటను పిల్లల తలిదండ్రులు మంచిశిక్షణ ఇస్తాడని అర్థంచేసుకునేవారు.

సుందరం "అ ఆ"లు దిద్దుతూండగా రాఘవయ్య వెళ్ళిపోయినాడు. ఆయన మొదట ఇంట్లోకివెళ్ళి, తరవాత బయటికి వెళ్ళాడు. ఆయన బయటికి వెళ్ళగానే ఒక కుర్రాడు, పొడుగాటిపళ్ళవాడు వచ్చి సుందరం పక్కన కూచుని, "ఏం రా, గుండూ! సరిగా దిద్దు," అన్నాడు.

సుందరం తప్ప అందరూ చదువు మానేసి కబుర్లలో పడ్డారు. సుందరం కూడా చేతికి కాస్తవిశ్రాంతి ఇచ్చాడు. వాడికి ఈ కుర్రాణ్ణి చూస్తే ఎందుకో పంతుల్ని చూసినదానికన్న ఎక్కువ భయంవేసింది. అందుకని వాడు మళ్ళీ బలపం పట్టుకుని దిద్దసాగాడు.

కాని సుందరం మనస్సులో ఏదో ఆవేదన బయలుదేరింది. చదువుకోవటమంటే వాడూహించినదానికీ దీనికీ ఏమీ

సంబంధం లేదు. తన జన్మంతా ఈ "అ ఆ" దిద్దటంతోనే సరిపోయేట్టు కని పించింది.

పంతులు తిరిగి వచ్చేసరికి ఎవరి పాఠాలు వాళ్ళు మళ్ళీ చదవసాగారు. ఒక్క కుర్రవాడు మాత్రం గోడకాను కుని తల రొమ్ముమీదికి వాల్చుకుని నిద్రపోతున్నాడు. పంతులు లోపలికి వస్తూనే చూరులోనుంచి పేంబెత్తం తీసి వాణ్ణి కసిగా నెత్తినా, భుజాలమీదా కాళ్ళమీదా దబదబా కొట్టాడు. వాడు మొదటి దెబ్బకే "చచ్చానో" అని కేకపెట్టాడు. దెబ్బదెబ్బకూ ఆకుర్రాడు, "అమ్మో! బాబో! నాయనోయ్! అయ్యో!" అని కేకలు పెడుతుంటే సుందరం గుండెలు అవిసిపోయినై.

రాఘవయ్యను చూస్తే ఆక్షణాన సుందరానికి భయంతోబాటు, భయాన్ని మించిన కోపంకూడా వచ్చింది. తన మనస్సులో సుందరం ఆ రాఘవయ్యను పెద్ద కట్టెపెట్టి ఒళ్ళంతా పచ్చడిపచ్చడి అయేటట్టు కొట్టాడు.

సుందరాని కిప్పుడు వేళ్ళతీపుకూడా అంత బాధించటంలేదు, ఎప్పుడు బడి అయిపోతుందా ఎప్పుడు ఇంటికి పోదామా అనే చింత వాణ్ణి తీవ్రంగా బాధించసాగింది.

చివరకు రాఘవయ్యపంతులు బడి విడిచే సమయానికి సుందరానికి పెద్దచెర వదలినట్టయింది.

సుందరాన్ని ఇంటిదగ్గిర దిగవిడవ మని పంతులు ఇద్దరు పిల్లల్ని వెంట పంపాడు. వాళ్ళలో ఒకడు పేంబెత్తం దెబ్బలు తిన్నవాడు.

దారిలో ముగ్గురూ ఏవో మాట్లాడు కుంటూ వచ్చారు.

"సరే కాని, పంతులు కొడితే నీకు బాగా నెప్పెత్తిందా?" అని సుందరం దెబ్బలు తిన్న కుర్రాణ్ణి అడిగాడు.

"నాకేం నెప్పిలేదు," అన్నాడు కుర్రాడు.

సుందరాని కామాట బడాయిగా కని పించింది.

"అంతగట్టిగా ఏడిచావే?" అన్నాడు సుందరం.


"దెబ్బల నెప్పికన్నా ఎక్కువ ఏడిస్తే నెప్పి ఉండదు. నీకు తెలీదా?" అన్నాడు ఆ కుర్రాడు.

ఇది సుందరానికి వింతగా తోచింది. వాడు దెబ్బల అనుభవం ఉన్నవాడు కాడు.

"మా నాన్నకూడా నన్ను చచ్చేట్టు కొడతాడు. గొంతుచించు కేడుస్తాను. ఏమీ నెప్పిఉండదు." అన్నాడా కుర్రాడు, సుందరాన్ని నమ్మించేటట్టు చెబుతూ.

(సశేషం)





# ఋణశేషం

సూర్యుడు పడమటింట్లో అడుగు పెట్టిగానే, నల్దిశల తలుపులూ ఓరఓరగా తెఱచుకుంటూ ఉంది సంజె చీకటి.

ఇళ్ళకు మళ్ళిన పిల్లలు వీథిలో ఒకరి వెంట ఒకరు పరుగెత్తుతూ, ఒకరిపై ఒకర్ధు పడి కొట్టుకుంటూ, ఠక్కున ఆగి ఒక్కుమ్మడిగా సందు చివర నిలబడ్డ ఓ ముసలి చుట్టూ కమ్మి, నానాగోల చేస్తున్నారు.

ముసలి, పసిపాపలకేసి ఖరుపైన కనుఱెప్పలెత్తి, నవ్వాడు. ఎండి పిడుచుకుపోయిన పెదవులపై దరహాసం పిల్లల ఉద్రిక్త నేత్రాలకు కన్పించలేదు. ఎవడిచేతిలోంచో చిన్నరాతి ముక్కొకటి దూసుకుపోయింది. బీటలు వారుతున్నట్టున్న చర్మం చిట్లి, క్షీణిస్తున్న రక్తం చిందింది. శుష్క నేత్రాలు చెమ్మగిలినయ్. చుట్టూ రేగుతున్న గాలి దుమారంలో దృష్టి నష్టమవుతున్న కళ్ళకు పిల్లలు స్పష్టంగా కన్పించలేదు.

అటూ ఇటూ పోవాలని పాదాలు ప్రయత్నించినయ్.

కాని చక్రాకారంగా చుట్టు ముట్టిన పిల్లలు సందివ్వలేదు. "తాతా....పీతా" అని పదం పాడుతున్నాడొక కుర్రాడు.

బజారులో వెళ్తున్న నలుగురు పెద్దలూ ఈ దృశ్యం చూసి ఆనందిస్తున్నారు. అందులో ఒకాయన పిల్లల నుత్సాహపరుస్తున్నాడు.

ముసలి తొట్రుపడుతూ, 'గుడికి వెళ్ళనీయరేమిటిరా!'' అని గొంతుక చించుకుంటున్నాడు.

ఖంగున మోగుతోంది గుడిగంట. ముసలి కంఠస్వరం తీవ్రమైంది.

వీపున తగిలిన గాయానికి వళ్ళంతా మండుతున్నట్టుంది. పిల్లలు విసిరిన దుమ్ము వీపున, ముఖాన పడ్డవి. పిల్లల గోల తగ్గలేదు.

---

వి. సహజానందం

---

ఖంగు ఖంగున మోగుతోంది గుడి గంట.

హఠాత్తుగా పిల్లలు ఎక్కడి వాళ్ళక్కడ క్షణమాత్రం నిశ్చేష్టులై, మెల్లగా నాలుగడుగులు వెనక్కువేసి, వెంటనే దౌడుతీశారు.

పదం పాడుతున్న కుర్రవాడు తికమక చెంది, పిల్లల్లో కలిసి పారిపోయాడు.

నిలబడ్డ నలుగురు పెద్దమనుష్యులూ పరుగెత్తుతున్న పిల్లలను చివాట్లుపెట్టారు.

"ఏమిట్రా మునలాయన్ని ఏడిపిస్తున్నారు? వెధవల్లారా!"

మౌనంగా నిలబడ్డ కామేశ్వరి మెల్లగా అన్నది...."పాపం....వాళ్ళని ప్పుడు తిట్టకండి."

ఆ నలుగురూ మళ్ళీ మాట్లాడక ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు.

"ఎవరే కామీ. నువ్వెందుకువచ్చావు తల్లీ" అన్నాడు మునలి, సంతోషంతో కంపిస్తూ. కామేశ్వరి వృద్ధుని చెయ్యి పట్టుకొని దేవాలయంవైపు సాగిపోయింది.

"నా దారిన నే పోతానమ్మా...నువ్వు వెళ్లు."

"గుడిలో దిగబెట్టి వెళ్తాను" అంది కామేశ్వరి.

'వాడు వింటే...." అని మునలి, ఆమెవెనుక అడుగులు వేశాడు.

వీరిద్దరినిచూసి వీథిపక్క ఇళ్ళలో వారు గుసగుసలాడుకుంటున్నారు. ఆ ఇంటిమీద కాకి ఈ ఇంటిమీద వాలనప్పుడు, ఇంటికైన కామేశ్వరి అత్తింటి శత్రువుకు గుడిదారి చూపించటం వింతగా ఉంది.

బజారులో సామాన్యంగా అడుగుపెట్టి ఎరగని కామేశ్వరి ఇవ్వాళ పిల్లల అల్లరి మధ్య హఠాత్తుగా మునలివానిపక్కన నిలబడేప్పటికి, అల్లరిచేస్తున్న పిల్లలు ఏదో తాచుపామును చూసినట్టు నేల కతుక్కుపోయారు. ఏమీ మాట్లాడక పోయినా, ఆ మౌనముఖం ముందు, ఆ తీక్షణ నేత్రాల ఎదుట వాళ్లు నిలబడలేక పోయారు.

వృద్ధుడన్నాడు — "అమ్మాయీ, నువ్విలా వచ్చావని తెలిస్తే అల్లుడు...."

"అవంతా మనస్సులో పెట్టుకోకు నాన్నా! చిన్నతనంలో వెంటబెట్టుకొని దేవాలయానికి తీసుకు వెళ్ళేవాడివి. మళ్ళీ ఇన్నాళ్ళకు, ఇన్నేళ్ళకు నీతో కలసి దేవుడి దగ్గరకు వస్తుంటె....ఇవన్నీ అడక్కు." అంది కామేశ్వరి.

దుఃఖంతో చెమ్మగిలిన ఈ మాటలు విని మునలి హృదయం కళవళపడ్డది. కలలోకూడా అనుకోలేదు. తానిలా కూతురిని చూడగలుగుతానని.

"అమ్మాయీ, ఇంటికి పోదామా?" అన్నాడు.

స్పష్టాస్పష్టంగా వినబడ్డ తండ్రి మాటలు విని, "దేవుడింటికి వెళ్తున్నాం.

అక్కడకు ఏ అదుపాజ్ఞలూ అడ్డురావు.... పద" అంది కామేశ్వరి.

ముసలి మళ్ళీ తన కోరిక ప్రస్తావించ లేదు. ఇంకా రెండు బజార్లు దాటాలి - గుడికి. కాని స్మృతిసీమలో, మనోవీథిలో బజార్లన్నీ దాటుకొని తన తొలిరోజులు గుర్తుకురాగానే ముసలి ముందడుగు వేయలేకపోయాడు.

"కామీ....రామూకూడా పిల్లలతో కలసి నామీద గడ్డలు విసురుతున్నాడు. పిచ్చగా ఏదో పాడతాడు. పసికుంక.... పదిమందీ ఏమిచేస్తే వాడూ అదే చేస్తాడు. 'నాన్నా....రారా' అంటె, 'పోవయ్యా.... పిచ్చితాతా' అని పరుగెత్తుకుపోతాడు" అన్నాడు ముసలి.

కొడుకు అల్లరి కామేశ్వరికి తెలుసు. భర్త కొడుకుతో తండ్రిగురించి చేసే అవహేళన అమెకు తెలుసు. తనతండ్రి పిచ్చివాడని, ఆస్తిపాస్తులు పోయిన దరిద్రుడని భర్త చెప్తూతూవుంటాడు. పరాయివాళ్లతో కలిసి తిట్టుతూఉంటాడు.

రోజుల తరబడి ముసలి తండ్రికి ఊర్లో జరుగుతున్న అవమానం కామేశ్వరి లోలోనే సహించి ఊరుకుంటోంది.

కాని ఇవ్వాళ తమ ఇంటివెనకనే ఊర్లో పిల్లలూ, తన కొడుకూ కలసి ముసలి తండ్రిమీద దుమ్మెత్తిపోస్తుంటె, కామేశ్వరి ఇంట్లోంచి చూస్తూ సహించ లేకపోయింది.

భర్త ఇంట్లోనేఉన్నా, అవమానంతో ఘోషిస్తున్న తండ్రిచెంతకు పరుగెత్తింది.

*　　*　　*

"ఏం నాన్న ఆకాశాని కెగిరాడా నిన్ను చూసి .... వీథిలో జనంమటుకు హడిలిపోయారు - ఈ దేవతను చూసి" అన్నాడు భర్త.

కామేశ్వరి, భర్త సరసానికి జవాబివ్వ లేదు. ఆమెముఖంలో దైన్యం ప్రతి బింబిస్తోంది.

వంగిన నడుమెత్తి, కాళ్ళబొటన వ్రేళ్ళపై నిలబడి తండ్రి మోగించినగంట ఇంకా ఆమె కళ్ళలో ఊగుతూ, హృద యంలో మధురంగా, విచారంగా ప్రతి ధ్వనిస్తోంది. తనుకూడా పక్కనఉందనే సంతోషంతో పరవశుడై, అందనిగంటను పదేపదే మోగించాడు. ఆఘంటానాదంలో గుండే గంటై హర్షంతో మోగింది.

పిచ్చితాతకదూ! తన్నుచూసి పక్క వాళ్ళు ఊరుకున్నారు కాని, లేకపోతే తండ్రిని పక్కవాళ్లు ఎలా ఏడిపించేవారో!

ఆ దేవాలయ దృశ్యం కామేశ్వరికి ఇంకా కళ్ళకు కట్టినట్టే ఉంది.

మళ్ళీ భర్త అందుకున్నాడు.

"ఏమిటా పిచ్చివాడి వెంటబడి గుడికి పోవటం? అనేకసార్లు చెప్పాను....వాడి మొహం చూడకూడదని. నాది పాముపగ"

ఈ విరసానికి కామేశ్వరి చలించలేదు. మాటమీదమాట....తీగతీస్తే డొంకంతా




డబల్ బెడ్!

కదులుతుందని ఆమెకు తెలుసు. మెల్లగా అంది—

"నేరం జరిగిపోయింది. ఇంక మీ ఇష్టం. ఆయన బాగా కృశించి, పుల్ల అయిపోయాడు. ఇంకెంతోకాలం జీవించదు. ఇంకా మన కంఠశోష ఎందుకు?" అని వంటింట్లోకి వెళ్ళింది కామేశ్వరి.

గోడమూలన నక్కాడు రాముడు, తల్లిని చూస్తూ.

"ఒరే! బాబూ! అలా నక్కుతావెందుకు? నేనేమీ అనను లే....రా! ఈ సారి ఒక కర్ర తీసుకొని నూటిగా తాతనెత్తిపై రెండువెయ్యి. ఆపని చేశావా అందరకీ హాయి" అంది కామేశ్వరి.

భర్త వెనకనుంచి వింటూనేఉన్నాడు. కాని ఇవ్వాళ భర్త కోపతాపాలకు ధీరువై పడిఉండలేదు కామేశ్వరి.

ఏళ్ళతరబడి కన్నీటితో. చల్లార్చుకుంటూ వస్తోంది - లోని దావానలాన్ని. కాని ఇవ్వాళ కళ్లలో అసహాయపు అశ్రువులబదులు రోషాగ్ని భగ్గున రగులుతోంది. ఇవ్వాళ భర్త ఎంత మూర్ఖంగా, తీవ్రంగా ప్రవర్తించినా, తాను నోరు మూసుకొని కూర్చోదలచుకోలేదు.

శంకరశాస్త్రికూడా భార్య ముఖంలోని మార్పు గ్రహించి, కొంచెం తగ్గాడు. మెల్లగా ఇంట్లోకివెళ్ళి, కుర్రవాడినిపిలిచి, "వెధవా? తాతయ్యమీద గడ్డలు విసురుతావా?" అని ఛెళ్లున చెంపమీద ఒకటి పెట్టాడు.

తండ్రిచేతిలో దెబ్బలుతినటంరాముకి కొత్తకాదు. కాని తాతవిషయంలో తనను తండ్రి దండించటం ఇదే మొదటిసారి. వాడు పెద్దగా ఏడ్పు ఆరంభించేసరికి,

కామేశ్వరి దొడ్లోంచివచ్చి, "పనివెధవ.... వాడికేం తెలుసు" అని వాడిని ఒళ్ళోకి తీసుకొని, నఘువాయించింది.

* * *

పూరికొంపకు తిరిగి వచ్చినప్పటినుంచీ ముసలికి దెబ్బబాధ హెచ్చింది.

పెద్దదైన అక్కగారు పెద్దపెట్టున ఏడుస్తూ, వీపుగాయం కడిగింది.

"వద్దురా అంటె వినవు .... ఇంట్లో కూర్చోరా అంటె, కాలు నిలువదు. వీధిలోకి పోవటం, వీపంతా నెత్తురుతో తిరిగి రావటం" అని గోలపెట్టుతోంది సీతమ్మ.

"కామిని చూశావేప్?"

"ఆ!"

"అవును."

"నీ కసలు బుద్ధి ఉంటేగా? మొహన అల్లుడు పేడనీళ్లు చల్లించినా, పిల్లలచేత రాళ్లు విసరించినా, ఆ అల్లుడి దివాణం లోకి వెళ్లకుండా ఉండవుగా? ఎలా ఉంది కామి మరి?" అని స్వరం తగ్గించి అడిగింది సీతమ్మ.

"కన్నతల్లి...సాక్షాత్తు ఏదో దేవత.... దాన్ని చూసి బజారులో ఎక్కడవాళ్ళు అక్కడ పారిపోయారు. నాతల్లి....నన్ను గుడికి తీసుకొవెళ్ళింది....ఎన్నేళ్లయిందే దానితో గుడికివెళ్లి."

జరిగిన కథ అంతా విండి సీతమ్మ.

"ఇంటికికూడా తీసుకొరాకపోయావా మరి?" అని అడిగింది.

"ఎందుకు అడగనూ? కాని దాని బతుకుమటుకు చూడవద్దూ మనం.... ఇప్పటికే నాకెలాగో ఉంది ఆ మూర్ఖుడు. తిట్టాడో....కొట్టా ..." అని దుఃఖంతో ఇంక మాట్లాడలేకపోయాడు ముసలి.

కూతురుతో గుడికి వెళ్ళి రావటం ముసలికి ఏదో పుణ్యతీర్థానికి వెళ్లివచ్చి నట్టుంది. రెండుబజార్లే కలసినడిచినా, యోజనాలకు యోజనాలు అలసట లేకుండా కలసి తిరిగి వచ్చినట్టుంది. కామేశ్వరితల్లి అదృష్టవంతురాలు .... స్వర్గం చేరుకుంది. తానే ఇలా చివికి, చితికి, కుంగి, కృశించి గ్రామస్థుల అవ మానాలకు, దెబ్బలకు, అల్లుని దురహం కారానికి ఆహుతి అవుతున్నాడు. ఇంక తనకూ పొద్దూకబోతోంది.

గుడినుంచి వెళ్లేప్పుడు కామితో చెప్పాడు. "ఇంకెన్నాళ్లో బతకను.... తల్లీ....రేపోమాపో యములవాళ్లువచ్చినా, విచారంలేదు. నిన్ను చూడకుండా కళ్లు మూస్తే, నిప్పు చల్లారాకనూడా లోపల దుఃఖాగ్ని ఇంకా మండుతూనే ఉండేది."

తనకూ వియ్యాలవారికీ మధ్యజరిగిన గాథలన్నీ గుర్తుకువచ్చినయ్. కొండపై గుడిని చేరాక, వెనక్కు తిరిగితే, ఎక్కి వచ్చిన మెట్లన్నీ కనబడ్డట్టు, ముసలి జీవితపు గతకాలంలోకి తొంగిచూడగా, ఆ ఎత్తైన రాతిమెట్లన్నీ కనబడి ఎక్కి వచ్చిన హైరాణితో గుండె స్పందించింది.



"ఎలావుందా వంట? నా మొహంమల్లేనేవుంది. గుడ్డకాలిన కంపుకొడుతూ!"

పాతపుస్తకం గాలివిసురుకు పేజీలకు పేజీలు ఎగిరినట్టు, అనుభవాలు దొంతర్లు దొంతర్లుగా మనోవీథిలో చెలరేగినయ్.

శిథిలమైన స్మృతిద్వారంవద్ద నిలబడి, నిరాశావ్యథితమై, భగ్నమైన జీవితాన్ని స్పష్టాస్పష్టంగా చూసుకొంటూ, ఆవేదనతో గుమ్మంలో కూలబడ్డాడు.

ఆకాశంలో పిండి ఆరబోసినట్టుంది వెన్నెల....కూలబడ్డప్పుడు ద్వారంతగిలి రేగిన వీపుగాయపు బాధకూడా అతన్నిప్పుడు ఎక్కువ బాధించలేదు.

యుద్ధం ముగిశాక, వళ్లంతా గాయాలు నెత్తురు చిమ్ముతున్నా, ఆ దుర్భరబాధను క్షణమాత్రం మరచి, మనుష్యుల రక్తమాంసాలతో, హాహాకారాలతో, విజయఘోషతో, చావుబతుకుల ఘోరసంఘర్షణతో మహోజ్వల చైతన్యంవచ్చి, సజీవప్రాణిలా సంతాపసంతోషాలతో స్పందిస్తున్నట్టుండే రణభూమికేసి చూసి సిపాయి విస్మితుడైనట్టు! తన కత్తిలోంచే అంతరక్తం వానకురిసింది! తన ఈటెపోటులకే శత్రువులు పీనుగుల కుప్పలయారు....ఈ మహాదారుణ [illegible]హసమంతా తన ఆయుధాలతోనూ, అహంకారంతోనూ, శౌర్యంతోనూ వ్రాశాడు. తాను చేసిన చర్య తాను చూస్తుంటె, ఆ గాయపడ్డ సైనికునికి కలిగిన భయసంభ్రమాలు ఈ ముసలిప్రాణికికూడా తన నూరేళ్లజీవిత రణభూమిని వెనక్కు తిరిగి చూస్తుంటె కలిగినయ్.

ఆ రోజుల్లో....బతికున్న రోజుల్లో ఎన్ని ఎకరాలు ?....ఎన్ని పురులు దొడ్లో ? ఎన్ని జతల ఎడ్లు ?

మండు వేసవిలో, వడగాడ్పులో ఇంటి చూరున ఎగసిన నిప్పు మంటలు! బూడిదె అయిన లోగిలి ! ఇద్దరు మగపిల్లలూ మశూచికంతో మరణించటం. ఈ ఒక్క కామీ కూతురూ కొడుకూను. తర్వాత తర్వాత....పొలం తర్వాత పొలం అమ్మకం....ఉరితాడులాంటి అప్పులు ! ఓటి పడవకు చింపి తెఱచాపలా, నిత్య దారిద్ర్యం.

భార్యవద్దంటూనే ఉన్నా పొలమూ, పుట్రా, సిరిసంపత్తూ చూసి కామికి సంబంధం నిశ్చయించాడు.

కాని అల్లుడింతటి మూర్ఖుడనీ, దురహంకారి అనీ, వియ్యాలవారి ఆస్తి పాస్తులపై తీరని మమకారమనీ తనకేం తెలుసు ?

తనకు జరిగిన సర్వనాశనంతోపాటు, ఈ కూతురి కాపురంకూడా ఇలా అయి పోయింది.

మనవడు రాము గుర్తుకువచ్చాడు. వాడు రూపంలోనూ, గుణంలోనూ తండ్రి పోలికే! కామి ఇంటికి వెళ్ళాక వాడిని నాలుగు ఉతకలేదు కద !

ముసలికి ఆందోళన కలిగింది, ఆ తుంకనెక్కడ కొట్టిందో అని.

బతుకంతా ఆకాశమై కళ్ళెదుట ఒక్కొక్కప్పుడు మబ్బులతో, మరొక్కప్పుడు నక్షత్రాలతో కన్పడుతున్న ట్టుంది ముసలికి.

*  *  *

పింజి అరబోసినట్టున్న వెన్నెల వెళ్లి పోయింది నల్లని ముసుగు కప్పి నట్టుంది అమావాస్య.

నిశిరాత్రి....

కుక్క పదేపదే అరుస్తుండటంతో లోపలనుంచి లేచివచ్చి, వీధితలుపు తీసింది కామి. మెట్లకింద ఎవరో తచ్చాడుతున్నారు. కుక్క వెంటాడుతోంది.

“నేనే....కామీ....”

“అత్తా....”

“అవునమ్మా....నేనే.”

సీతమ్మ కామితో ఇంట్లోకి వెళ్ళింది.


“నాన్న ఆరోగ్యం ఏమీ బాగా లేదమ్మా !”

“ఏం అత్తయ్యా ?”

“అవును....తల్లీ ...కిందటివారం పక్షవాతం వచ్చినప్పటినుంచీ, తమ్ముడి స్థితేమి బాగాలేదు. ఈ రాత్రి మతికూడా సరిగ్గాలేదు. నిన్ను పిలుచుకురమ్మని వేడిస్తున్నాడు.”

సావిట్లో సీతమ్మ నిలబడ్డది. లోపలకు వెళ్ళివచ్చింది కామి. ఇద్దరూ చీకట్లో సాగిపోయారు—లాంతరుతో.

చెక్క తలుపు తోసుకొని, కామి, సీతమ్మ లోపలకువచ్చి కుక్క మంచం వద్ద కూలబడ్డారు. ఆరిపోతున్న కంటి వెలుగులో కామిని తదేకంగా చూశాడు



"ఇదివరకు పనిసైకిళ్లు పోయినై. ఈమాటు ఎట్లా కాజేస్తారో చూస్తాను."

రోగి. "అమా....వాస్య... తల్లీ" అన్నాడు.

"పడుకో....నాన్నా....మాట్లాడటం హైరాణి" అని, తండ్రి తలను ఉండలు గట్టిన దిండుపై అన్చింది కామి.

"సీతా... కామిని పిల్చుకురా.... ఊ....ఊ" అని మూల్గాడు.

"ఇక్కడే ఉన్నా....నాన్నా... ఇదిగో చూడు....నన్ను...." అని కామి తండ్రి ముఖంలోకి చూసింది.

కాని ఉభయుల నేత్రాల మధ్య మబ్బులు అడ్డువస్తున్నయ్. ముసలి ఆ మబ్బుల్లోంచి కూతురుని చూడలేక పోతున్నాడు.

కొంచెం సేపయాక తెప్పరిల్లుకొని, "రాము....రాము.... భయపడతాడేమ్... వద్దులే" అని మూల్గాడు.

కామి పొంగివస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటోంది.

తాను వచ్చిందని భర్త పెద్దింట్లో ఉంటే... కన్నతండ్రి ఒంటినిట్టాడిపాకలో మరణయాతన పడుతున్నాడు. కోడుకూనం పెరిగి, ఒరిగిన మంచం....నులకతెగి కుక్కి అయింది....వాసన కొడుతున్న దుప్పటి...ఇప్పుడు తన్ను గుర్తుపట్టను కూడా లేకున్నాడు తండ్రి. ఎడమచెయ్యి, కాలు చచ్చుబడ్డయ్. ముఖం వికారంగా మారింది.

మృత్యుద్వారంవద్ద ఎంత వికారం! ఎంత సంక్షోభం! ఎంత దైన్యం!

కామికి దుఃఖం ఆగలేదు. తుపాను వలె మృత్యువు సుడిగాలులను రేపుకుంటూ వస్తుంటె, సముద్ర తరంగాలు

...లు అమె

య్.

ఒంటరిగా

వాళ్ళ అత్తయ్యా[illegible]ంది. శంకర శాస్త్రి లేచి, వీధిద్వారం వద్దకు వెళ్ళాడు. ఇంట్లో రాము ఒక్కడూ పడుకొని ఉన్నాడు.

తలుపుతీసి మెట్లమీద కాలు పెట్టగానే, మూలనందులోంచి, సన్నగా ఆడఏడుపు వినబడుతోంది. చీకట్లోంచి దూసుకు వస్తున్న ఆ ఏడుపుకతని కాళ్లు తడబడ్డయ్.

ఆ కొంపకు వెళ్ళి ఎన్నేళ్ళయింది? ఆ ఇంటికి ఈ ఇంటికి మధ్య రాకపోకలకు తలుపుమూసింది తానే!

తండ్రికూతుళ్ళను ఎడంచేశాడు. కాని తన నతిక్రమించి, మృత్యువు ఇవ్వాళ వారిద్దరిని దగ్గరకు తీసింది.

మెల్లగా చీకట్లో మెట్లుదిగాడు. గత మంతా ముళ్లతీగై కాళ్లకు చుట్టుకుంటో ఉంది.

నాలుగడుగులు వేశాడో లేదో, ఎదురైంది భార్య. ఒంటరిగా లాంతరుపుచ్చుకొని వస్తోంది. శంకరశాస్త్రి వెనక్కు తిరిగాడు.

"రానేమోనని బయలుదేరారా? నేననుకుంటూనేఉన్నా ··· వెంటనే వస్తారని" అంది కామేశ్వరి.

శంకరశాస్త్రికి మాటలు ఘాతకల్గించినయ్, కళ్ళుతెరచి సూర్యోదయాన్ని చూడబోవగా, వెర్రిగాలి వీచి, కిటికీ తలుపులు దఫేలుమని మూసినట్టు.

"మావయ్యను చూద్దామని బయలుదేరాను" అన్నాడు. ఇద్దరూ ఇంట్లోకి వెళ్ళారు.

"అమావాస్యలో చంద్రుడికోసం బయలుదేరారు. బాగుంది" అంది కామేశ్వరి.

"ఏమిటా పెడసరం మాటలు····ఏడుపు వినబడ్డది····ఎలా ఉంది?" అని ఆతురతగా, కంపితస్వరంతో అడిగాడు శంకరశాస్త్రి.

కామేశ్వరి కళ్లు అశ్రువులతో నిండేయ్. క్షణమాత్రం గొంతు పూడిపోయింది. వళ్ళంతా వణకుతోంది.

"ఇదిగోండి మీ ఋణశేషం... వెయ్యి రూపాయలు" అని కొంగుచాటునుంచి తీసి, ఓ చిన్న గుడ్డమూట భర్త చేతుల్లో పెట్టింది.

నిర్ఘాంతపోయి చూస్తున్న అతని చేతుల్లోంచి జారి ఆ మూట కిందపడి ఘల్లుమంది.

ఉలిక్కిపడి లేచాడు కుర్రాడు.

దూరాన్నుంచి ఏడుపు పెద్దగా వినబడుతోంది.






ప్రతి ఆదివారం వసుంధర ఏదో ఒక కొత్తకార్యక్రమం తలపెడుతుంది. ఈ గదిలో టేబుల్ ఆ గదిలో పెట్టడం, ఆ మూలనున్న ట్రంకుపెట్టెలు ఈ మూలకి మార్చడం, ఉత్తర దక్షిణాలుగావున్న పడకమంచాన్ని తూర్పు పడమరలుగా తిప్పడం, ముందు గదిలో వున్న పుస్తకాల బీరువా వెనక గదిలోకి ఫిరాయించడం—ఏదో ఒకటి। ఆదివారం ఉదయంవేళ వసుంధర ఎప్పుడూ స్తిమితంగా కూచోదు. ప్రతిసారీ జగన్నాధం మార్పుని మొదట్లో హితవుగా చూడక ఏవో కుంటికారణాలు చెబుతాడు. ఆఖరికి వసుంధర చెప్పింది అక్షరాలా ఆమోదించి, ఆరు రోజులూ గృహకృత్యాలు నిర్వహించిన ఎడ్యుకేటెడ్ గృహిణికి ఏడోరోజున తనకి చేతనైన సాయం తను చేస్తాడు.

జగన్నాధానికి రోజూ యింగ్లీషు వార్తలొచ్చేవేళకి (అనగా ఎనిమిది గంటలకి) నిద్దరలేవడం అలవాటు. ఆదివారాలుమాత్రం కాస్త బద్ధకించి తొమ్మిదిన్నరదాకా పక్కమీద దొర్లుతూ వుంటాడు. ఈ లోగా వసుంధర రెండు తడవలైనా మేలుకొలుపులు పాడుతుంది. పాలవాడూ పనిమనిషీ లేక పోతే తనూ పదిగంటలదాకా మహారాజులా పడుకునేదాన్నంటుంది.

మద్రాస్ వచ్చిన ఆరేళ్ళబట్టీ వసుంధరా జగన్నాధాల ఆదివారాలు బహు రమ్యంగా నడుస్తున్నాయి. ఉదయం పదకొండున్నరదాకా యిల్లు సద్దుకు, దుమ్ము దులుపుకోడం-ఈ తతంగంలో పనిమనిషికూడా సాయంగా ఉంటుంది అవసరమైతే. తరవాత జగన్నాధం విధిగా అభ్యంగన స్నానం చెయ్యాలి. మారాంచేస్తే వసుంధర వూరుకోదు. ఆరురోజులు ఆఫీసులో పనిచేసి వచ్చిన తర్వాత, ఏడోనాడు వంటికీ మాడుకీ దిట్టంగా నూనె పట్టించి తలనిండా వేన్నీళ్ళ స్నానంచెయ్యకపోతే కళ్ళుమంటలూ తలనొప్పి వస్తాయంటుంది వసుంధర. మొదటిరోజుల్లో జగన్నాధం కాస్త మొరాయించేవాడుగాని తరవాతరవాత ఆత్మసమర్పణ చేసుకున్నాడు. స్నానానంతరం పాయసంతో భోజనం.

---

యఙా. ఆర్. చందూర్

మధ్యాహ్నం టిఫిన్‌కి - ఆవడలో, పులిహోరో, మినపసున్నో, కారపుగారెలో - ఫక్తు తెలుగువంటకం తయారుచేసేది వసుంధర. ముందుజాగర్తగల మనిషి కనక జగన్నాధం శనివారం సాయింత్రమే ఆదివారం మొదటాటకి సినీమా టికెట్లు కొనితెచ్చేవాడు. టీ అనంతరం భార్యాభర్తలు సినీమాకి వెళ్ళేవారు. మళ్ళీ సోమవారం ఉదయం నుంచీ జగన్నాధానికి ఆఫీసూ, వసుంధరకి యిల్లు. ఇన్నేళ్ళబట్టీ కాపరంచేస్తున్నా వసుంధరకి పిల్లలు కలగలేదు; జగన్నాధానికి తనకి సంతానం లేకపోయిందనే చింతలేదు.

ఆ ఆదివారం ఉదయం వాలుకుర్చీలో కూచుని, గడిచిన రాత్రి విన్నవార్తలు పత్రికాముఖంగా చదువుతున్నాడు జగన్నాధం. తలంటికింకా గంటపైముంది. వసుంధర వంటింట్లో ఉంది. చుంయ్‌మంటున్నాయి గారెల్లో బూరెలో కాని. కొరియా ప్రజలగురించి మనసులో వాపోతున్నాడు జగన్నాధం.

"ఏమండోయ్, యిలా వస్తారూ!" వంటింట్లోనుంచి ఆజ్ఞాపూర్వకమైన ఆహ్వానం.

జగన్నాధం బుజంమీద తువ్వాలేసుకుని, పేపరు చేతబుచ్చుకుని వంటగదిలోకి వెళ్ళాడు.

"చూడండి—ఈ కబోర్డ్ యిటు పక్కగా జరిపి, బొగ్గులబస్తా ఆ మూల పెడితే, కుళాయి తిప్పుతున్నప్పుడు నీళ్లు బొగ్గులమీద చిందవు."

ప్రస్తుతం కుళాయినీళ్లవల్ల బొగ్గులు తడుస్తున్నాయా అవి జగన్నాధం అడగదలుచుకోలేదు. అదంతా హోమ్ డిపార్టుమెంటుది.

"అయితే బొగ్గులబస్తా ఆ మూల పెట్టమన్నావా?" అని అడిగాడు - ఆదివారాలు అలాటి పనులకి అలవాటుపడ్డ జగన్నాధం.

"మీరు మోస్తారుటండీ బొగ్గులబస్తా! బట్టలు మసై పాడుపాడుకావూ? మధ్యాహ్నం పనిమనిషిచేత పెట్టిస్తాను. మీ సలహా అడుగుదామని పిల్చాను."

జగన్నాధం వసుంధర ఆలోచన భేషుగ్గా ఉందన్నాడు.

"ఏమిటా మర్చిపోయిందని పొద్దుట్నుంచీ యిదవుతున్నాను. ఆ తోలుపెట్టెలోవున్న ఉత్తరాలకట్టలు బయటపారెయ్యండి. అవి మంటబెట్టి మీకు వేన్నీళ్లు కాస్తాను. ఉత్తరాలతో యిదో గొడవ - అవి ముక్కలుగా చించి వీధిలో పారేసేందుకు వీల్లేదు. ఇరుగూ పొరుగూ ఆ ముక్కలేరుకు చదువుతారేమోనని భయం. అయినా - వెధవ ఉత్తరాలు, ఎందుకాచెత్త? మనం పట్నంలో ఉంటున్నామేగాని మనది పట్నవాసపు కాపరంకాదు. ఇంటినిండా చెత్తాచెదారం పోగుచేస్తారు. ఎందుకు చెప్పండి పన్నెండేళ్ల కిందటి ఉత్త

రాలు?" గుక్కతిప్పుకోకుండా ఒక భారతం చదివింది.

"కాని...." అన్నాడు జగన్నాథం.

"కానీలేమ - అర్థణాలేదు. రేపు మా మామయ్యగారింటికి పెళ్ళికెళ్లేందుకు నాకు పెట్టెలేదు. తొరగా కాళీచేద్దురూ - మీకు పుణ్యముంటుంది." అన్నది.

"పెట్టె కాళీచేస్తాను. కాని ఉత్తరాలు పరశురామప్రీతిచెయ్యడ మెందుకు? ఎక్కడో ఒకచోట కట్టకట్టిపారెయ్. ఎంతైనా....ఉత్తరాలు!" అని సమాధానపరచబోయాడు జగన్నాథం.

"నాలిక గీసుకుంటారా? అందుకూ పనికిరావు. వెనక ఆ అలమారులో పుస్తకాలుపెడితే, ఏమయాయో చూశారుగా! చెదపురుగులకి సమర్పించే బదులు ఒక కాగెడు నీళ్ళు కాచుకోడం మంచిదికాదూ?"

జగన్నాథం బిక్కమొహం పెట్టాడు. వసుంధరకి నిజంగా దుర్బుద్ధి పుట్టింది. ఇంట్లో కట్టెపుల్లలుండగా పాతఉత్తరాలు కావల్సివచ్చాయా నీళ్ళు కాచేందుకు? దహనకాండలో తను తటస్థంగావుండగోరి, వాలుకుర్చీలోకొచ్చి కూచున్నాడు జగన్నాథం. చటాలున జీన్ క్రిస్టోఫర్ జీవితఘట్టమొకటి స్ఫురణకివచ్చింది.

రోమెన్‌రోలా సృష్టించిన జీన్ క్రిస్టోఫర్ రీన్‌హార్టుదంపతులకు స్నేహితుడవుతాడు. ముగ్గురిమధ్యా అరమరికలు ఉండవు. కాని, ఊసుపోని ఊళ్ళవాళ్ళకి వీరి పవిత్రబాంధవ్యం గిట్టక, రీన్‌హార్టు సతిమీద అపవాదు కల్పించి, ఆకాశరామన్న ఉత్తరాలు ముగ్గురికీ రాస్తూంటారు. ఎవరికి వారు మిగతా యిద్దరికీ ఎలా చెప్పడమా అని మధనపడి ఒకరోజున కుండ బద్దలుకొడతారు. ప్రజలు చల్లిన కల్మషంవల్ల వీరి స్నేహలత కప్పుడే పురుగుపట్టింది. "ఆ ఉత్తరాలు విప్పకుండా పొయ్యిలోకి గిరవాటువేసే ఆత్మబలం మనకి లేకపోయింది కనక విడిపోదాం" అంటూ క్రిస్టోఫర్ తప్పుకుంటాడు.

జగన్నాథానికి క్రిస్టోఫర్ అంత ఏమాత్రమూలేదు. అతని శక్తిలో సహస్రాంశంకూడాలేదు. కాని ఉత్తరాలు కాల్చడం గురించి ఎప్పుడు ఎక్కడ విన్నా, ఈ ఘటన బుర్రలో మెదులుతుందతనికి. వసుంధర చుయ్ మనిపించడం పూర్తిచేసి, తన దగ్గిరకొచ్చినప్పుడు ఈ కథ చెప్పాడు జగన్నాథం.

"నిజమె - లోకులు కాకులు. క్రిస్టోఫరు ఎంత గొప్పవాడు!" అంది వసుంధర. శ్లాఘించడం పూర్తయిందో లేదో, "ఉత్తరాలకట్టలు యింకా బయట పడెయ్యలేదేం?" అంది.

జగన్నాథం వివర్ణుడయాడనొచ్చు; నిశ్చేష్టుడయాడనొచ్చు; కత్తివాటుకి రక్తపుచుక్క లేదనొచ్చు. ఈ లోగా ఉత్తరాలకట్టలు సతీమణి పెల్లగించింది.


వసుంధర కెందుకో ఆ ఉత్తరాల్లో దాచుకోదగ్గ పరిమళంలేదని నమ్మకం. జగన్నాధం తనను పెళ్లాడటానికి పూర్వం కమల, విమల అను యిద్దరు అమ్మాయిల్ని ప్రేమించాడు. వాళ్లిద్దరూ అప్పాచెల్లెళ్లూకారు. కమలని ప్రేమించి, ఆ ప్రేమలో పల్టీకొట్టి, కమలని మరి చేందుకు విమలని ప్రేమించి, అగ్గి భరాటాలాటి విమలని పెళ్లాడే ధైర్యం లేక తనకోసం చెయ్యిచాచాడు. వసుంధరకి కమలా విమలల చరిత తేదీలతో సహా తెలుసు. కాపరానికొచ్చిన కొత్తరికంలో జగన్నాధం తన రోమాన్సులు రోజుకుంటూ రోజుకుంటూ చెబుతున్నప్పుడు తనుకొద్దిగా ఈర్ష్యపడేది. అదైనా గడిచిన దానికోసంకాదు. భర్తకి ముందెన్నడూ చపలత్వం కలగ కూడదని.

కాస్త తెలివిగల ఆడదాని చెప్పుచేతల్లో మసులుకునేందుకు జగన్నాధం లాటిమనిషి యిట్టే వొప్పుకుంటాడు. జీవితంలో నిస్సారత ఏర్పడి స్మృతుల మీద బతికేకాలంలో, ఒక్కొక్క సాయింత్రం జగన్నాధం కమలా విమలల రోమాన్సు నెమరేస్తూంటే వసుంధర వోపిగ్గా వినేది. 'అనగా అనగా రాజు - ఆ రాజుకి ఏడుగురుకొడుకులు అంటూ కొడుకుకథ చెబుతూంటే తల్లి ఎంత నిదానంగా వింటుందో అలా వినేది. భార్యల్లో ఈ మాతృత్వపుఛాయే లేకపోతే మొగాళ్ళు బతకగలరా?

కమలా విమలలు జగన్నాధానికి ఉత్తరాలు రాయలేదు. ఆ విషయం వసుంధరకి స్పష్టంగా తెలుసు. ఈ యిద్దర్నీకాక జగన్నాధం మరొకస్త్రీని కన్నెత్తి చూసివుండడు. అలాటి చిల్లర ప్రణయమేదైనా జరిగివుంటే, యింత కాలం తనతో చెప్పకుండా దాచగలడా?

1935 నుంచి 1944 దాకా సంవత్సరాల ప్రకారం కట్టలు. ఎవరెవరో ఎక్కడెక్కడివాళ్లో రాసినవి. ఆ మనుషులిప్పు డెక్కడున్నారో ఏమయారో తెలీదు. పెద్దపెద్ద ఉత్తరాలు. జగన్నాధమూ రాసేవాడు, వాళ్ళూ రాసేవారు. తాము చదివిన పుస్తకాలూ, చూసిన తమాషాలూ, తిరిగిన ప్రదేశాలూ, జీవితాదర్శాలపట్ల తమ అమూల్యాభిప్రాయాలూ యిలాటివన్నీ రాసుకునేవారు. జీవితం మారుతుంది; అభిప్రాయాలు మారుతాయి. మనుషులు మారుతారు; కాని స్మృతులు చెరక్కుండా నిలుస్తాయి.

వసుంధర కట్టలు జగన్నాధం ముందు పెట్టింది. అక్కడక్కడ కొన్ని మచ్చుకి తీసిచూడటం మొదలెట్టాడు జగన్నాధం. ముప్పయిల్లో తను ఎన్ని ఘనకార్యాలు చెయ్యగలనని అనుకున్నాడు! 1938 లో ప్రపంచంమీద ప్రేమ, మనుషులపట్ల సహనం బాధితులంటే కరుణ - ఏ స్త్రీకీ తను అందకుండా పెద్దపెద్ద డిగ్రీలు సంపాయించి, యింగ్లండూ అమెరికా వెళ్లివచ్చి... అబ్బో—చాలా చేదామను



తున్నాడు. కలలన్నీ పూస్తాయా? లోకాన్ని ఉద్ధరించాలనే తపన ఒక పక్క పీకుతూంటే, 'నిన్ను నువ్వు తెలుసుకో' అనే తత్వం మరోపక్కకి లాగేది ఆ రోజుల్లో.

భార్యాభర్తలిద్దరూ కాసేపు ఉత్తరాలు చదువుకు జ్ఞాపకాలు నమిలారు. ఈ ఉత్తరాలన్నీ జగన్నాధం వికసిత జీవన ప్రథమదశకి ప్రతిబింబాలు. అప్పుడప్పుడు వసుంధర ముడతలుపడే జగన్నాధం నుదుటిమీది చెమటబొట్లుచూసి తనీ ఉత్తరాలకట్టలు మంటబెడతాననే మంకుపట్టుపట్టడం పొరబాటా అని సందేహించేది. కాని వసుంధరలాటి ఆడవాళ్ళు తాము తలబెట్టినపని చేసి తీరుతారు. తమది తప్పని రూఢిఐతే మూడురోజులపాటు ఏడవనన్నా ఏడుస్తారుగాని ప్రారంభించిన పని మధ్యలో ఆపరు.

జగన్నాధం ఒతిమాలినా, వద్దని ఘట్టిగాఅన్నా, వసుంధర ఉత్తరాలు మంటబెట్టి నీళ్ళుకాచడం మానేది. కాని జగన్నాధం అలా అడగడు. వసుంధర వాదంలో తనకి బాధ కలిగించే నిజం ఉందని భావించాడు "పాతగుడ్డలు పారేస్తాం, పాతవస్తువులు పారేస్తాం, పాతపత్రికలు పారేస్తాం – కాని ఎందుకూ కొరగాని పాతజ్ఞాపకాలు ఆ తోలుపెట్టె

నిండా ఎందుకు?" అని అడిగింది వసుంధర. సర్జన్ రోగిమంచికే కోస్తాడు; కాని, ఏడవకుండా రోగి ఉండగలడా?

ఆ ఉత్తరాలమంట చూస్తున్నంతసేపూ జగన్నాధానికి కళ్ళు చెమర్చడమే కాదు-కన్నీళ్ళుకూడా కారాయి. వసుంధర చూస్తుందేమోనని సిగ్గుపడ్డాడు. నీళ్ళు సలసలకాగాయి. అభ్యంగనస్నానం సమాప్తి అయింది.

పాయసం వడ్డిస్తూ వసుంధర అంది! "ఏమండీ మీకు చిన్నప్పు డెప్పుడైనా భోగిపళ్ళుపోశారా మీ అమ్మగారు?" అని.

"ఏం - నీకు పొయ్యాలని ఉందా?"

"అందుకుకాదు. ఆ ఉత్తరాలమంట చూస్తున్నంతసేపూ నాకు భోగిమంటలు జ్ఞాపకం వచ్చాయి."

వసుంధరకి భోగిమంట లెందుకు జ్ఞాపకంవచ్చాయో జగన్నాధం అడగనూ లేదు—ఆమె చెప్పనూలేదు.

ఆదివారంనాటి ప్రోగ్రాం ప్రకారం నాలుగుగంటలవేళ కారపుగారెలు తిని సినీమాకి బయలుదేరారు.

సీజర్ అండ్ క్లియోపాట్రా పిక్చర్లో ఐగుప్తీయ పండితుడు థియోడిటస్ అలెగ్జాండ్రియా గ్రంథాలయం కాపాడమని సీజర్ కాళ్ళావేళ్ళాపడతాడు. మనుషులు పుస్తకాలసాయంతో కలలు కనడం మాని జీవించాలనీ, భూతకాలపు బూడిదలోనుంచి భవిష్యత్తు మొలుస్తుందనీ పలికే రోమన్‌వీరుడికి బర్బరులచరిత్రలు తగలబడటం ఒకలెక్కా - తనసేనలు సంరక్షించుకోవాలిగాని! 'పాతవన్నీ తగలడవల్సిందే' అంటాడు సీజర్.

అప్పుడు వసుంధర జగన్నాధం చెయ్యి తన చేతిలోకి తీసుకుని వేళ్ళు నొక్కింది. ఒక్కసారి తలపక్కకి తిప్పి జగన్నాధం భార్యని చూశాడు. చెంపలు తళతళలాడుతున్నాయి. కాని ఆమె మనసంతా పిక్చర్ మీదనే!

ఆ రాత్రి జగన్నాధానికి వసుంధరలో ఎన్నో కొత్త అందాలు కనిపించాయి.



# ఇదే మనకు మిగిలింది

పాత్రలు :

| | | |
|---|---|---|
| విశ్వపతి | .... | హెడ్ గుమాస్తా |
| నారాయణ, వెంకట్రావు, పేర్రాజు | .... | గుమాస్తాలు |
| శ్యామల | .... | విశ్వపతి కూతురు |

## మొదటి రంగం

(పేర్రాజు ప్రవేశించి దారినిపోతూన్న నారాయణను ఆపుతాడు)

పేర్రాజు : ఏం నారాయణా, నువ్వూ వెంకట్రావూకూడా ఈమధ్య ఏ సెలవురోజు వచ్చినా హెడ్ గుమాస్తాగారింటిదగ్గిరే కనబడుతున్నారట ?

నారా : ఏంలేదు పేర్రాజూ. ఆయన నన్ను రమ్మంటే వెడుతున్నాను నేను. పెండింగు వర్కేదో చాలావుందిలే.

పేర్రా : ఆయన రమ్మంట నిన్నొక్కణ్ణేనన్నమాట ! ఐతే వెంకట్రావుగాడిది పిలవని పేరంటమేనా ?

నారా : అహా, ఇంకా సందేహమేమిటి ?

పేర్రా : నాతో వాడేమన్నాడో తెలుసా ?

నారా : ఏమన్నాడు ?

పేర్రా : విశ్వపతిగారు ఇంటికి రమ్మనిపిలుస్తె తన్నే అనీ. పిలవని పేరంటానికొస్తూంట నువ్వే అనీ అన్నాడు.

నారా : (కోపంతో పళ్లుబిగించి) ఎందుకనడూ ? పోనీఅని ఊరుకుంటూంటే పేట్రేగి పోతున్నాడు. ఇంక ఊరుకోను ! విశ్వపతిగారితో వీడిసంగతి యావత్తూ చెప్పేస్తాను.

పేర్రా : ఏసంగతి ?

---

పాలంకి వెంకటరామచంద్రమూర్తి

నారా : ఆయన అటూ ఇటూ వెళ్లగాచూచి ఈ లుచ్చాగాడు వాళ్ళ శ్యామలతో బాతాఖానీ వేస్తున్నాడు.

పేరా : వాడేమన్నాడో తెలుసా ?

నారా : ఏమన్నాదేమిటి. రాస్కెలు ?

పేరా : శ్యామలతో బాతాఖానీవేస్తూంట నువ్వే అని.

నారా : (కోపంతో) నేనే అన్నాదేం, పోకిరీభడవ ? ఎందుకూ. నీకేతెలుస్తుంది, వాడిజేబు ఒకమాటు తడిమిచూడు.

పేరా : జేబా ? జేబులో సిగరెట్టుముక్కలు మినహా ఏముంటాయి ?

నారా : వాడు శ్యామలమీద రాస్తూన్న చెత్తాకారి పద్యాలన్నీ బయటపడతాయి.

పేరా : పద్యాలా ? వాటిమాట వాడే చెప్పేడులే.

నారా : చెప్పేడు గదా ? నేనుకూడా రాస్తున్నానన్నాడా ?

పేరా : అంటేమాత్రం నేను నమ్మతానా ? ఏమంటే నీకు కవిత్వం చేతకాదుగా ?

నారా : కవిత్వానికి పేద్ద చేతనయే దేముటోయ్ ?

పేరా : అంతేనంటావా ? అలాగైతే వాడికి మల్లే నువ్వుకూడా కొన్ని గీతాలు గీకెయ్యక పోయినావూ ?

నారా : అలా గీకేసి వొలకపొయ్యటానికి నాదేమీ ఉత్తుత్తిప్రేమకాదు పేరాజూ.

పేరా : అంటే ?

నారా : శ్యామలమీద నాకు ఉండుకున్నటువంటి ప్రేమ మాటలతో చెప్పటానికి వీలులేనిదీ, కవిత్వంలో కనపర్చటానికి శక్యంకానిదీని.

పేరా : ఎంచేత చెప్మా ఆ అమ్మాయిని అంతగా ప్రేమించేశావు ?

నారా : ఎంచేతనేమిటి ? శ్యామల చాలా అందమైనది.

పేరా : ఏమంత అందంలే. సంసారపక్షంలో ఉంటుంది.

నారా : అబ్బెబ్బే. అలాగని తోసిపారెయ్యటానికి వీల్లేదు పేరాజూ.

పేరా : నేనుమాత్రం తోసిపారేస్తున్నానా ? తల్లిపోయిన పిల్లయేమో, పనీపాటూ బాగా నేర్చింది శ్యామల. ఇల్లు చక్కదిద్దుకునే నేర్పున్న పిల్ల అని నా ఉద్దేశం....సరే, నా ఉద్దేశానికేం ?....ఐతే నువూ వెంకట్రావూకూడా శ్యామలయొక్క సౌందర్యాతిశయానికి ముగ్ధులై ఆమెను పెళ్లిచేసుకునే ప్రయత్నంలో ఉన్నారన్నమాట.

నారా : నాతో ఆ పింజారీగాణ్ణికూడా కలుపుతా వెందుకు ? వాడిప్రేమ పద్యాలతో ఆరంభమై అక్కడితో ఆగిపోయి ఊరకుంటుంది.

పేరా : నీప్రేమ ?

నారా : నాప్రేమా ? అది హృదయంలోపుట్టి, పెరిగి, పెరిగి....ఊ....పెరిగి (ఏం చెప్పాలో తోచక నీళ్లు నములుతాడు.)

పేర్రా : పెరిగిపెరిగి ఆఖరికి ఏమవుతుంది?

నారా : ఏమవుతుందా? అదే చెప్పలేకపోతున్నా. మాటలలో చెప్పడానికి శక్యంగాని దన్నాగా నాప్రేమ! శ్యామలను వివాహంచేసుకోవాలనటంలో నాకున్న ఉద్దేశం చాలా పవిత్రమైనదీ, ఉత్తమోత్తమమైనదీన్నీ.

పేర్రా : వెంకట్రావు ఉద్దేశం?

నారా : ఉత్త నీచమైనది! శ్యామల అందంచూసీ, ఆమెను ప్రేమించీకాదు వాడామెను పెళ్లిచేసుకోవాలని అంటూంట.

పేర్రా : ఇంక దేనికోసం మరి?

నారా : విశ్వపతిగారి భూమికోసం.

పేర్రా : ఏంచిత్రంగావుంది! వెంకట్రావునుగూర్చి ఇప్పుడు నువ్వు ఏమన్నావో, వాడు నిన్నుగూర్చి అదే అన్నాడు. ఎటొచ్చీ కవిగనక కాస్త చమత్కారంగా అన్నాడు.

నారా : చమత్కార మేమిటి చట్టుబండలు? ఏం పేలేదేమిటి?

పేర్రా : 'నారాయణకు శ్యామలపైగాదు ప్రేమ. విశ్వపతిగారి సస్యశ్యామలమైన నేలమీద' అని....సరేగాని నారాయణా, నీకుగాని వాడికిగాని శ్యామల్ని పెళ్ళిచేసుకున్నంత మాత్రాన్ని విశ్వపతిగారి మాన్యం ఎలావస్తుంది?

నారా : 'నీకుగాని' అంటున్నావు. నాకు వెంకట్రావుకుమల్లే ఆ మాన్యంమీద దృష్టిలేదుగా?

పేర్రా : నీకులేదనే అనుకుందాం. పోనీ ఆ వెంకట్రావుకే ఎలాగవస్తుందీ అని:

నారా : వాడికి రావటానికి, ఆ దగుల్బాజీని శ్యామల ఎన్నటికీ పెళ్ళిచేసుకోదుగా?

పేర్రా : (విసుగ్గా) నీ కావేషీ వెల్లబోసుకుంటున్నావేకాని, నేను చెప్పే విషయం గ్రహించటంలేదు.

నారా : చెప్పేమిటో.

పేర్రా : శ్యామల్ని పెళ్ళిచేసుకున్నవాడికి విశ్వపతిగారి భూమి సంక్రమిస్తుందనుకోవటం శుద్ధ పొరబాటు. ఏమంటే విశ్వపతిగారు మళ్ళీ వివాహం చేసుకుంటారుట ...ఎందుకూ అలా వెలవెల పోతున్నావు? (నవ్వుతో) ఆ పుట్టెడు భూమీ జారిపోతోందనే?

నారా : (ఉడుకుతో) నేనెందుకు వెలవెలపోతాను? ఈసంగతి తెలుస్తే వెంకట్రావు వెలవెలపోతాడు. (కసిగా) వెలవెలపోవటమేకాదు, గిలగిలకొట్టుకు ఛస్తాడు! ఈవిధంగా వాడిపీడ వదిలిపోయి, పోటీలేకుండా శ్యామల్ని నేనే పెళ్లిచేసుకోవచ్చు.... (ఉండబట్టలేక) ఔనుగాని పేర్రాజూ, ఏభైయేళ్ళు నెత్తికొచ్చిన విశ్వపతికి ఈ పొయ్యేకాలమేమిటి? పెళ్ళిచేసుకుంటానని సిద్ధపడితేమాత్రం ఈ ముసిలివాడికి పిల్లనిచ్చేవాడెవరు?

పేర్రా : ఎవడైనా ఇస్తాడు. ఆయన భూమిమీద కన్నువేసినవాళ్లు చాలామంది ఉన్నారు. అగ్రహారంలో ఉన్న సోమయ్యగారిని ఎరగవు?

నారా: ఎరక్కేం? ఆయన తన కూతుర్ని ఇస్తానంటున్నాడా?

పేరా: ఔను. విశ్వపతిగారు పెళ్లి కుమార్తె ఎదిగినదానో కాదో చూసుకోటానికి వెడుతున్నాట్ట. కొత్తగా సూటుకుట్టిస్తున్నాడు.

నారా: (కోపంగా) సూటుగాదు. ఏడుకట్ల సవారీ తయారుచేయించుకోమను (వెనక్కి మళ్లుతాడు).

పేరా: (నవ్వుతో) నీకెందుకురా అంత బాధ?.........ఏం వెనక్కి మళ్లేవు? విశ్వపతి గారింటికని బయల్దేరినట్లున్నావు. వెళ్లవూ?

## రెండో రంగం

(ఆ సాయంత్రం—విశ్వపతిగారింట)

విశ్వపతి: శ్యామలా, ఆ గుమాస్తా లిద్దర్లోనూ ఒకడూవచ్చినట్లు లేదే ఈవేళ?

శ్యామల: ఒకడూ రాలేదు. ఔనుగాని నాన్నా ఆఫీసులో చేయిస్తూన్నది చాలక వీళ్లని ఇంటిక్కూడా ఎందుకు రమ్మన్నావు?

విశ్వ: (నవ్వుతో) నేను రమ్మనందే! వాళ్లంతటవాళ్లే వస్తున్నారు. మొదట నారాయణ ప్రారంభించాడు. అతణ్ణి చూసి వెంకట్రావూ వస్తున్నాడు.

శ్యా: ఎందుకొస్తూన్నట్టు?

విశ్వ: ఆఫీసులో పై ఉద్యోగం ఒకటి ఖాళీ ఐందిలే.

శ్యా: ప్రాపకానికి బయల్దేరారన్నమాట?

విశ్వ: అందుకే మరి. రానియ్. ఇదీ మంచిదే. ఆఫీసులో వీళ్ల పనిచేసే దెలాగాలేదు. ఇక్కడైనా చేస్తారు.

శ్యా: ఇక్కడమాత్రం చేస్తున్నారా?

విశ్వ: ఏం? చెయ్యటంలేదా?

శ్యా: నువ్వు ఉన్నప్పుడు ఏంచేస్తారోగాని నువ్వు వెళ్లగా చూసి ఎందుకో ఒకందుకు కొట్లాడుకుంటారు.

విశ్వ: ఓ, అలాగా? నాకు తెలీదే ఆ సంగతి?

శ్యా: నాకూ తెలవకపోను. మొన్ననొకసారి కిందకేవచ్చి దొమ్ములాడుకున్నారు.

విశ్వ: ఎందుకు?

శ్యా: మొదట ఆ నారాయణన్నాయనవచ్చి, 'కాసిన్ని మంచినీళ్లిస్తారా?' అని అడిగేడు నన్ను. నేను నీళ్లతో గ్లాసుపట్టుకొచ్చేటప్పటికి వెంకట్రావుగారు మెట్లు దిగొచ్చి, 'మేడమీద మరచెంబులో నీళ్లుండగా కిందకు రావలసొచ్చిందా నీకు?' అని గదమాయించాడు. నారా

యణ పీళ్లు తాగకుండానే, 'డామ్ రాస్కెల్ గెటవే' అంటూ వెంకట్రావుని మేడమీదికి తరుముకుపోయాడు. ఆ సాయంకాలమే మళ్లీ యేం జరిగిందో తెలుసా?

విశ్వ: ఏంజరిగిందేమిటి?

శ్యా: 'పెన్నులు చెక్కుకోవాలి, చాకుంటే ఇద్దురూ' అంటూ వెంకట్రావుగారు కింద కొచ్చాడు. వెనకాలే నారాయణ పరుగెత్తుకొచ్చి 'నావద్ద బ్లేడుండగా అడక్క కిందకెందుకు వచ్చావు?' అంటూ గెంటుకుపోయాడు.

విశ్వ: ఆ ప్రమోషనుకోసం వీళ్లలో కావేషీలు బయల్దేరే యన్నమాట. ఇతే కొనకి ఆ ఉద్యోగం వీళ్ళిద్దరిలో ఎవడికీకాదు.

శ్యా: ఏం?

విశ్వ: ఆ పేర్రాజు అన్న గుమాస్తాకిస్తారు ఆ ఉద్యోగం. అతను వీళ్ళకుమల్లేకాకుండా, మంచి తెలివైనవాడూ పనిచేసేవాడూను. ఆఫీసరుక్కూడా అతనంటేనే ఇష్టం.

## మూడో రంగం

(ఆఫీసు వరండా—వెంకట్రావూ, నారాయణా ప్రవేశిస్తారు.)

వెంక: నారాయణా, విశ్వపతిగారు సెలవుపెట్టి ఎక్కడికో వెళ్లేట్ట.

నారా: ఎక్కడికి వెళ్ళేదో నీకు శ్యామల చెప్పినట్టు.

వెంక: శ్యామలా? నువ్వు శ్యామల్ని ప్రేమించావని తెలిసినప్పట్నుంచీ, నేను ఆగుమ్మం తొక్కటం మానేశానుగా?

నారా: అదేమన్నమాట? ఆ అమ్మాయంటే నీకు మోజని తెలిసినప్పట్నుంచీ నేను వాళ్ళ వీధివైపేచూడ్డం మానేశాను.

వెంక: (నవ్వుతో) నువ్వెందుకు మానేశావో నాకుతెలుసులే!

నారా: నాకుమాత్రం తెలీదా నువ్వెందుకు మానేశావో!

వెంక: తెలుస్తే చెప్పు.

నారా: ముందు నువ్వుచెప్పు.

వెంక: విశ్వపతిగారు పెళ్లిచేసుకుంటే ఆ పుట్టెడు భూమీ నీకు దక్కదనేగా?

నారా: నువ్వూ అందుకే మానేస్త.

వెంక: అందుకే అనుకో పోనీ. ఇంక ఆగొడవ ఎందుకులే. విను; విశ్వపతిగారు పెళ్ళికూతుర్ని చూసుకోటానికి వెళ్లేట్ట.

నారా: ఉష్! మెల్లిగామాట్లాడు. పేర్రాజు వస్తున్నాడు.

పేర్రా: (ప్రవేశించి) ఏమిటబ్రోయ్. మళ్ళీ మీ ఇద్దరికీ ఈజోస్తీ ఎప్పట్నుంచి? కొనగాని, ఉన్నట్టుండి మీ ఇద్దరూ ఒక్కటేమాటుగా హెడ్‌గుమాస్తాగారింటికి వెళ్ళటం మానేశారేం? ఆయన మళ్లీ పెళ్ళి చేసుకుంటున్నాడనేనా?

నారా : (చీదరించుకుంటూ, రబ్బిష్ ! ఆయనకు పెళ్ళైతే మాకేం ?

వెంక : (వెంటనే) పెడాకులైతే మాకేం ?

పేర్రా : (నవ్వుతో) అబ్బే. మరేంలేదూ, ఆయినభూమీ........

నారా : (తొందరగా) ఒరేయ్ పేర్రాజూ. ప్రమాణంచేసి చెపుతున్నాను. నాకు ఆ భూమి మీద ఎన్నడూ ఆశలేదు.

వెంక : (వెంటనే) పేర్రాజోయ్. ఐంర్యుంపట్టుకు చెపుతున్నాను. నాకు ఆ ఆశ అసలేలేదు.

పేర్రా : ఈమాత్రందానికి ప్రమాణాలుకూడా ఎందుకర్రా మీయిళ్ళు బంగారంగానూ ! మీరు చెపితే నేను నమ్మనుగనకనా ? ఐతే ఇంక శ్యామల్ని మీలో ఎవరు పెళ్ళిచేసుకోబోతున్నారు ?

నారా : నాకా కోతిముఖం అక్కర్లేదు.

పేర్రా : (ఆశ్యర్యం కనపరుస్తూ) కోతిమొహమా ? శ్యామల ముఖం అలా ఎప్పుడు మారిపోయింది ? పదిరోజులకిందటేగా ఆ అమ్మాయి చాలా అందమైనదన్నావు ?

నారా : అంటే అన్నాను. ఇప్పుడు వెంకట్రావుకోసం వదిలిపెట్టేశాను.

వెంక : నాన్నెన్ను ! నాకోసం వదిలెయ్యటం ఏమిటి ? ఆ భల్లూకంకోసం నే నెన్నడూ పాకులాడలేదు.

పేర్రా : (అశ్చర్యంతో) ఏమిటి ? భల్లూకమా ? ఏం చిత్రంగావుంది ? ఈమధ్యనేగా ఆ అమ్మాయి ముఖాన్ని వర్ణిస్తూ, 'శీతకిరణుండు నినుజూచి సిగ్గువడియె' అన్న పద్యంరాశావ్ ?

వెంక : ఆ పద్యం ఆపిల్లమీదే రాశానని ఎందుకనుకోవాలి ?.... ఐతేమాత్రం ఇంత వయస్సొచ్చాక మళ్లీ పెళ్ళికి సిద్ధపడే విశ్వపతిలాంటి కేరక్టరులేనివాడి కూతుర్ని ఎవడు పెళ్ళాడుతాడు పేర్రాజూ ?

పేర్రా : పోన్లెండర్రా. మీరిద్దరూ ఇలా దిష్టికొట్టేరు గనుకనే ఆయన పెళ్లి అలా నీళ్ళుకారిపోయింది.

నారా : (అత్రుత కనపరుస్తూ) ఏమిటీ ? నీళ్ళుగారిపోయిందా ?

వెంక : (అత్రుత కనపరుస్తూ) ఏమిటీ ? నిజంగానే ?

పేర్రా : మీకు తెలియనే తెలియదన్నమాట ?

నారా :<br>వెంక : } (కలిసి) తొరగాచెప్పరాబాబూ, ఏంజరిగిందో ?

పేర్రా : సోమయ్యగారి కూతురు—

నారా : ఈయనకి నచ్చలేదా ?

పేర్రా : అబ్బే. ఆ పిల్లకే ఈయన నచ్చలేదు.

వెంక : ఐ-దీ మంగళం ? ఎలా నచ్చుతాడులే.

నారా : అందుచేత ఆ పిల్ల ఒప్పుగోలేదన్నమాట ?

పేర్రా : అంతేగాదు ; మళ్లీ ఆమాట తలపెడితే నూతులో దిగుతానందిట.

వెంక : భేష్ ! 'తగుదునమ్మా' అని సిద్ధపడినందుకు ఈయనకి మంచి బాగా అయింది శాస్తి !

## నాలుగో రంగం

(ఆ రాత్రి—పేర్రాజు ఇంట)

నారా : పేర్రాజూ.

పేర్రా : ఏం, ఇలావచ్చావ్ ?

నారా : నాకో ఉపకారం చెయ్యాలి బ్రదర్.

ఫేర్రా ; ఏమిట్రోయ్ ?

నారా : హెడ్ క్లర్కుగా రింటిదగ్గిర్నుంచివచ్చిన బంట్రోతు చెపుతున్నాడు.

పేర్రా : ఏమని ?

నారా : ఆ దెబ్బతో విశ్వపతిగారికి మళ్లీ పెళ్లి అంటే మొహం తిరిగిపోయి. ఇంక శ్యామల పెళ్లిమాట ఆలోచిస్తున్నాట్ట.

పేర్రా : మరేట.

నారా : నీకూ తెలుసునన్నమాట ! వారికి ఇల్లరికానికి వప్పుగునే అల్లుడు కావాలిట.

పేర్రా : ఔనట. వెంకట్రావు చెప్పేడు.

నారా : (కోపంగా) చెప్పేడూ ? ఈ శకునపక్షిగాడికి అప్పుడే తెలిసిందన్నమాట !

పేర్రా : తెలియటానికేంలే. నీకు తెలిసినట్లే వాడికీ తెలిసి ఉంటుంది. సరే. ఇంతకూ నీకు నేను చెయ్యవలసిన దేమిటో చెప్పు.

నారా : విను బ్రదర్. శ్యామలను నేను ప్రేమించాను. కనుక ఇల్లరికానికైనా వప్పుగుంటాను. నువ్వు నన్ను శిఫార్సుచేసి ఈ సంబంధాన్ని రైట్ చెయ్యాలి.

పేర్రా : (వెటకారంగా) ఎవరికి ? ఆ కోతిముఖం శ్యామలకేనా ?

నారా : (దీనంగా) ఎందుకురా పేర్రాజూ నన్నిలా ఏడిపించటం ?

పేర్రా : ఏడిపించనులే......సరేగాని ఇప్పుడొక గొప్ప చిక్కువచ్చింది.

నారా : ఏమిటి ?

పేర్రా : వెంకట్రావుగాడు సాయంత్రమేవచ్చి శ్యామలమీద తాను వ్రాసిన పద్యాలన్నీ వినిపించి వెళ్లేడు. తానూ ఇల్లరికానికి వప్పుగుంటున్నాననీ, తనకు శ్యామల్ని రైట్ చెయ్యవలసిందనీ ప్రాధేయపడ్డాడు.

నారా : చేస్తానని వాగ్దానమివ్వలేదుగద!

పేరా : లేదులే. ఏమంటే నువ్వుకూడా వస్తావని నాకు తెలుసుగా?

నారా : మాయిద్దరిలోనూ నేను పీకెక్కువ స్నేహితుణ్ణి గనక నువ్వు నాపక్షాన్నే పనిచెయ్యాలి.

పేరా : అలా అనటం న్యాయంకాదు నారాయణా. పోనీ ఓ పని చేద్దాం.

నారా : ఏమిటి?

పేరా : చీట్లువేసి, మీలో ఎవరిచీటీవస్తే వాడికి రైట్‌చేస్తాను.

నారా : ఊహూ; నాకు లాటరీమీద నమ్మకంలేదు.

పేరా : లేకపోతే మరోటిచేస్తాను. శ్యామలవద్దకువెళ్ళి, మీయిద్దరిమాటాచెప్పి, ఆమె ఎవర్ని ఎన్నుకుంటే వాడికి నిశ్చయంచేస్తాను.

నారా : ఈ ఆలోచన బాగానేవుంది. ఏమంటే శ్యామల ఎలాగా నన్నే ఎన్నుకుంటుంది.

పేరా : వెంకట్రావు శ్యామల తన్నే వరిస్తుందంటున్నాడు. సరే చూద్దాం ఏంజరుగుతుందో.

## ఐదో రంగం

(మర్నాడు—విశ్వపతిగారింట)

పేరాజు : శ్యామలగారూ, ఉపోద్ఘాతంలేకుండా రెండుమాటల్లో చెప్పేస్తున్నాను నారాయణా, వెంకట్రావూకూడా మిమ్మల్ని పెళ్ళిచేసుకోవాలని నిశ్చయించుకున్నారు.

శ్యామల : అలాగాండి?

పేరా : వాళ్ళిద్దర్లోనూ ఎవరుమీకు నచ్చారో తెలుసుకుని, వాడికి సంబంధం రైట్‌చేసి రమ్మని నన్నుకోరి, పంపేరు.

శ్యామ : సరేకాని పేరాజుగారూ, వారిద్దరిలో నాకొకరూ నచ్చలేదు.

పేరా : (నిర్ఘాంతపోయి) ఓ, అలాగునా! కారణం?

శ్యామ : మీరుచెప్పమంటే చెపుతాను.

పేరా : మరేంలేదు. 'ఎంచేత?' అని వాళ్ళు అడిగితే చెప్పటానికివీలుగా ఉంటుందేమో అని.

శ్యామ : ఐతే చెపుతాను. ఏంలేదూ, వాళ్ళిద్దరూకూడా ఉత్త అయోగ్యులని తెలిసిందండీ.

పేరా : ఏమన్నారూ? 'అయోగ్యులా?' ఈమాటవింటే వాళ్ళిద్దరూకూడా ఏడ్చేస్తారనుకుంటాండీ.

శ్యామ : దానికి నేనేంచెయ్యను? ఈమాట వాళ్ళు అన్నదేగాని నేను పుట్టించిందికాదు.

పేరా : సరి!

శ్యామ : 'నారాయణ అయోగ్యుడు' అని శ్రీ వెంకట్రావుగారూ, 'వెంకట్రావు అయోగ్యుడు' అని శ్రీ నారాయణగారూ వేరువేరుగావచ్చి నాతో చెప్పివెళ్ళేరు.

పేరా : అయితే ఇంక నేను వాళ్లకు చెయ్యగలిగిందేమీలేదు. శెలవుమరి.

శ్యా : ఉండండి. వెళ్లిపోకండి. మీతో నేనొకమాట చెప్పాలి.

పేరా : నాతోటా ! ఏమిటి ? చెప్పండి,

శ్యా : నాపెళ్లిమాట తెచ్చారు గనుక చెపుతున్నాను. నేను పెళ్లిమాత్రం శీఘ్రంగా చేసుకో దలుచుకున్నాను.

పేరా : శుభమస్తు. ఆ సంగతి తెలుస్తే ఈ రాయబారానికి రాకపోదునునుమండి ! క్షమించాలి.... ...ఏ వూరేమిటండి, ఆ మగపెళ్లివారిది ?

శ్యా : (కొంటెగా) ఈ ఊరే! నేను ఆయనను వరించినట్లింకా ఆ పెళ్లికుమారుడికే తెలీదు. మీరు నాపెళ్లి విషయంలో శ్రద్ధచూపుతున్నారు గనక నా సంగతి ఆయనక్కు చెప్పి. ఈ పెళ్లికి వప్పించాలి.

పేరా : ఓ, అలాగే వప్పిస్తాను, దానికేం ? మీరేం పరాయివాళ్ల గనకనా ? మా విశ్వపతి పంతులుగారి అమ్మాయిలేగా ? చెప్పండతనెవరో.

శ్యామ : (కొంటెగా నవ్వుతో) ఎవరా ? చెప్పమన్నారా ? ఇంక వేరే నానోటమ్మట చెప్పించాలా ? మీరే ! (అంటూ లోపలికి పారిపోతుంది.)

## ఆరో రంగం

(నారాయణా, వెంకట్రావూ ప్రవేశిస్తారు.)

నారా : ఎంత ద్రోహంచేశాడు పేరాజు ! మనకోసమని వెళ్లి శ్యామల్ని తను పెటిల్ చేసుకున్నాడు !

వెంక : నేను రాసిన పద్యాలు నాలుగూ చదివేసి ఆ పిల్లను వశంచేసుకుని ఉంటాడు రాస్కెలు !

నారా : ఏమైతేనేం, పిట్టాపిట్టా తగువు పిల్లితీర్చినట్టయిపోయింది మన పని !

వెంక : నిష్కారణంగా, విశ్వపతిగారి పుట్టెడు భూమీ మధ్య వీడికి దక్కింది ! ఎంత అదృష్టమో చూడరా !

నారా : ఇదంతా మన దురదృష్టంరా బాబూ. లేకపోతే మనకళ్లముందర వీడికి ఒక్కమాటుగా, ప్రమోషను, పెళ్లి, భూమి........అన్నీవచ్చి పడడమేమిటి చెప్పు !

వెంక : (గద్గదస్వరంతో) వీడి అదృష్టాన్నిగూర్చి ఆలోచిస్తూన్నకొద్దీ నాకు ఏడుపొస్తోందిరా నారాయణా !

నారా : (ఏడుస్తూ) మనకిద్దరికీ మిగిలింది ఈ యేడుపేరా నాయనా :

(ఏడ్చేసి, పోతారు.)



# సెప్టెంబర్ నెల

# భావ పరిచయ పోటీ

## బహుమానం రూ 10-0-0



ఈ కార్టూనుకు హాస్యయుత వ్యాఖ్య (Caption) కావాలి.

వ్యాఖ్య వచనంగాగానీ, పద్యంగాగానీ వుండవచ్చు. వచనంగా అయితే ఒక్క వాక్యంలోనూ, పద్యంగా అయితే నాలుగుపాదాలలోపుగానూ వుండాలి.

వ్యాఖ్య కార్డుపైననే వ్రాసిపంపాలి. కవరులో పంపినవి అంగీకరింపబడవు.

మాకుచేరిన వ్యాఖ్యలలోకెల్లా ఉత్తమంగావున్నదానికే బహుమానమివ్వబడును.

బహుమతినిర్ణయంలో సంపాదకునిదే తుదినిర్ణయం. ఉత్తరప్రత్యుత్తరాలునడుపబడవు.

వ్యాఖ్య మాకు సెప్టెంబర్ 20-వ తేదీలోగా చేరాలి.

ఆంధ్రజ్యోతి పాఠకులందరూ ఈ పోటీలో పాల్గొనవచ్చును. ప్రవేశరుసుము లేదు.